ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

శ్రీకాకుళం : fb.com/vaartha Digital

Published from Srikakulam, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,

9-10-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 250 పేజీలు: 16 వెల: 6.50

పెళ్లిలో విందు ఇస్తే రూ. లక్ష జరిమానా

బంగ్లా బిచ్చగాడికి 21 మంది భార్యలు 5లో

గ్లోబల్ సమన్వయంతో సైబర్ మోసాలకు చెక్

డిజిటల్ చెల్లింపుల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: మొబైల్ కాంగ్రెస్ సమావేశంలో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ, అక్టోబరు 8: భారత్‌లో డిజిటల్ విప్లవం మరింత వేగంగా కొనసాగుతున్న నేపథ్యంలో సైబర్ మోసాలను అరికట్టేందుకు ప్రపంచవ్యాప్త సమన్వయం అవసరమని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. సైబర్ నేరాలనుంచి ప్రజలను రక్షించేందుకు అంతర్జాతీయ స్థాయిలో ఒక గ్లోబల్ ఫ్రేమ్ వర్క్‌ను రూపొందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. న్యూఢిల్లీలోని యశో భూమిలో జరుగుతున్న ఇండియా మొబైల్ కాంగ్రెస్ 2026 పదో ఎడిషన్‌ను గురువారం ప్రధాని మోడీ ప్రారంభించారు. నేటి నుంచినుంచి 10 వరకు నిర్వహిస్తున్న ఈ >>2

కెనడా రచయిత్రికి సాహిత్య నోబెల్

సరికొత్త ప్రక్రియల సృష్టికర్తగా అన్నే కార్సన్‌కు అత్యున్నత పురస్కారం

స్టాక్‌హోమ్, అక్టోబరు 8: ప్రతిష్టాత్మక నోబెల్ పురస్కారాలను వరుసగా ప్రకటిస్తున్న రాయల్ స్వీడిష్ అకాడమీ..గురువారం సాహిత్య రంగంలో అవార్డును ప్రకటించింది. కెనడాకు చెందిన రచయిత్రి, కవయిత్రి కూడా అయిన 76 యేళ్ల ఆన్ కార్సన్ ఈ అవార్డును సొంతం చేసుకున్నారు. సమకాలీన కవిత్వం, గద్య రచనలలో అత్యంత విశిష్టమైన రచయిత్రిగా పేరున్న కార్సన్‌కు ఈ యేడాది నోబెల్ సాహిత్య పురస్కారం ప్రకటించారు. ఈ మేరకు స్వీడన్ రాజ >>2

విలక్షణ నటుడు నానా పటేకర్ కన్నుమూత

3 సార్లు జాతీయ అవార్డులు, పద్మశ్రీ అందుకొన్న నటుడు

రాష్ట్రపతి సహా పలువురు ప్రముఖుల సంతాపం

పనాజి, అక్టోబరు 8: భారతీయ సినీ పరిశ్రమలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. విలక్షణ నటనకు చిరునామాగా నిలిచిన ప్రముఖ నటుడు నానా పటేకర్ (75)గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. గోవాలోని తన నివాసంలో >>2

జిఎస్టీ కౌన్సిల్ కీలక నిర్ణయాలు

పన్ను అధికారుల అరెస్ట్ అధికారానికి స్వస్తి

ప్రాసిక్యూషన్ పరిమితి రూ.5 కోట్లకు పెంపు

న్యూఢిల్లీ, అక్టోబరు 8: వస్తు సేవల పన్ను (జిఎస్టీ) వ్యవస్థలో కీలక మార్పులకు జిఎస్టీ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. పన్ను అధికారులకు ఉన్న అరెస్ట్ చేసే అధికారాన్ని తొలగించడంతో పాటు, ప్రాసిక్యూషన్‌కు సంబంధించిన పరిమితిని రూ.1 కోటి నుంచి రూ.5 కోట్లకు పెంచినట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ గురువారం వెల్లడించింది. చిన్న స్థాయి విక్రేతలకు ఈకామర్స్ ప్లాట్‌ఫామ్‌లపై వ్యాపారం నిర్వహించేందుకు నిబంధనలనుకూడా కౌన్సిల్ సులభతరం చేసింది. >>2

చింతూరు మన్యంలో మరో 'ఉద్దానం' కలకలం

కిడ్నీ సమస్యలతో నలుగురు మృతి.. ఒకే కుటుంబంలో ముగ్గురు

మృత్యువుతో పోరాడుతున్న మరొకరు.. పలువురికి కిడ్నీ సమస్యలు

వ్యాధికి కారణం తెలియక భయాందోళనలో గ్రామస్తులు

తాగునీటి నాణ్యతపై సమగ్ర పరీక్షలు చేయాలని డిమాండ్

కిడ్నీ సమస్యతో బాధపడుతున్న వ్యక్తి

చింతూరు, అక్టోబరు 8, ప్రభాత వార్త: పోలవరం జిల్లా చింతూరు మన్యంలో కిడ్నీ సమస్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. చింతూరు మండలం జువ్వియిగూడెం అనే చిన్న గిరిజన గ్రామంలో కిడ్నీ సంబంధిత అనారోగ్యంతో నలుగురు మృతి చెందినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. మృతుల్లో ముర్రం ముత్తమ్మ, ముర్రం కన్నమ్మ, ముర్రం ముత్తయ్య ఒకే కుటుంబానికి చెందినవారు.

ఇదే కుటుంబానికి చెందిన ముర్రం సుబ్బయ్య ప్రస్తుతం కిడ్నీ సమస్యతో తీవ్రంగా బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాధి చివరి దశలో ఉందని వైద్యులు తెలిపినట్లు వారు చెబుతున్నారు.

ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి.. మరొకరు మృత్యువుతో పోరాటం

సుబ్బయ్య కుటుంబ పరిస్థితి హృదయ విదారకంగా మారింది. నలుగురు పిల్లల్లో ఒకరైన రమాదేవి ఐదో తరగతి చదివి మానేసి ఇంటి వద్దే ఉంటోంది. మరో ఇద్దరు ఆశ్రమ పాఠశాలలో విద్యనభ్యసిస్తుండగా, మరో బాలుడు గ్రామంలోని పాఠశాలలో చదువుతున్నాడు. తల్లి లేకపోవడం, తండ్రి కూడా నడవలేని స్థితిలో కిడ్నీ వ్యాధితో బాధపడుతుండటంతో ఆ చిన్నారుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. తండ్రి వ్యాధి చివరి దశలో ఉందని వైద్యులు చెప్పిన విషయం తెలిసిన తర్వాత.. ఇప్పటికే తల్లిని కోల్పోయినఆపిల్లలు తండ్రినికూడా కోల్పోతా >>2

● మోదీ స్ఫూర్తిదాయక నాయకత్వం

గోదావరి-కావేరి అనుసంధానంతో

అద్భుత ఫలితాలు

కేంద్రం చొరవ, రాష్ట్రాల సమన్వయంతో నీటి కష్టాలకు చెక్

గురువారం ఢిల్లీలో ప్రధాని మోడీని సత్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

గోదావరి పుష్కరాల నిర్వహణకు ప్రత్యేక నిధులివ్వండి

ప్రధాని మోడీతో భేటీలో సిఎం చంద్రబాబు ప్రతిపాదనలు

రాష్ట్రంలో అభివృద్ధి, ఆర్థిక పరిస్థితిపై ప్రధానికి సిఎం వివరణ

25 యేళ్ల పాలనా ప్రస్థానంపై మోడీకి బాబు శుభాకాంక్షలు

అమరావతి, అక్టోబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి: 25 యేళ్ల పాలనా ప్రస్థానంపై ప్రధాని నరేంద్ర మోడీకి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. దేశ సేవలో అరుదైన ఘనత సాధించిన ప్రధాని మోడీ సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ముఖ్యమంత్రిగా, ప్రధాన మంత్రిగా స్ఫూర్తిదాయక నాయకత్వాన్ని చూపారని, క్రమశిక్షణ, నిబద్ధతతో దేశానికి సేవలు అందించారని అన్నారు. దూరదృష్టి, స్పష్టమైన లక్ష్యం, ధృడమైన నిర్ణయాలు, సమర్థవంతమైన పాలనతో భారత్‌ను ప్రపంచ శక్తిగా మలిచారని కీర్తించారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో భారత దేశగమనాన్ని మర్చారని సిఎం చంద్రబాబు అన్నారు. >>2

గురువారం ఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద ధర్నా చేస్తున్న ఖర్గే, రాహుల్, ప్రియాంకా తదితరులు

గాంధీ సాక్షిగా మహా ధర్నా

● ఢిల్లీ రాజ్‌ఘాట్ వద్ద 'ఇండి' నేతల భారీ ఆందోళన ● జ్ఞానేశ్, మోడీ, అమిత్‌షా రాజీనామాకు డిమాండ్ ● నేడు రాష్ట్రపతితో కూటమి నేతల భేటీ

న్యూఢిల్లీ, అక్టోబరు 8: ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పట్ల నిరసన తెలుపుతూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్‌పై మూడో రోజు ఆందోళనకు కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి సిద్ధమైంది. ఇక శుక్రవారం రాష్ట్రపతిని కలిసేందుకుకూడా నిర్ణయించారు.రాష్ట్రపతి భవన్‌కు మార్చ్‌గా వెళ్లాలనినిర్ణయించారు. ఇందుకోసం ఇప్పటికే రాష్ట్రపతి భవన్‌కు 15 మందితో కూడిన లేఖను జతచేస్తే పదిమందికి అను >>2

పెండింగ్ అంశాలు పరిష్కరించండి 3

ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లలో ప్రజాభిప్రాయ సేకరణ వేగంగా జరిగేలా చూడండి

కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్‌కు సిఎం చంద్రబాబు వినతి

అమరావతి ఓఆర్ఆర్‌కు పూర్తి సహకారం అందించండి

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి సిఎం చంద్రబాబు విజ్ఞప్తి 2

పోర్టుల అభివృద్ధికి 20 వేల ఎకరాల ఉప్పు భూములు ఇవ్వండి 2

వాణిజ్య పంటలకు అండగా నిలవాలి..

కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌కు సిఎం చంద్రబాబు విజ్ఞప్తి

బిసిలకు 34% రిజర్వేషన్లు కట్టుబడి ఉన్నాం

నామినేటెడ్ పదవుల భర్తీ సమీక్షిస్తాం

మీడియాతో ఇష్టాగోష్టిలో మంత్రి లోకేష్

ఎంత సీనియర్ నేతలైనా పార్టీ లైన్‌కు కట్టుబడి ఉండాలి

టిడిపి ట్రైనింగ్ రిసోర్స్ పర్సన్స్‌తో మీట్ అండ్ గ్రీట్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్

విజయవాడ,అక్టోబరు 8,ప్రభాతవార్త ప్రతినిధి: స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిల రిజర్వేషన్ల అంశంలో పూర్తి స్పష్టతతో ఉన్నామని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయా నికి వచ్చిన లోకేష్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం మీడియాతో ఇష్టాగోష్ఠి నిర్వహించిన లోకేష్ స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు సిద్ధంగా ఉన్నామని పునరుద్ఘాటించారు. కోర్టు తీర్పు ఎలా ఉన్నా, పార్టీ పరంగా మాత్రం బిసిలకు 34శాతం పైగా స్థానాలు ఇచ్చి తీరుతామని తేల్చిచెప్పారు. టిడిపి అంటేనే బిసిల పార్టీ అన్న లోకేష్ రిజర్వేషన్లు ఖరారు కాకుండా అభ్యర్థిని ప్రకటించిన ఘనత గొడ్డలి పార్టీకే దక్కిందని ఎద్దేవా చేశారు. స్థానిక ఎన్నికల పట్ల ఆ పార్టీ ఎంత అవగాహనారాహిత్యంతో ఉందో దీన్నిబట్టే అర్థమవుతోందన్నారు. బిసి రిజర్వేషన్లు అడ్డుకునేందుకు గొడ్డలి పార్టీ చేస్తున్న కుట్రలను అందరూ చూస్తున్నారన్న లోకేష్, ఓటమి భయంతోనే స్థానిక ఎన్నికలు అడ్డుకునేందుకు సుప్రీంకోర్టు వరకూ వెళ్లారని అన్నారు. బిసిలకు రిజర్వేషన్లు దక్కకుండా వైఎస్సార్సీ చేస్తున్న కుట్రలపై పోరాటంలో భాగంగానే తాము సుప్రీంకోర్టు వరకూ వెళ్లామన్నారు. స్థానిక ఎన్నికల తర్వాత కాలపరిమితి పూర్తయిన నామినేటెడ్ పదవుల భర్తీపై సమీక్షిస్తామని అన్నారు. పని >>2

క్రమటోర్స్క్‌లో ప్రయాణికుల బస్సులపై దాడి

30 మంది మృతి

క్రమటోర్స్క్,(ఉక్రెయిన్), అక్టోబరు 8: తూర్పు ఉక్రెయిన్‌లోని క్రమటోర్స్క్ నగరంలో గురువారం ఉదయం జరిగిన దాడిలో రెండు ప్రయాణికుల బస్సులు దెబ్బతిన్నాయి. ఈఘటనలో 30 మంది మృతి చెందగా, మరో 18 మంది గాయపడ్డారు. డొనెట్స్క్ ప్రాంత ప్రాసిక్యూటర్ కార్యాలయం ప్రకారం మృతుల సంఖ్య 30కిచేరింది. గవర్నర్ కార్యాలయం కూడా ఇదే సంఖ్యను ధృవీకరించింది. ఘటన నేపథ్యంలో నగరంలో ప్రజా రవాణా సేవలను తాత్కాలికంగా నిలిపివేశారు.

ఘటనాస్థలానికి సంబంధించిన ఫొటోల్లో శిథిలాల మధ్య మృతదేహాలు, కాలిపోయిన బస్సు అవశేషాలు కనిపించాయి. ఇది యుద్ధం వల్ల జరిగిన మరో సాధారణ పరిణామం కాదు. రష్యా సైన్యం చేతిలో ప్రాణాలు కోల్పోయిన మనుషులని డొనెట్స్క్ గవర్నర్ వాడిమ్ ఫిలాష్కిన్ టెలిగ్రామ్‌లో పేర్కొన్నారు. క్రమటోర్స్క్ డొనెట్స్క్ ప్రాంతంలోని ముందు వరుసకు సమీపంలో ఉంది. ఉక్రెయిన్ రక్షణ వ్యవస్థలో కీలక ప్రాంతాల్లో ఇది కూడా ఒకటి.

'బ్యాలట్'తోనే స్థానిక ఎన్నికలు

ఈ యేడాది ఫిబ్రవరి నాటి ఓటర్ల జాబితా ప్రాతిపదికగా నిర్వహణ

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా

విజయవాడ,అక్టోబరు 8,ప్రభాతవార్తప్రతినిధి: ఈ యేడాది ఫిబ్రవరి నాటికి సిద్ధమైన ఓటర్ల జాబితానే ప్రాతిపదికగా స్థానిక ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేసారు. బ్యాలెట్ పేపర్ ద్వారానే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. అవసరమైన బ్యాలెట్ బాక్సులను ఇప్పటికే స్థానిక సంస్థల వారీగా సిద్ధం చేశామన్నారు.. రెండు నెలలుగా అన్ని విధాలుగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎన్నికలకు అధికారులంతా సిద్ధంగా ఉన్నారు. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత ఎన్నికల నిర్వహణకు సిద్ధమని తెలిపారు. ఎపిలో స్థానిక ఎన్నికల ముందస్తు ఏర్పాట్లు, సంసిద్ధతపై ఇవాళ విజయవాడలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా, కార్యదర్శి డా.మల్లికార్జున్, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ, మున్సిపల్ పరిపాలన శాఖ కమిషనర్ డైరెక్టర్ సంపత్‌కుమార్‌తో కలిసి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, నగర పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లపైనే ప్రధానంగా చర్చించినట్లు పునేఠా తెలిపారు. సున్నితమైన ప్రాంతాలు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై పటిష్ఠ చర్యలు ఉండాలని ఆదేశించారు.ఈ యేడాది ఫిబ్రవరి నాటికి సిద్ధమైన ఓటర్ల జాబితానే ప్రాతిపదికగా స్థానిక ఎన్నికలు నిర్వహిస్తామని అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేశారు. బ్యాలెట్ పేపర్ ద్వారానే ఇవి జరుగుతాయని చెప్పారు. >>2

ఎరుపెక్కుతున్న ప్రపంచం!



మరింత బలపడిన ఎల్ నినో

వాతావరణంపై తీవ్ర ప్రభావం

2027 ఫిబ్రవరి వరకు కొనసాగే అవకాశం

డబ్ల్యుఎంఒ నిపుణుల హెచ్చరిక

న్యూఢిల్లీ, అక్టోబరు 8: ప్రపంచాన్ని 'ఎల్ నిన్హో' వణికిస్తోంది. ప్రపంచ వాతావరణంపై ఎల్ నినో తన పంజా విసిరేందుకు సిద్ధమైందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ యేడాది ఏర్పడిన ఎల్ నినో 1950 తర్వాత నమోదైన అత్యంత బలమైన వాతావరణ దృగ్విషయంగా మారే అవకాశం ఉందని ఐక్యరాజ్యసమితి వాతావరణ సంస్థ 'ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యుఎంఒ) హెచ్చరించింది. మానవ నిర్మిత వాతావరణ మార్పుల ప్రభావాలను ఎల్ నినో మరింత తీవ్రతరం చేస్తుందని తెలిపింది. పసిఫిక్ మహాసముద్రం తనలో నిక్షిప్తమైన భారీ మొత్తంలో వేడిని విడుదల చేయడంతో, భూగోళంలోని చాలా పెద్ద ప్రాంతం అసాధారణంగా వేడి పరిస్థితులను ఎదుర్కొంటుందని నిపుణులు చెబుతున్నారు. ఉష్ణమండల పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడుతున్న ఎల్ నినో సరళిని వర్ణించడానికి విశేషణాలకు కొదవే >>2

9-10pg2exHMNWJQE.qxd:9-10pg2exHMNWJQE.qxd 1/1/02 7:37 AM Page 1

గురువారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి సిఆర్ పాటిల్‌కు జ్ఞాపికను బహూకరిస్తున్న సిఎం చంద్రబాబు

మరో 'ఉద్దానం' కలకలం

>> మేమొన్నం భయంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఆ కుటుంబ పరిస్థితిని చూసిన గ్రామస్తులు చలించిపోతున్నారు. ఈ కుటుంబానికి తక్షణ వైద్య సహాయం అందించడంతో పాటు పిల్లలకు విద్యా భరోసా, జీవనోపాధి సహాయం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మరో కుటుంబంలోనూ కిడ్నీ సమస్య

ఇది ఒక్క కుటుంబానికి పరిమితమైన విషాదం కాదని గ్రామస్తులు చెబుతున్నారు. అదే గ్రామానికి చెందిన కుంజా రాజయ్య కిడ్నీ సమస్యతో బాధపడుతూ మృతి చెందినట్లు సమాచారం. కుంజా శేషయ్య ప్రస్తుతం డయాలసిస్‌పై ఉన్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలో ఇంకా ఎంతమంది కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారనే దానిపై స్పష్టమైన సమాచారం లేదు. వరుసగా ఇలాంటి సమస్యలు వెలుగుచూస్తుండటంతో వ్యాధికి అసలు కారణం ఏమిటన్నది తెలియక గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామంలోని బాధితుల వివరాలను అధికారికంగా సేకరించి, ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహించి, చికిత్సను నిరంతరం పర్యవేక్షి ంచాలని వారు కోరుతున్నారు.

80 కుటుంబాలు.. 400 మంది జనాభా

జువ్వియిగూడెంలో సుమారు 80 కుటుంబాలు, 400 మంది జనాభా ఉన్నారు. గ్రామస్తుల తాగునీటి అవసరాల కోసం ఏడు చేతిపంపులు, ఒక బావి ఉన్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఈ నీటి వనరుల నాణ్యతపై ఇప్పటివరకు సమగ్ర పరీక్షలు జరగలేదని వారు పేర్కొంటున్నారు. తాగునీటిలో ఏమైనా కలుషితాలు ఉన్నాయా? కిడ్నీ సమస్యలకు నీటి నాణ్యతతో ఏమైనా సంబంధం ఉందా? అనే అంశాలను అధికారులు శాస్త్రీయంగా పరిశీలించాలని గ్రామస్తులు కోరుతున్నారు. అయితే కిడ్నీ వ్యాధులకు కారణం నీరేనని ఇప్పుడే నిర్ధారించలేమని, ఇందుకు సమగ్ర వైద్య, పర్యావరణ పరిశీలన అవసరమని నిపుణులు స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది. అధికారులు గ్రామంలోని నీటి వనరులతో పాటు ఇతర సాధ్యమైన కారణాలను కూడా పరిశీలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రతి కుటుంబానికి వైద్య పరీక్షలు చేయాలి

గిరిజన ప్రాంతంలో కిడ్నీ సమస్యలు వరుసగా వెలుగుచూస్తున్న నేపథ్యంలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. గ్రామంలోని ప్రతి కుటుంబానికి వైద్య పరీక్షలు నిర్వహించి, అనుమానిత కేసులను గుర్తించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కిడ్నీ పనితీరు, రక్తపోటు, రక్తం, మూత్ర పరీక్షలతో పాటు అవసరమైనా ఇతర వైద్య పరీక్షలు నిర్వహించాలని కోరుతున్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఉచితంగా మెరుగైన వైద్యం అందించాలని, డయాలసిస్ అవసరమైన రోగులకు సమీపంలోనే సౌకర్యం కల్పించాలని లేదా ఆసుపత్రులకు ఉచిత రవాణా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నీటి పరీక్షలు.. వైద్య శిబిరం ఏర్పాటు చేయాలి

అధికారులు వెంటనే గ్రామంలోని ఏడు చేతిపంపులు, బావి నీటి నమూనాలను సేకరించి సమగ్రంగా పరీక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. పరీక్షల ఫలితాలను ప్రజలకు వెల్లడించాలని కోరుతున్నారు. గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి ప్రతి కుటుంబాన్ని పరీక్షి ంచాలని, బాధితుల ఆరోగ్య పరిస్థితిపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కోరుతున్నారు. అవసరమైతే సురక్షిత తాగునీటిని ట్యాంకర్ల ద్వారా అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖ, గిరిజన సంక్షేమ శాఖలు సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. వ్యాధికి అసలు కారణాలను శాస్త్రీయంగా గుర్తించి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు.

మరో 'ఉద్దానం'గా మారకముందే..

కళ్లముందే కుటుంబ సభ్యులను కోల్పోతూ, అనారోగ్యంతో పోరాడుతున్న వారిని ఆదుకోలేక జువ్వియిగూడెం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా సబ్బయ్య కుటుంబంలోని చిన్నారుల భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబాలను పరామర్శించాలని, కిడ్నీ సమస్యలపై సమగ్ర వైద్య సర్వే నిర్వహించాలని, నీటి నాణ్యతను పరీక్షించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. బాధితులకు చికిత్స, కుటుంబాలకు ఆర్థిక సహాయం, పిల్లలకు విద్యా భరోసా, గ్రామానికి సురక్షిత తాగునీరు అందించేందుకు స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరుతున్నారు. వ్యాధికి కారణం ఏమిటన్నది తేలకముందే మరిన్ని ప్రాణాలు పోకుండా అధికారులు అప్రమత్తం కావాల్సిన సమయం ఆసన్నమైంది. జువ్వియిగూడెం మరో ఉద్దానంలా మారకముందే సమగ్ర విచారణ, వైద్య పరీక్షలు, సురక్షిత తాగునీరు, తక్షణ చికిత్స అందించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

కెనడా రచయిత్రికి సాహిత్య నోబెల్

>> ధాని స్టాక్ హోమ్‌లో రాయల్ స్వీడిష్ అకాడమీ కీలక ప్రకటన చేసింది. ఈ అవార్డు ప్రకటన సమయంలో కార్సన్ ఐస్‌లాండ్‌లో ఉన్నారు. దీంతో ఆమెకు ఈ ప్రతిష్టాత్మక పురస్కారం ప్రకటించినట్లు నోబెల్ కమిటీ ఫోన్ చేసి చెప్పింది. ఈ పురస్కారం అందుకున్న ఆ క్షణాన్ని గుర్తుచేసుకుంటూ తాను ఐస్‌లాండ్‌లో గాలి శబ్దాన్ని వింటూ ఉన్నానని కార్సన్ తెలిపారు. కవిత్వం, గద్యం, ప్రాచీన సాహిత్యం, అనువాదం వంటి వివిధ ప్రక్రియల మధ్య సంచరించే తన రచనలకు కార్సన్ ప్రసిద్ధి చెందారు. ఆమె రచనలు సమకాలీన ఇతివృత్తాలను అన్వేషిస్తూనే, తరచుగా ప్రాచీన గ్రీకు సాహిత్యం నుండి ప్రేరణ పొందుతాయి. అనే కార్సన్ అత్యంత ప్రసిద్ధ రచనలలో ఆటోబయోగ్రఫీ ఆఫ్ రెడ్, ది బ్యూటీ ఆఫ్ ది హస్బెండ్, రాంగ్ నార్మా ఉన్నాయి. ఆమె సాఫో, యూరిపిడీస్ రచనలతో సహా ప్రాచీన గ్రీకు రచనలను కూడా అనువదించారు. కార్సన్ తన వృత్తి జీవితంలో అనేక ప్రధాన సాహిత్య పురస్కారాలను అందుకున్నారు. మెక్‌గిల్, ప్రిన్స్‌టన్, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బర్కిలీ వంటి విశ్వవిద్యాలయాలలో క్లాసిక్స్, సాహిత్యాన్ని బోధించారు. కార్సన్ తన అత్యంత ముఖ్యమైన కొన్ని రచనలను 1990వ దశకంలో రచించారు. ఈ కాలం అంతర్జాతీయ సాహిత్య ప్రపంచంలో ఆమెకు ఒక ప్రత్యేక స్థానాన్ని అందించింది. ఆ దశాబ్దంలోని కార్సన్ రచనలలో ది గ్లాస్ ఎస్సే ఒకటి. ఇది 1995లో గ్లాస్, ఐరనీ, అండ్ గాడ్ సంకలనంలో ప్రచురించారు. ఈ రచన ప్రక్రియల మధ్య సరిహద్దులను చెరిపివేయడంలో, విభిన్న రచనా రూపాల మధ్య స్వేచ్ఛగా సంచరించగల ఆమె సామర్థ్యానికి అద్దం పట్టింది.

పోర్టుల అభివృద్ధికి 20 వేల ఎకరాల ఉప్పు భూములు ఇవ్వండి

విజయవాడ అక్టోబరు8, ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్రంలో పోర్టుల ఆధారిత పారిశ్రామిక, వాణిజ్య అభివృద్ధిని మరింత వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని సుమారు 20,378 వేల ఎకరాల ఉప్పు భూములను రాష్ట్రానికి బదలాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో జరిగిన ప్రత్యేక భేటీలో సీఎం ఈ అంశాన్ని ప్రస్తావించారు. రాష్ట్రంలో పోర్టుల విస్తరణ, అనుబంధ మౌలిక వసతుల అభివృద్ధికి ఈ భూములను వినియోగించుకునేందుకు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ డీపీఐఐటీ ఆధీనంలో ఉన్న 20,378 ఎకరాల ఉప్పు భూములను పోర్టు ఆధారిత పారిశ్రామిక ప్రాజెక్టుల కోసం కేటాయించాలని ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు పెట్టినట్టు ముఖ్యమంత్రి వివరించారు. పోర్టులకు అవసరమైన అనుసంధాన రహదారులు, రైల్వే మార్గాలు, పారిశ్రామిక కార్యకలాపాలకు అనువైన భూమి అందుబాటులో ఉండటం కీలకమని వివరించారు.

అమరావతి ఒఆర్ఆర్‌కు పూర్తి సహాకారం అందించండి

విజయవాడ అక్టోబరు 8,ప్రభాతవార్తప్రతినిధి: ఎపి రాజధాని అమరావతి ఔటర్ రింగ్ రోడ్ నిర్మాణానికి పూర్తి సహకారం అందించాలని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. 189 కిలోమీటర్ల పొడవైన ఓఆర్ఆర్ రాజధాని ప్రాంత అభివృద్ధికి అత్యంత కీలకం అవుతుందని సీఎం పేర్కొన్నారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో భేటీ అయిన ముఖ్యమంత్రి వివిధ అంశాలపై విజ్ఞాపన పత్రాన్ని అందించారు. రాష్ట్రానికి సంబంధించిన కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులను ప్రస్తావిస్తూ వాటికి కేంద్రం నుంచి ఆమోదాలు, నిధులు, అవసరమైన సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర రాజధాని అమరావతి, విజయవాడ పరిసర ప్రాంతాల్లో పెరుగుతున్న రవాణా అవసరాలకు అనుగుణంగా ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం అత్యంత కీలకమని సీఎం పేర్కొన్నారు. అలాగే రాష్ట్ర తీర ప్రాంత అభివృద్ధితో పాటు కనెక్టివిటీ పెంచేందుకు దోహదపడే బీచ్ రోడ్డు ప్రాజెక్టుపైనా దృష్టి సారించాలన్నారు. తీరప్రాంతంలోని నగరాలు, పర్యాటక ప్రాంతాలు, పోర్టులు, పారిశ్రామిక కేంద్రాల మధ్య మెరుగైన అనుసంధానం కల్పించేందుకు బీచ్ రోడ్ ఉపయోగపడుతుందని సిఎం తెలిపారు.

అద్భుత ఫలితాలు

>> ముఖ్యంగా సమాఖ్య స్ఫూర్తితో రాష్ట్రాలను భాగస్వాములుగా చేసి వికసిత్ భారత్ వైపు దేశాన్ని నడిపిస్తున్నారని అన్నారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో భారత్ గౌరవాన్ని, విశ్వసనీయతను మరింత పెంచేలా తోడ్పడుతున్న ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్ర ప్రజల తరుపున ఈ సందర్భంగా ప్రధానికి సిఎం శుభాకాంక్షలు తెలిపారు.

నదుల అనుసంధానంపై ప్రతిపాదనలు:

ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో జరిపిన భేటీలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక అంశాలను ప్రస్తావించారు. ఈ భేటీలో రాష్ట్రాభివృద్ధికి చెందిన వివిధ కీలక ప్రాజెక్టులు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, వ్యవసాయ, ఇరిగేషన్ వంటి అంశాలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. నీటిపారుదల రంగానికి సంబంధించి పోలవరం ప్రాజెక్టు తాజా నివేదికతో పాటు గోదావరి కావేరి నదుల అనుసంధానం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రధాని మోదీకి సిఎం చంద్రబాబు వివరించారు. గోదావరి-కావేరి నదుల అనుసంధానం జరిగితే దక్షిణాదిలోని ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సమృద్ధిగా నీరు అందుతుందని ముఖ్యమంత్రి వివరించారు. దేశవ్యాప్తంగా రహదారుల నెట్వర్క్, పవర్ గ్రిడ్ వంటివి ఎన్డీఏ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని, ఇప్పుడు నదుల అనుసంధాన ప్రాజెక్టును ముందుకు తీసుకువెళితే వాటర్ గ్రిడ్ ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుందని సిఎం చంద్రబాబు వివరించారు. 2027లో జరిగే గోదావరి పుష్కరాలకు రాష్ట్రంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. పుష్కరాల కోసం చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులకు ఆర్థిక సాయం అందించాలని ప్రధానిని సిఎం కోరారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశ విదేశాల నుంచి సైతం గోదావరి పుష్కరాలకు భక్తులు తరలి వస్తారని సిఎం వివరించారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో 53శాతం లోటు వర్షపాతం నమోదైందని, ఇది వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపించిందని ప్రధానికి సిఎం వివరించారు. కరువు నష్టాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వ పరంగా తీసుకుంటున్న చర్యలను ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లారు. ఐటీపరంగా కేంద్ర సహకారంతో మదనపల్లె కేంద్రంగా ప్రారంభించిన గ్లోబల్ హార్టికల్చర్ హబ్ లక్ష్యాలను కూడా ప్రధానికి తెలియజేశారు.

కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో సిఎం చంద్రబాబు భేటీ

విజయవాడ,అక్టోబరు 8, ప్రభాతవార్తప్రతినిధి: ఏపీ సీఎం చంద్రబాబు కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో భేటీ అయ్యారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఢిల్లీ వెళ్లిన సీఎం అమిత్‌షాతో భేటీలో రాష్ట్రానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న వివిధ అంశాలపై చర్చించారు. దక్షిణాది రాష్ట్రాల జోనల్ కౌన్సిల్ సమావేశంలో చర్చించిన వివిధ అంశాలపై ఈ భేటీలో చర్చ జరిగింది. గోదావరిబనకచర్ల నదుల అనుసంధానం గురించి దక్షిణాది రాష్ట్రాల జోనల్ కౌన్సిల్ సమావేశంలో చర్చించామని... దీన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు చొరవ తీసుకోవాలని అమిత్ షాను ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు.

కట్టుబడి ఉన్నాం

>> చేసినవారికే నామినేటెడ్ పదవుల రెన్యూవల్ ఉంటుందని స్పష్టం చేశారు.

ఎంత సీనియర్ నేతలైనా పార్టీ లైన్‌కు కట్టుబడి ఉండాలి

ఎంత సీనియర్ నేతలైనా టిడిపి లైన్‌కు కట్టుబడి పని చేయాల్సిందేనని టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ అన్నారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ శిక్షణాతరగతుల ట్రైనర్లతో లోకేష్ మీట్ అండ్ గ్రీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 8,300మంది క్లస్టర్, బూత్ ఇన్చార్జిలకు శిక్షణా తరగతులు పూర్తి చేశామని, 50వేలమందికి శిక్షణ ఇవ్వడం లక్ష ్యంగా పనిచేస్తున్నామన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో నాయకులకు శిక్షణా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని, సమాజమే దేవాలయం - ప్రజలే దేవుళ్లు అన్న పార్టీ మూల సిద్ధాంతానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల చేపట్టిన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా 45రోజుల్లో 1.13 కోట్ల ఇళ్లను నాయకులు సందర్శించారని చెప్పారు. పార్టీకంటే ఎవరూ గొప్పవారు కాదని, ఏదైనా అంశంపై పార్టీ నిర్ణయం తీసుకున్నాక అందరూ దానికి కట్టుబడి పనిచేయాల్సిందేనని స్పష్టం చేశారు.

పార్టీలో కేవలం పెర్ఫార్మెన్స్ ఆధారంగానే నాయకులకు గుర్తింపునిస్తామని, ఈ విషయంలో ఎటువంటి సిఫారసులు, పైరవీలకు తావీయబోమని స్పష్టంచేశారు. పార్టీ కార్యక్రమాలను మరింత వేగంగా, సులభంగా గ్రాస్ రూట్ స్థాయి కేడర్‌కు తీసుకెళ్లేందుకు ఎఐని వినియోగిస్తున్నామని, అధునాతన టెక్నాలజీపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. శిక్షణా తరగతులకు వచ్చే నాయకులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నాం, అందరూ ఆర్థికంగా బలోపేతమై సొంతకాళ్లపై నిలబడేలా చేయాలన్నది పార్టీ అధినేత అంతరంగమని తెలిపారు.

కేంద్రంలో బిజెపి వరుసగా మూడుసార్లు అధికారంలోకి రావడానికి ఆ పార్టీ కేడర్ కమిట్‌మెంట్ ప్రధాన కారణమని లోకేష్ అన్నారు. రాష్ట్రంలో కూడా ప్రభుత్వ కొనసాగింపు కోసం ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేయాలన్నారు. అందరికీ ఒకేసారి న్యాయం చేయడం సాధ్యం కాదని, వివిధ కారణాల వల్ల తొలిదశలో అవకాశాలు రానివారికి మలివిడతలో అవకాశం కల్పిస్తామని లోకేష్ చెప్పారు. ఈ సందర్భంగా పార్టీ ఆవిర్భావం నుంచి సేవలందిస్తున్న పలువురు సీనియర్ నాయకుల అనుభవాలను లోకేష్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మానవ వనరుల విభాగం కోఆర్డినేటర్ వేపాడ చిరంజీవి, ఎంపి చింతకాయల విజయ్ తదితరులు పాల్గొన్నారు. సమర్థవంతంగా శిక్షణాతరగతులు నిర్వహిస్తున్న పార్టీ సీనియర్ నాయకులకు మంత్రి లోకేష్ ప్రశంసాపత్రాలు అందజేశారు.

'బ్యాలట్'తోనే స్థానిక ఎన్నికలు

>> ఇప్పటికే అవసరమైన బ్యాలెట్ బాక్సులను స్థానిక సంస్థల వారీగా సిద్ధం చేశామన్నారు. బ్యాలెట్ ముద్రణకు ప్రింటింగ్ ప్రెస్‌ను ఫైనల్ చేస్తామని అనిల్ చంద్ర పునేఠా వెల్లడించారు.సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులపై తీర్పు మేరకు ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేయగానే ఎన్నికలను విడతల వారీగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ అనేది పంచాయతీరాజ్, మున్సిపల్ యాక్ట్ ప్రకారం 15 రోజుల వ్యవధిలో పూర్తి చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ మేరకు అధికారులంతా సిద్ధంగా ఉన్నారని అనిల్ చంద్ర పునేఠా తెలియజేశారు.

వారం - వర్జ్యం

09-10-2026, శుక్రవారం,
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, కృష్ణపక్షం, హస్తకార్తె,
తి. చతుర్దశి రా.9.39,
న. ఉత్తరఫల్గుణి రా.9.22,
వ.తె .5.54 -ఉ.7.32,
దు.ఉ.8.20-ఉ.9.07,2)మ.12.18- మ.1.05,
రాహు.ఉ10.30-మ.12.00,శుభ. స. లేదు.

వార్తాఫలం

మేషం : చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. సంఘసేవాకార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

వృషభం : ప్రముఖులతో కలిసి కష్టసుఖాలు పంచుకుంటారు. దూరప్రయాణాలు లాభిస్తాయి.అవకాశాలు లభిస్తాయి.

మిథునం : మీరంటే గిట్టని వారు మిమ్మల్ని ఇరుకున పెట్టే ప్రయత్నాలు సాగిస్తారు. అయితే ఆ ప్రయత్నాలేవీ ఫలించవు.

కర్కాటకం : మిత్రులతో ఏర్పడి కలహాలు తీరి ఊరట చెందుతారు.ప్రయాణాలలో తొందరపాటువద్దు.ఉల్లాసంగా గడుపుతారు.

సింహం : దైవ సందర్శనం చేసుకుంటారు. దీర్ఘకాలిక సమస్యలు తీరి ప్రశాంతత పొందుతారు. పాత బాకీలు వసూలవుతాయి.

కన్య : వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు. పనులలో జాప్యం జరిగినా చివరికి పూర్తి చేస్తారు.

తుల : కొత్త మిత్రులు పరిచయమై నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. విద్యార్థులు పరీక్షలలో విజయం సాధిస్తారు.

వృశ్చికం : భాగస్వామ్య వ్యాపారాలలో ఎదురైనా ఆటుపోట్లు కొంత వరకు తీరుతాయి. శ్రమ మీది ఫలితం వేరొకరిది.

ధనుస్సు : ఉద్యోగాలలో ప్రోత్సాహం లభిస్తుంది. పూర్వమిత్రులను కలిసి ఉల్లాసంగా గడుపుతారు.ఆర్థిక అభివృద్ధి సాధిస్తారు.

మకరం : ఋణాలు తీరి ప్రశాంతత పొందుతారు. ఊహించని ఆహ్వానాలు శుభవార్తలు అందుకుంటారు.

కుంభం : మహోన్నత వ్యక్తులుగా మీరు భావించిన వారి అసలు స్వరూపం తెలిసి వస్తుంది.శుభవార్తలు అందుకుంటారు.

మీనం: పెట్టుబడులు ప్రధాన ప్రస్తావనాంశాలవుతాయి. రహస్య ప్రయాణాలను, చర్చలను సాగిస్తారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

మహా ధర్నా

>> మతి లభించిందని సమాచారం. తొలి రోజు ఢిల్లీలోని ఎన్నికల కార్యాలయం, రెండో రోజు జంతర్ మంతర్ వద్ద నిరసనకు దిగిన రాహుల్ గాంధీ అండ్ కో, గురువారం మరోసారి నిరసనలకు సిద్ధమయ్యారు. సాగర్ రత్నలో ఇండియా కూటమి నేతలు లంచ్ మీటింగ్ చేసిన తర్వాత జంతర్ మంతర్ వద్ద నిరసరకు వెళ్లారు.అదేతరహాలో గురువారం కూడా ఇదే తరహాలో బస్సుల్లో రాజ్‌ఘాట్‌కు బయలుదేరారు. గురువారం ఢిల్లీలోని కన్నాట్‌ప్లేస్‌లో ఉన్న మోయెట్స్ రెస్టారెంట్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇండియా కూటమి నేతలకు లంచ్ ఏర్పాటు చేశారు.

లంచ్ తర్వాత విపక్ష నేతలు రాజ్‌ఘాట్‌కు వెళ్లి సిఇసి జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కొనసాగించారు. ముందురోజు జరిగిన పరిణామాలను దృష్టిలో ఉంచుకుని ఢిల్లీ పోలీ సులు సెంట్రల్ ఢిల్లీలో, ముఖ్యంగా ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయంలో భద్రతను పెంచారు. ఇదే కాకుండా, జ్ఞానేష్ కుమార్ ఢిల్లీ నివాసం, ఎన్నికల సంఘం కార్యాలయం, ఆయన వ్యక్తిగత భద్రత కోసం అదనపు బలగాలను మోహరించారు. రెండోరోజు నిరసనలకు సంబం ధించి ఢిల్లీ పోలీసులు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.పలువురు కాంగ్రెస్ నేతలు, నిరసనల్లో పాల్గొన్న కార్యకర్తల పేర్లు కూడా ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారు.



గురువారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో భేటీ అయిన సిఎం చంద్రబాబు

ఎరుపెక్కుతున్న ప్రపంచం!

>> వలన ప్రపంచంలోని అనేక ప్రాంతాలలో తీవ్రమైన పరిణామాలు సంభవించవచ్చని అంచనా వేస్తున్నారు. ఇప్పటివరకు, అందుబాటులో ఉన్న సమాచారం ఈ అంచనాలను బలపరుస్తూనే ఉంది. ఈ శరదృతువులో ఉష్ణమండల పసిఫిక్‌లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి పెరిగాయి. ఇది ఈ సరళి మరింత బలపడుతోందనడానికి సంకేతం. ఎల్ నినో ప్రభావంతో ప్రపంచ వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో సాధారణం కన్నా అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశ ఉంది. డబ్ల్యుఎంఒ అంచనా ప్రకారం అక్టోబరు - డిసెంబరు మధ్య కాలంలో ఎల్ నినోకు కేంద్రంగా ఉన్న మధ్య, తూర్పు ఉష్ణమండల పసిఫిక్ ప్రాంతంలోని సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా సుమారు 3.7 డిగ్రీల వరకు అధికంగా ఉండే అవకాశం ఉంది. వాతావరణ శాస్త్రవేత్త ర్యాన్ మావ్ మొత్తం గ్రహం యొక్క వాతావరణ పటాన్ని పోస్ట్ చేస్తూ, భూమి దాదాపు పూర్తిగా ఎరుపు రంగులో ఉందని పేర్కొన్నారు. "అమెరికా మినహా మిగతా అన్ని చోట్లా భూగోళం వేడెక్కడంతో, ఎల్ నినో శీతాకాలంలోకి కూడా 'గరిష్ట శక్తితో కొనసాగుతోంద్ని అని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. ఎల్ నినో 2027 ఫిబ్రవరి వరకు కొనసాగుతుందన్న డబ్ల్యుఎంఒ అంచనాతో ఆయన ఏకీభవించారు. మరో వాతావరణ శాస్త్రవేత్త జీక్ హౌస్‌ఫాదర్ ట్వీట్ చేస్తూ, "ఈ యేడాది ఎల్ నినో అపరిచిత జలాల్లోకి తన ఆరోహణను కొనసాగిస్తోంది. ఎల్ నినో3.4 ప్రాంతంలోని అసాధారణతలు ఇప్పుడు సాధారణం కంటే 3.4 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా ఉన్నాయి. ఇది రికార్డుల్లో నమోదైన మునుపెన్నడూ లేని ఎల్ నినో సంఘటన కంటే ఎక్కువ. "వాతావరణ నిపుణుడు లియోన్ సైమన్స్ ఈ వాతావరణ దృగ్విషయాన్ని "సూపర్‌డూపర్ ఎల్ నినో" అని అభివర్ణించారు. 2026 చివరి నెలల్లో ప్రపంచంలోని చాలా ప్రాంతాలలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఎక్కువగా ఉందని ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యుఎంఒ) తన అంచనాలో పేర్కొంది. ఎల్ నినో దృగ్విషయానికి కేంద్ర బిందువైన మధ్య, తూర్పు ఉష్ణమండల పసిఫిక్ ప్రాంతంలో, అక్టోబరు నుండి డిసెంబరు వరకు సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రికార్డు స్థాయిలో 3.7 డిగ్రీల సెల్సియస్ (6.7 డిగ్రీల ఫారెన్‌హీట్) అధికంగా నమోదయ్యే అవకాశం ఉందని కూడా తెలిపింది. ఎల్ నినో అనేది సహజంగా సంభవించే ఎల్ నినోసదరన్ ఆసిలేషన్ చక్రంలోని వెచ్చని దశ. ఇది ప్రపంచవ్యాప్తంగా వాతావరణాన్ని ప్రభావితం చేసే ఒక వాతావరణ నమూనా. ఇది సాధారణంగా ప్రతి రెండు నుండి ఏడు సంవత్సరాలకు ఒకసారి సంభవిస్తుంది. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగాఉష్ణోగ్రతలు పెరిగి, పెద్ద ప్రాంతాలలో వర్షపాత సరళికి అంతరాయం కలుగుతుంది. అంటే కొన్ని ప్రాంతాలలో కరువు, మరికొన్ని ప్రాంతాలలో భారీ వర్షాలు కురుస్తాయి. యూనివర్సిటీ ఆఫ్ చికాగోకు చెందిన 'క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్' పరిశోధకులు గత నెలలో ఒక అంచనాను వెలువరించారు. దీని ప్రకారం, ఈ యేడాది సంభవించే "సూపర్ ఎల్ నిన్లో కారణంగా జూన్ నుండి ఫిబ్రవరి 2027 వరకు ప్రపంచవ్యాప్తంగా 4,51,000 వరకు అదనపు మరణాలు సంభవించే అవకాశం ఉంది.

నానా పటేకర్ కన్నుమూత

>> ఆయనకు తీవ్రమైన గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో తెల్లవారుజామున 5:20 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచినట్లు ఆసుపత్రి వర్గాలు ధ్రువీకరించాయి. ఆసుపత్రికి తీసుకొచ్చిన తర్వాత దాదాపు 45 నిమిషాల పాటు వైద్యులు ఆయనను బతికించేందుకు తీవ్రంగా ప్రయత్నించారని, అయినప్పటికీ వారి ప్రయత్నాలు ఫలించలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆయన మరణవార్తతో చిత్ర పరిశ్రమ దిగ్భ్రాంతికి గురైంది. 1978లో గమన్ చిత్రంతో బాలీవుడ్‌లో అడుగుపెట్టిన నానా పటేకర్, తన విలక్షణమైన నటన, డైలాగ్ డెలివరీతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. పరిందా, అబ్ తక్ ఛప్పన్, యశ్వంత్, వజూద్ వంటి చిత్రాలతో ఆయన నటనకు దేశవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా 2000 తర్వాత శక్తి: ది పవర్, అపహరణ్, టాక్సీ నెం 9211 వంటి సినిమాల్లో ఆయన నటన విమర్శకుల మన్ననలు పొందింది. ఒకవైపు సీరియస్ పాత్రలతో అలరిస్తూనే, మరోవైపు కామెడీతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించారు. వెల్కమ్ (2007), వెల్కమ్ బ్యాక్ (2015) చిత్రాలలో ఆయన పోషించిన ఉదయ్ శెట్టి పాత్ర ఎప్పటికీ గుర్తుండిపోతుంది. రాజ్‌నీతి చిత్రంలో ఆయన నటనకు ఫిలింఫేర్ అవార్డుకు నామినేట్ అయ్యారు. తన అద్భుత నట ప్రస్థానంలో మూడు జాతీయ అవార్డులను అందుకున్నారు. 2016లో మరాఠీ చిత్రం నటసామ్రాట్‌లో ప్రదర్శించిన అసమాన నటనకు గాను ఆయన ఫిలింఫేర్ ఉత్తమ నటుడి పురస్కారాన్ని గెలుచుకున్నారు. నటుడిగానే కాకుండా యశ్వంత్, వజూద్, ఆంచ్ వంటి చిత్రాల్లో నేపథ్య గాయకుడిగా కూడా తన ప్రతిభను చాటుకున్నారు. నానా పటేకర్ మృతితో భారతీయ సినిమా ఓ గొప్ప నటుడిని కోల్పోయిందని పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. 1951 జనవరి ఒకటోతేదీ జన్మించిన పటేకర్ అసలు పేరు విశ్వనాథ్ పటేకర్. 2013లో కేంద్ర ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ పురాస్కరంతో సత్కరించింది.

రైతుల కష్టాలను చూసి చలించిపోయిన ఆయన నామ్ ఫౌండేషన్ స్థాపించి వేలాది రైతు కుటుంబాలకు అండగా నిలిచారు. నానా పటేకర్ మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వం ఆయన అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నట్లు ప్రకటించింది. పుణె సమీపంలోని ఖడక్‌వాస్లాలో ఉన్న ఆయన ఫామ్‌హౌస్‌లో అంతిమ సంస్కారాలు జరగనున్నాయి.

జిఎస్టీ కౌన్సిల్ కీలక నిర్ణయాలు

>> 57వ జిఎస్టీ కౌన్సిల్ సమావేశంలో జిఎస్టీ రేట్లలో ఎలాంటి మార్పులు చేయలేదు. జిఎస్టీ రేట్ల నిర్మాణం ఇప్పటికే స్థిరపడింది. అందువల్ల పన్ను వ్యవస్థ రోజువారీగా ఎలా పనిచేస్తుందనే అంశంపై కౌన్సిల్ దృష్టి సారించిందని ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇకపై జిఎస్టీ రేట్లలో మార్పులు సంవత్సరానికి ఒకసారి మాత్రమే చేపట్టే విధానాన్ని అనుసరించనున్నట్లు పేర్కొంది. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) క్లెయిమ్‌ల విషయంలో నిజాయితీగా వ్యవహరించే కొనుగోలుదారుల ప్రయోజనాలను కాపాడేందుకు అధికారుల కమిటీని ఏర్పాటు చేయాలని 57వ జిఎస్టీ కౌన్సిల్ నిర్ణయించింది. సరైన ఇన్‌వాయిస్ కలిగి ఉండి, వస్తువులను స్వీకరించి, సరఫరాదారుడికి పూర్తి మొత్తాన్ని చెల్లించిన నిజమైన కొనుగోలుదారుడికి రక్షణ కల్పించే విధానాన్ని ఈ కమిటీ పరిశీలించనుంది. ఈ అంశంపై కమిటీ మూడు నెలల్లో అధ్యయనం పూర్తి చేయనుంది. అనంతరం తదుపరి జిఎస్టీ కౌన్సిల్ సమావేశంలో దీనిపై ప్రతిపాదనను ప్రవేశపెట్టనున్నారు. జిఎస్టీ చట్టం కింద ప్రాసిక్యూషన్‌కు సంబంధించిన పరిమితిని రూ.1 కోటి నుంచి రూ.5 కోట్లకు పెంచాలని కౌన్సిల్ నిర్ణయించింది. అదే సమయంలో కనీస శిక్ష నిబంధనను తొలగించింది. కేసును బట్టి జరిమానా, జైలు శిక్ష లేదా రెండింటిలో ఏది విధించాలనే నిర్ణయాన్ని న్యాయస్థానాల విచక్షణకు వదిలింది. ఏదైనా ఉల్లంఘనకు ప్రత్యేకంగా జరిమానా నిర్దేశించని సందర్భాల్లో వర్తించే సాధారణ జరిమానాను కూడా తగ్గించారు. ప్రస్తుతం ఉన్న రూ.25,000 నుంచి ఈ జరిమానాను రూ.10,000కు తగ్గించినట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది.

గ్లోబల్ సమన్వయంతో సైబర్ మోసాలకు చెక్

>> అంతర్జాతీయ టెక్నాలజీ కార్యక్రమంలో టెలికాం, ఐటీ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొంటున్నారు. 6జి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్, డిజిటల్ ఆవిష్కరణలు, సైబర్ భద్రత వంటి అంశాలకు ఈ ఏడాది ప్రాధాన్యం ఇచ్చారు. డిజిటల్ సేవల వినియోగం పెరుగుతున్న కొద్దీ సైబర్ మోసాల ప్రమాదం కూడా పెరుగుతోందని ప్రధాని మోడీ ఆందోళన వ్యక్తం చేశారు. ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, డిజిటల్ చెల్లింపుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసాల నుంచి ప్రజలను రక్షించేందుకు దేశాల మధ్య సమన్వయం అవసరమని, ఇందుకోసం గ్లోబల్ ఫ్రేమ్‌వర్క్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈ విధమైన అంతర్జాతీయ వ్యవస్థ డిజిటల్ మౌలిక సదుపాయాలను మరింత పటిష్ఠం చేయడంతో పాటు సైబర్ నేరాల నియంత్రణకు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. భారత్‌లో డిజిటల్ విప్లవం సాధించిన పురోగతిని ప్రధాని మోడీ తన ప్రసంగంలో ప్రస్తావించారు. 2022లో ఇండియా మొబైల్ కాంగ్రెస్ వేదిక నుంచే 5జి సేవలను ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేశారు. గత నాలుగేళ్లలో దేశంలోని అన్ని జిల్లాలకు 5జి నెట్‌వర్క్ విస్తరించిందని, ప్రస్తుతం భారత్‌లో 5.5 లక్షలకు పైగా 5జి బేస్ స్టేషన్లు ఉన్నాయని తెలిపారు. తదుపరి తరం టెలికాం సాంకేతికత అయిన 6జి అభివృద్ధిపైనా భారత్ దృష్టి సారించిందని పేర్కొన్నారు. 5జి సేవల విస్తరణతో వేగవంతమైన ఇంటర్నెట్, డిజిటల్ సేవలు, ఆన్‌లైన్ వ్యాపారాలు, సాంకేతిక ఆధారిత పరిశ్రమలకు మరింత అవకాశాలు ఏర్పడుతున్నాయని వివరించారు. 2020లో కరోనా మహమ్మారి సమయంలో డిజిటల్ టెక్నాలజీ కీలక పాత్ర పోషించిందని ప్రధాని మోడీ గుర్తుచేశారు. భౌతికంగా దూరంగా ఉన్నప్పటికీ ప్రజలు తమ కుటుంబ సభ్యులతో అనుసంధానమై ఉండటానికి డిజిటల్ సేవలు ఉపయోగపడ్డాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల అమలులోనూ డిజిటల్ వ్యవస్థలు కీలకంగా మారాయని తెలిపారు. రైతులకు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందించడంలో డిజిటల్ మౌలిక సదుపాయాలు ఉపయోగపడుతున్నాయని వివరించారు.

9-10Pg3fVS.qxd:9-10Pg3fVS.qxd 1/1/02 7:38 AM Page 1

Ref B1/74/2026 dt.08.10.2026

స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) వారి కార్యాలయం
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఫారం నెం.VII

(2013 వ సంవత్సరం 30 వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014 లో రూల్ 125 సబ్ రూల్ (1) ననుసరించి)

రూఢీ ప్రకటన

ఈ క్రింది షెడ్యూళ్ళలో నిర్దిష్ట పరచిన పోలవరంజిల్లా, అడ్డతీగల మండలం, పేట మామిడి, మెట్లపాలెం, నిమ్మలపాలెం, మల్లవరం మామిళ్ళు, చినమునకనగడ్డ, మరియు భీముడుపాకలు గ్రామముల భూములను మరియు వాటి విస్తీర్ణం య.106.212 సెంట్లును ప్రజా ప్రయోజనమునకై అనగా "పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణం వలన ముంపునకు గురైన వి.ఆర్.పురం మండలం, గుండుగూడెం గ్రామంలోని గిరిజన రైతుల నుండి సేకరించిన భూమికి బదులుగా, పునరావాస, పునస్థాపనల క్రిందవారికి భూమిని కేటాయించు నిమిత్తము" భూమి అవసరమైనట్లు ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున, 2013వ సంవత్సరం, 30వ చట్టంలోని 15వ విభాగంననుసరించి సంబంధిత వ్యక్తుల నుంచి వచ్చిన అభ్యంతరములపై విచారణ జరిపిన పిమ్మట ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరంవారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూలు దాఖలా భూములను ప్రజా ప్రయోజనాల నిమిత్తం భూసేకరణ గావించు టకు నిర్ణయించినారు మరియు ఈ క్రింది రూఢీ ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించి చేయబడినది.

ప్రత్యేక కలెక్టరు(భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు 2013వ సంవత్సరం 30వ చట్టం లోని 19(1) విభాగం ననుసరించి ఈ దిగువనుదహరించిన షెడ్యూలు దాఖలా భూములు మరియు సుమారుగా వాటి విస్తీర్ణం య.106.212సెంట్లను ప్రజా ప్రయోజనమునకై అనగా "పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణం వలన ముంపునకు గురైన వి.ఆర్.పురం మండలం, గుండుగూడెం గ్రామంలోని గిరిజన రైతుల నుండి సేకరించిన భూమికి బదులుగా, పునరావాస, పునస్థాపనల క్రిందవారికి భూమిని కేటాయించు నిమిత్తము" అవసరమైనవని ఇందుమూలంగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూలు

జిల్లా: పోలవరం మండలం : అడ్డతీగల గ్రామం : పేటమామిడి

క్రమ సంఖ్య	ఎల్.పి. ఎమ్. నెం.	వర్గీకరణ	మొత్తం విస్తీర్ణం య.సెంట్లు	భూ సేకరణ క్రింద విస్తీర్ణం య.సెంట్లు	పట్టాదారుని పేరు	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు / కట్టడములు వగైరా వివరాలు.
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)
1	20	పుంజ	2.696	2.696	మద్దికొండ సత్య కీర్తి	ఎల్.పి.ఎం. నెం. 469	ఎల్.పి.ఎం. నెం. 28	ఎల్.పి.ఎం. నెం. 18	రిజర్వ్ ఫారెస్ట్	జీడిమామిడి-70, టేకు-8, మామిడి-2 నిమ్మ-3
2	100	పుంజ	2.615	2.615	అనంతపల్లి వీర్రాజు (తండ్రి) చిన్న భద్రరావు	ఎల్.పి.ఎం. నెం. 394	ఎల్.పి.ఎం. నెం.105,407	ఎల్.పి.ఎం. నెం. 421	ఎల్.పి.ఎం నెం.94, 394	పంట లేదు
3	108	పుంజ	1.009	1.009	జక్కుల కాళి ప్రసన్న (తండ్రి) సత్యనారాయణ	ఎల్.పి.ఎం. నెం. 394	ఎల్.పి.ఎం. నెం. 136	ఎల్.పి.ఎం. నెం. 397	ఎల్.పి.ఎం. నెం. 107	పంట లేదు
4	120	పుంజ	1.788	1.788	మద్దికొండ లక్ష్మి (భర్త) ఆనంద్	ఎల్.పి.ఎం. నెం. 378	ఎల్.పి.ఎం. నెం. 127	ఎల్.పి.ఎం. నెం. 132, 406	ఎల్.పి. ఎం. నెం. 114	టేకు-3 (40 సంవత్సరములు)
5	470	పుంజ	9.71	3.00	మద్దికొండ శ్రీమతి (తండ్రి) జగపతి	ఎల్.పి.ఎం. నెం. 360, 363	ఎల్.పి.ఎం. నెం. 370, 372	ఎల్.పి.ఎం. నెం. 365	పనుకు రాతి పాలెం గ్రామం	జీడిమామిడి తోట (2 నుంచి 3 సం.)
6	397	పుంజ	1.004	1.004	జక్కుల ఉమాప్రియ (తండ్రి) సత్యనారాయణ	ఎల్.పి.ఎం. నెం. 394	ఎల్.పి.ఎం. నెం. 139	ఎల్.పి.ఎం. నెం. 398	ఎల్.పి. ఎం. నెం. 108	జీడిమామిడి తోట (2 నుంచి 3 సం.)
7	398	పుంజ	1.002	1.002	జక్కుల సుబ్బారావు (తండ్రి) సత్యనారాయణ	ఎల్.పి.ఎం. నెం. 394	ఎల్.పి.ఎం. నెం. 139, 128	ఎల్.పి.ఎం. నెం. 399	ఎల్.పి. ఎం. నెం. 397	జీడిమామిడి తోట (2 నుంచి 3 సం.)
8	399	పుంజ	1.007	1.007	జక్కుల విద్యాసాగర్ (తండ్రి) సత్యనారాయణ	ఎల్.పి.ఎం. నెం. 394	ఎల్.పి.ఎం. నెం. 128	ఎల్.పి.ఎం. నెం. 404	ఎల్.పి. ఎం. నెం. 398	జీడిమామిడి తోట (2 నుంచి 3 సం.)
9	404	పుంజ	1.00	1.00	జక్కుల రవీంద్రనాధ్ (తండ్రి) సత్యనారాయణ	ఎల్.పి.ఎం. నెం. 394	ఎల్.పి.ఎం. నెం. 128	ఎల్.పి.ఎం. నెం. 405	ఎల్.పి. ఎం. నెం. 399	పంట లేదు
10	405	పుంజ	1.005	1.005	జక్కుల సూర్యలలిత కుమారి (తండ్రి) సత్యనారాయణ	ఎల్.పి.ఎం. నెం. 394	ఎల్.పి.ఎం. నెం. 128	బంద కొండ	ఎల్.పి. ఎం. నెం. 404	పంట లేదు
11	406	పుంజ	1.367	1.367	మద్దికొండ గురునాదం (తండ్రి) అబ్బాయి	ఎల్.పి.ఎం. నెం. 79, 110	ఎల్.పి.ఎం. నెం. 132	ఎల్.పి.ఎం. నెం. 110	ఎల్.పి. ఎం. నెం. 120, 378	జీడిమామిడి తోట (2 నుంచి 3 సం.)
12	421	పుంజ	4.039	4.039	అనంతపల్లి నాగేశ్వరరావు (తండ్రి) చిన భద్రరావు	ఎల్.పి.ఎం. నెం. 394	ఎల్.పి.ఎం. నెం. 386, 379	ఎల్.పి.ఎం. నెం. 102	ఎల్.పి. ఎం. నెం. 100	జీడిమామిడి తోట (2 నుంచి3 సం.)
			మొత్తం	21.532						

షెడ్యూలు

జిల్లా: పోలవరం మండలం : అడ్డతీగల గ్రామం : మెట్లపాలెం

క్రమ సంఖ్య	సర్వే నెం	వర్గీకరణ	మొత్తం విస్తీర్ణం య. సెంట్లు	భూ సేకరణ క్రింద విస్తీర్ణం య.సెంట్లు	పట్టాదారుని పేరు	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు / కట్టడములు వగైరా వివరాలు.
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)
1	5/1	పుంజ	7.02	2.00	మడకం లక్ష్మమ్మ (తండ్రి) భద్రరావు	ఆర్.ఎస్ నెం.5 భాగం	ఆర్.ఎస్ నెం.3	ఆర్.ఎస్ నెం.5 భాగం	ఆర్.ఎస్ నెం.3	జీడిమామిడి-53 వేప-1 టేకు-4 తాడి-23
2	26/1 A	పుంజ	2.03	1.83	చిక్కం పెద్ద అబ్బాయి దొర (తండ్రి) బాలు దొర	ఆర్.ఎస్ నెం. 24	ఆర్.ఎస్ నెం. 26/2	గ్రామ సరిహద్దు	ఆర్.ఎస్ నెం. 1	జీడిమామిడి-35 తాడి-60
3	26/6 A	పుంజ	1.28	1.00	చిక్కం బాపిరాజు (తండ్రి) బాలుదొర	ఆర్.ఎస్ నెం. 26/5	పెద్దేరు వాగు	పెద్దేరు వాగు	ఆర్.ఎస్ నెం. 1	పంట లేదు
4	46/1	పుంజ	10.72	3.00	మడకం బుల్లి దొర (తండ్రి) బాలుదొర	ఆర్.ఎస్ నెం. 61	ఆర్.ఎస్ నెం. 46 భాగం	ఆర్.ఎస్ నెం. 61	ఆర్.ఎస్ నెం. 46 భాగం	జీడిమామిడి-100 తాడి-30 చేతి బోరు-1 మామిడి-6
5	51/1	పుంజ	8.65	2.00	కుంజం సైమన్ దొర (తండ్రి) బుల్లిదొర	ఆర్.ఎస్ నెం. 51/2 భాగం	ఆర్.ఎస్ నెం. 51/1	కాలువ	ఆర్.ఎస్ నెం. 61	జీడిమామిడి-98 మామిడి-9, కొబ్బరి-3, తాడి-19
6	74/3	పుంజ	13.31	1.00	చేడి సన్యాసమ్మ (భర్త) నాగన్న దొర	ఆర్.ఎస్ నెం. 74 భాగం	ఆర్.ఎస్ నెం. 72	ఆర్.ఎస్ నెం. 75	ఆర్.ఎస్ నెం. 74 భాగం	చింత-2 తాడి-20
7	74/3	పుంజ	13.31	1.00	చిక్కం చిన్న అబ్బాయి దొర	ఆర్.ఎస్ నెం. 74 భాగం	ఆర్.ఎస్ నెం. 72	ఆర్.ఎస్ నెం. 75	ఆర్.ఎస్ నెం. 74 భాగం	జీడిమామిడి-5 చింత-4
8	74/3	పుంజ	13.31	6.52	చిక్కం రామాయమ్మ	ఆర్.ఎస్ నెం. 74 భాగం	ఆర్.ఎస్ నెం. 72	ఆర్.ఎస్ నెం. 75	ఆర్.ఎస్ నెం. 74 భాగం	జీడిమామిడి-170
9	80/1 B	పుంజ	12.40	3.00	చిక్కం రామన్న దొర (తండ్రి) సన్యాసి దొర	ఆర్.ఎస్ నెం. 80/1 భాగం	ఆర్.ఎస్ నెం. 67, 68	ఆర్.ఎస్ నెం. 81 భాగం	కాలువ	కొబ్బరి-1, మామిడి-10, జీడిమామిడి-30 తాడి-20
మొత్తం				21.35						

షెడ్యూలు

జిల్లా: పోలవరం మండలం : అడ్డతీగల గ్రామం : నిమ్మలపాలెం

క్రమ సంఖ్య	సర్వేనెం	వర్గీకరణ	మొత్తం విస్తీర్ణం య.సెంట్లు	భూ సేకరణ క్రింద విస్తీర్ణం య.సెంట్లు	పట్టాదారుని పేరు	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు / కట్టడములు వగైరా వివరాలు.
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)
1	3/1	పుంజ	3.60	3.60	బొడ్డు సీతాయమ్మ(భర్త) సత్యనారాయణ (డి-పట్టా భూమి)	సర్వే నెం 4	సర్వే నెం 17	సర్వే నెం 15	సర్వే నెం 2	జీడిమామిడి-266, చింత-4, తాడి-8
2	4/1	పుంజ	9.48	1.76	పాలచర్ల నారాయణరావు(తండ్రి) వీర్రాజు	సర్వే నెం. 5, 12	సర్వే నెం. 4/2	సర్వే నెం. 13	రిజర్వ్ ఫారెస్ట్	జీడిమామిడి-317
	4/3			1.37		సర్వే నెం. 5, 4/2	సర్వే నెం. 4/2	సర్వే నెం. 3	సర్వే నెం. 4/2	
	4/4			1.35		సర్వే నెం.5, 4/2	సర్వే నెం. 3	సర్వే నెం.3	రిజర్వ్ ఫారెస్ట్	
3	11-2	పుంజ	4.39	4.35	కామవరపు నాగశిరిష (భర్త) నాగేశ్వరరావు	సర్వే నెం. 11-1	సర్వే నెం. 10	సర్వే నెం. 10	సర్వే నెం. 12	జీడిమామిడి-200 మామిడి-3 కుంకుడు-1
4	13	పుంజ	3.73	3.70	కామవరపు నాగశిరిష (భర్త) నాగేశ్వరరావు	సర్వే నెం. 12	సర్వే నెం. 3	సర్వే నెం.15	సర్వే నెం.4	జీడిమామిడి-200
5	92-2	పుంజ	2.00	2.00	కొడబాల దేవిరెడ్డి(తండ్రి) పెద్దబ్బాయి (డి-పట్టా భూమి)	రిజర్వ్ ఫారెస్ట్	సర్వే నెం 91	సర్వే నెం 93	సర్వే నెం 92-1	జీడిమామిడి-95, తాడి-22, మామిడి-2
6	94-5	పుంజ	3.71	3.69	కనిగిరిరమణ (తండ్రి) దుర్గాప్రసాద్ (డి-పట్టా భూమి)	సర్వే నెం94-3,4	సర్వే నెం 100	సర్వే నెం 95, 96	సర్వే నెం 91	తాడి-39,చేతి పంపు-1, చింత-11
7	130-2	పుంజ	3.50	3.50	నందాలక్ష్మణరావు(తండ్రి) ఫకీరు (డి-పట్టా భూమి)	సర్వే నెం. 134	సర్వే నెం. 129	సర్వే నెం. 156, 127	సర్వే నెం. 130-1, 131	జీడిమామిడి-48
8	144	పుంజ	1.24	1.24	చెక్కావీరమనోహరరావు (తండ్రి) కన్నారావు	సర్వే నెం. 145	సర్వే నెం. 150	సర్వే నెం. 143	సర్వే నెం. 150	జీడిమామిడి-46
9	150	పుంజ	1.75	1.75	ఇజ్జపురెడ్డి వినాయకమ్మ (తండ్రి) కన్నారావు	సర్వే నెం. 143	సర్వే నెం. 151	సర్వే నెం. 156	సర్వే నెం. 145, 149	జీడిమామిడి-52
మొత్తం				28.31						

షెడ్యూలు

జిల్లా: పోలవరం మండలం : అడ్డతీగల గ్రామం : మల్లవరంమామిళ్ళు

క్రమ సంఖ్య	సర్వేనెం	వర్గీకరణ	మొత్తం విస్తీర్ణం య.సెంట్లు	భూ సేకరణ క్రిందవిస్తీర్ణంయ.సెంట్లు	పట్టాదారుని పేరు	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు / కట్టడములు వగైరా వివరాలు.
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)
1	12-2	పుంజ	4.27	4.15	బట్టులక్ష్మి (భర్త) గంగరాజు (D-Patta)	సర్వే నెం.13	సర్వే నెం.43	సర్వే నెం.14	సర్వే నెం.11	జీడిమామిడి-260, మామిడి-3, వేప-3, చింత-6, నిమ్మ-5
2	22	పుంజ	4.34	4.34	గోకినపద్మావతి (భర్త) వెంకటరావు	Reserve Forest	సర్వే నెం.23	సర్వే నెం.25	సర్వే నెం.21	జీడిమామిడి-237,చింత-2, బందారు-1
3	22	పుంజ	4.35	4.35	పాలచర్లప్రభావతి(భర్త) నారాయణరావు	Reserve Forest	సర్వే నెం.23	సర్వే నెం.25	సర్వే నెం.21	జీడిమామిడి-205, తాడి-3
4	19-1	పుంజ	2.72	2.72	పాలచర్లసత్యవతి (భర్త) నారాయణమూర్తి	సర్వే నెం. 23	సర్వే నెం.19-3	సర్వే నెం.19-2	సర్వే నెం.6	జీడిమామిడి-195
5	32/1	పుంజ	4.87	4.67	పడాలవిమలాదేవి(భర్త) సత్యశ్యామలవర ప్రసాద్	సర్వే నెం. 27	సర్వే నెం. 33	సర్వే నెం.30, 31	సర్వే నెం.27	జీడిమామిడి-245, నిమ్మ-4, తాడి-90, చింత-4, వేప-1
మొత్తం				20.23						

షెడ్యూలు

జిల్లా: పోలవరం మండలం: అడ్డతీగల గ్రామం : చిన్నమునకనగడ్డ

క్రమ సంఖ్య	సర్వే నెం	వర్గీకరణ	మొత్తం విస్తీర్ణం య. సెంట్లు	భూ సేకరణ క్రింద విస్తీర్ణం య.సెంట్లు	పట్టాదారుని పేరు	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు / కట్టడములు వగైరా వివరాలు.
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)
1	2/2	పుంజ	1.92	1.92	రెడ్జి చెల్లాయమ్మ (భర్త) సత్తిబాబు	దాన్యంపాలెంగ్రామం	స.నెం. 1, 3	స.నెం. 4	దాన్యంపాలెం గ్రామం	జీడిమామిడి-68
2	34	పుంజ	5.00	5.00	చేడి చిన్నబ్బాయి (తండ్రి) కోసం దొర	స.నెం. 35	స.నెం. 33	స.నెం. 73	స.నెం. 17,31,32	జీడిమామిడి-148
3	40/1	పుంజ	2.00	2.00	కుక్కల పొట్టమ్మ (భర్త) జోగిదొర	స.నెం. 66	స.నెం. 39	స.నెం. 67, 68	స.నెం. 54	జీడిమామిడి-60
మొత్తం				8.92						

షెడ్యూలు

జిల్లా: పోలవరం మండలం : అడ్డతీగల గ్రామం : భీముడుపాకలు

క్రమ సంఖ్య	సర్వేనెం	వర్గీకరణ	మొత్తం విస్తీర్ణం య. సెంట్లు	భూ సేకరణ క్రింద విస్తీర్ణం య.సెంట్లు	పట్టాదారుని పేరు	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు / కట్టడములు వగైరా వివరాలు.
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)
1	21-3B	పుంజ	2.50	1.43	గడపాల వెంటమ్మ (భర్త) వెంటయ్య	స.నెం.22	స.నెం.24, 25	స.నెం.22, 23	స.నెం.19, 20	జీడిమామిడి-20
2	29-2A	పుంజ	3.00	3.00	వమ్మంగి లక్ష్మి (భర్త) బాలరాజు	స.నెం. 28, 29-1	స.నెం.30	స.నెం.27	చిన అడ్డతీగల గ్రామం	జీడిమామిడి-78, మామిడి-5, వేప-6, ఎర్రచందనం-2, టేకు – 4
3	69/1	పుంజ	2.30	1.44	మద్దులూరి లక్ష్మి (భర్త) కిష్ట	స.నెం. 72, 70	స.నెం. 61	రిజర్వ్ ఫారెస్ట్	స.నెం. 68	జీడిమామిడి-48
మొత్తం				5.87						

ఈ భూముల ప్లాన్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, ఎడమ ప్రధాన కాలువ యూనిట్ -1, రాజమహేంద్రవరం వారి కార్యాలయము నందు ఉంచడమైనది. దానిని ఈ కార్యాలయపు పని వేళలలో ఏ సమయం లోనైనా తనిఖీ చేసుకోవచ్చును.

చట్టం లోని అంశములను అనుసరించి శ్రీ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు(భూసేకరణ) వారిచే తయారు చేయబడిన నివేదిక ఆధారంగా ఈ భూసేకరణ వలన ప్రాజెక్ట ప్రభావిత కుటుంబములు మరియు ప్రాజెక్ట నిర్వాసిత కుటుంబములు ఎవ్వరూ లేరు.

బొగ్గు గనులు, ఇనుపరాయి, పలకరాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలో గాని లేదా ఒక ప్రత్యేక బాగములో వుంటే అటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణమునకు అవసరమైన భూములను మాత్రమే త్రవ్వుట గానీ తొలగించుట గానీ చేయవలెను.

ప్రదేశము : రాజమహేంద్రవరం
తేది : 08-10-2026

జి.కనకరాజు
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే)
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు,
ఎల్.ఎమ్.సి-1, రాజమహేంద్రవరం.

వి.అభిషేక్ ఐ.ఎ.ఎస్
స్పెషల్ కలెక్టర్ (భూ.సే) (ఎఫ్.ఎ.సి),
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు,
రాజమహేంద్రవరం.

బడి రుణం తీర్చుకున్న పూర్వ విద్యార్థి

- గుజరాతిపేట ఎవిఎన్‌విఎం పాఠశాల కార్పొరేట్ హంగులతో నూతన శోభ
- పాఠశాలలో నేడు 'ఎఐ రోబోటిక్స్, సైన్స్ ల్యాబ్స్' ప్రారంభోత్సవం

శ్రీకాకుళం, అక్టోబరు 8 ప్రభాతవార్త: 'కన్నతల్లిని, చదువు నేర్పిన బడిని మరువకూడదు' అనే నానుడిని నిజం చేస్తూ, తాను చదువుకున్న ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ స్థాయి విద్యా సంస్థకు ఏమాత్రం తీసిపోని విధంగా అన్ని ఆధునిక వసతులతో సాంకేతిక హంగులతో తీర్చిదిద్దారు శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఐఏఎస్ అధికారి. ఆయనే ప్రస్తుతం సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టరుగా, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం డైరెక్టరుగా విధులు నిర్వర్తిస్తున్న బి.శ్రీనివాసరావు. శ్రీకాకుళం జిల్లా కేంద్రం నడిబొడ్డున గుజరాతిపేటలోని ఎవిఎన్‌విఎమ్ (అంధవరపు వరాహ నరసింహం మున్సిపల్ హైస్కూల్) ఉన్నత పాఠశాల విద్యా రంగంలో సరికొత్త విప్లవానికి వేదికగా నిలుస్తోంది.

అక్షరాలు దిద్దిన చోటే.. అగ్రగామిగా!: శ్రీకాకుళంలోని ఏ.వి.ఎన్.వి.ఎమ్.ఎస్. పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివిన బి.శ్రీనివాసరావు నాటి నుంచే చదువులో ప్రతిభ కనబరిచారు. తర్వాతి కాలంలో ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినప్పటికీ, తాను చదువుకున్న విద్యాలయాన్ని, ఆ నేలను మరువలేదు. తాను చదువుకున్న బడి రుణం తీర్చుకోవాలనే ఆశయంతో ముందుకు వచ్చారు.

బడి రుణం తీర్చుకుందాం అనే తపనతో..: తనకు విద్యాబుద్ధులు నేర్పిన బడి అభివృద్ధికి 'బడి రుణం తీర్చుకుందాం' అనే సంకల్పంతో శ్రీకారం చుట్టారు. పూర్వ విద్యార్థిగా వ్యక్తిగతంగా, అధికారిగా సి.ఎస్.ఆర్ నిధుల సహాయంతో పాఠశాలకు ఆధునిక సాంకేతిక, మౌలిక వసతులను సమకూర్చారు. పాఠశాల బాగు కోసం దాదాపు రూ. 1.40 కోట్లకు పైగా సహాయం అందించారు. పాఠశాలలో నిరంతర విద్యుత్ సరఫరా కోసం రూ. లక్ష విలువ గల హెవీ లోడ్ ఇన్వర్టర్ అందజేశారు. పాఠశాల అవసరాల కోసం రూ.1,50,000 విలువ గల అడ్వాన్స్డ్ జిరాక్స్ మెషిన్ అందజేశారు. పాఠశాల ప్రార్థన సమయంలో సమాచారం అందించేందుకు రూ.75 వేలతో నాణ్యమైన పబ్లిక్ అడ్రెస్సింగ్ (ఆడియో) సిస్టమ్ అందించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, పరిశోధనాత్మక ఆలోచనలను పెంపొందించే అత్యాధునిక అటల్ టింకరింగ్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా రూ.20 లక్షల వ్యయంతో పూర్తిస్థాయి కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయించారు. రూ. 20 లక్షలతో కార్పొరేట్ పాఠశాలలకంటే అద్భుతంగా ఉండేలా ఒకఆధునిక ఏసీ ఆడిటోరియం నిర్మించారు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గమనించి, వారి కోసం సకల వసతులతో కూడిన నూతన డైనింగ్ హాల్‌ను నిర్మించారు. దీని కోసం రూ.25 లక్షలు కేటాయించారు. రూ.5 లక్షలతో స్వచ్ఛమైన తాగునీటి కోసం ఆర్ ఓ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీఎంశ్రీ పాఠశాలల జాబితాలో చేర్చడంలో పూర్వ విద్యార్థిగా, అధికారిగా కీలక పాత్ర పోషించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అత్యున్నత స్థాయి విద్య, వసతులు దక్కాలనే పూర్వ విద్యార్థి అయిన బి.శ్రీనివాసరావు సంకల్పం సమాజానికి ఎంతో ఆదర్శనీయం. నూతనంగా అందుబాటులోకి వచ్చిన ఏఐ ల్యాబ్, రోబోటిక్స్, సైన్స్ వసతులు, ఆధునాతన సౌకర్యాలతో గుజరాతిపేట తిజుచీవీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన, ఆధునిక విద్యనుఅందిస్తూ జిల్లాలోని ఇతర పాఠశాలలకు ఆదర్శంగా నిలుస్తోందనడానికి నిదర్శనం.

సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు సంచాలకులు బి.శ్రీనివాసరావు ప్రత్యేక కృషి, ఆత్మీయ భాగస్వామ్యంతో ఆ పాఠశాల కార్పొరేట్ శోభను సంతరించుకుంది. ఈ నెల 9న (శుక్రవారం) జరిగే నూతన ఏఐ రోబోటిక్స్, సైన్స్ ల్యాబ్స్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన నాయుడు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు.

నా వంతు కృషి :

ఏ పాఠశాలైతే నాకు జ్ఞానాన్ని అందించి నా భవిష్యత్తుకు పునాది వేసిందో, ఆ బడి రుణం తీర్చుకోవడం నా బాధ్యత. గ్రూప్ 1 సాధించి ఆర్డీవోగా విధులు నిర్వర్తిస్తున్నప్పటి నుండి మా పాఠశాల నిరంతర అభివృద్ధికి నా వంతు కృషి చేస్తున్నాను. నా మిత్రులు పర్యవేక్షణ బాధ్యతలు తీసుకుని, ప్రతి అభివృద్ధి పనిలోనూ నేరుగా భాగస్వామ్యం అయ్యారు. వారందరికీ మనసారా కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

–బి.శ్రీనివాసరావు,
స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్, సమగ్ర శిక్ష

దుర్గా మండపాలకు ఉచిత విద్యుత్

విజయవాడ, అక్టోబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి: దసరా ఉత్సవాల సందర్భంగా దుర్గా పూజ నిర్వాహకులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త ప్రకటించింది. 2026 సంవత్సరానికి రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా ఏర్పాటు చేసే దుర్గా మండపాలకు ఉచిత విద్యుత్ సరఫరా చేయనున్నట్లు మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా వివరాలను వెల్లడించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో దసరా నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. దుర్గాదేవి మండపాల వద్ద ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తి కార్యక్ర మాలు నిర్వహించేందుకు నిర్వాహకులు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో మండపాల విద్యుత్ అవసరాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

నంది అవార్డులకు దరఖాస్తుల గడువు పొడిగింపు

విజయవాడ, అక్టోబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి: సినీ, టెలివిజన్ రంగాల్లో ప్రతిభను గుర్తించి అందించే నంది అవార్డులకు దరఖాస్తుల గడువును ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పొడిగించింది. అవార్డులకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 25వ తేదీ వరకు అవకాశం కల్పిస్తూ ఏపీ ఎఫ్‌డీసీ ప్రకటన విడుదల చేసింది. సినిమా, టెలివిజన్ రంగాల్లోని కళాకారులు, సాంకేతిక నిపుణులు, నిర్మాతలకు నంది అవార్డులు అందించే ప్రక్రియలో భాగంగా ఇప్పటికే దరఖాస్తులను ఆహ్వానించిన విషయం తెలిసిందే. వివిధ కారణాలతో పలువురు దరఖాస్తుదారులు తమ ఎంట్రీలను సమర్పించలేక పోవడంతో గడువు పొడిగించాలని విజ్ఞప్తులు వచ్చినట్లు తెలుస్తోంది.

పెండింగ్ అంశాలు పరిష్కరించండి

ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లలో ప్రజాభిప్రాయ సేకరణ వేగంగా జరిగేలా చూడండి

కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు వినతి

కేంద్రమంత్రి పాటిల్‌తో పోలవరంతో సహా పలు అంశాలపై చర్చిస్తున్న సిఎం

అమరావతి, అక్టోబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి: వచ్చే గోదావరి పుష్కరాల నాటికి పోలవరం నిర్మాణం పూర్తి చేసి జాతికి అంకితం చేసేలా పనులు వేగంగా జరుగుతున్నాయని సీఎం చంద్రబాబు కేంద్రమంత్రి సీఆర్‌పాటిల్‌కు వివరించారు. పోలవరం ప్రాజెక్టు పనుల ప్రగతిని, ఇటీవల రూ.30 వేల కోట్లతో చేపట్టిన జల్ జీవన్ మిషన్‌అమరజీవి జలధార పనుల వివరాలను కేంద్ర జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్ కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు.. ఈ రెండు ప్రాజెక్టులకు నిధులను ఎప్పటికప్పుడు విడుదల చేయాలని కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు సీఆర్ పాటిల్ తో భేటీ అయ్యారు. కేంద్ర జలశక్తి,ఏపీ ఇరిగేషన్ అధి కారులతో కలిసి ఇరువురు పలు అంశాలపై చర్చిం చారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రిని ఒడిశా, ఛత్తీసగఢ్ రాష్ట్రాలతో సుదీర్ఘంగా పెండింగులో ఉన్న పలు అంశాలను పరిష్కారించాలని సీఎం కోరారు. ఆ రెండు రాష్ట్రాల్లో పోలవరం నిర్మాణంలో భాగంగా చేపట్టాల్సిన ప్రొటెక్టివ్ ఎం బాంక్‌మెంట్స్ పనులకు సంబంధించిన ప్రజాభిప్రాయ సేకరణ పెండింగ్‌లో ఉందనే కారణంతో అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ జారీ చేసిన స్టాప్ వర్క్ ఆర్డర్ ప్రస్తుతం అబెయన్సులో ఉన్నప్పటికీ దాన్ని శాశ్వతంగా ఉపసంహరించాలని సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఒడిషా, ఛత్తీసగఢ్ రాష్ట్రాలు ప్రజా భిప్రాయ సేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేసేలా ఆ రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడి ఒప్పం చాలని కోరారు. ఈ మేరకు కేంద్ర జల మంత్రిత్వ శాఖ అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీసగఢ్ ముఖ్యమంత్రుల సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. మూడు రాష్ట్రాల విశాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, పరస్పర సహకారం, సమన్వయం ఇచ్చిపుచ్చుకునే ధోరణితో సమస్యను సామరస్యంగా పరిష్కరించు కోవచ్చని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. పోలవరం ప్రాజెక్టు వద్ద 41.15 మీటర్ల కాంటూరు వరకు నీటిని నిలిపేందుకు అవసరమైన పునరావాసం, ఆర్ అండ్ ఆర్ పనులను త్వరితగతిన చేపడుతున్నట్టు కేంద్ర మంత్రికి తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణానికి ఎంత ప్రాధాన్యత నిస్తున్నామో. నిర్వాసితుల సమస్యల పరిష్కారం.. పునరావాస పనులకూ అంతే ప్రాధాన్యమిస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. పోలవరానికి ఎలాంటి నిధుల కొరత రాకుండా చూడాలని సీఎం చంద్రబాబు కేంద్ర మంత్రిని కోరారు. అలాగే పోలవరం వద్ద 45.72 కాంటూరు వరకు నీటిని నిలిపేందుకు తీసుకో వాల్సిన చర్యలు, చేపట్టాల్సిన పనులపైనా కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం చంద్రబాబు చర్చించారు. గోదావరి నది నుంచి వేల టీఎంసీల వరద జలాలు సముద్రంలో వృధాగా కలిసిపోతు న్నాయని.. ఆ నీటిని సద్వినియోగం చేసుకునేలా పట్టిసీమ ద్వారా నీటిని తరలిస్తున్న విషయాన్ని ముఖ్యమంత్రి వివరించారు. పోలవరం ప్రాజెక్టు ను పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిది ద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఇటీవలే ప్రొద్దుటూరులో జల్ జీవన్ మిషన్‌అమరజీవి జలధార పనులను ప్రారంభిం చామని... రాష్ట్రంలో మొత్తంగా 95 లక్షల గ్రామీణ కుటుంబాలు ఉంటే... వాటిల్లో 62 లక్షల మంది ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఉన్నాయని.. తాజాగా 27 లక్షల గ్రామీణ కుటుంబా లకు మంచినీటి కనెక్షన్లు అందించేలా పనులకు శంకుస్థాపన చేశామని తెలిపారు. ఈ పనులకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని, పనులకు అనుగుణంగా సత్వరం నిధులు విడుదల చేసేలా చూడాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ సమావేశంలో నదుల అనుసంధానం తో కలిగే ప్రయోజనాలను కూడా సీఎం చంద్రబాబు కేంద్ర మంత్రికి వివరించారు. కేంద్రజల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను సీఎం చంద్రబాబు సముచితరీతిన సత్కరించి, శ్రీవెంకటేశ్వరుని ప్రతిమను జ్ఞాపికగా అందజేసారు. రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు. ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, సిఎం రమేష్‌లు ముఖ్యమంత్రిని అనుసరించి పాటిల్‌ను కలిసారు.

దసరా ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

విజయవాడ, అక్టోబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి: దసరా పండుగ సందర్భంగా స్వగ్రామాలకు వెళ్లే ప్రయాణికులకు ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ శుభవార్త చెప్పింది. ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు పూర్తి స్థాయిలో సన్నద్ధమైంది. పండుగ సందర్భంగా 5,261 ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయించింది. ఆయా రోజుల్లో రద్దీ మేరకు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంచేలా ఏపీఎస్ ఆర్టీసీ యాజమాన్యం ప్రణాళికను సిద్ధం చేసింది.దసరా పండగ సందర్భంగా ఈ నెల 16 నుంచి 25 వరకు ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల కోసం 5,261 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌కు 1,186, విశాఖకు 440, బెంగళూరుకు 475, చెన్నైకి 153, తిరుపతికి 247, రాజమహేంద్రవరానికి 347 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు వెల్లడించారు.

టెక్నాలజీతో టూరిజానికి సరికొత్త హంగులు:మంత్రి దుర్గేష్

- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం టెక్నాలజీతో ఏపి టూరిజం నయా ట్రెండ్

- టూరిజం ఇన్నోవేషన్ సమ్మిట్‌లో పర్యాటక రంగంపై ప్రశంసలు

అంతర్జాతీయ ఇన్వెస్టర్లు, పర్యాటక రంగ దిగ్గజాలతో మంత్రి దుర్గేష్ చర్చలు జరుపుతున్న దృశ్యం

అమరావతి,అక్టోబరు 8,ప్రభాతవార్తప్రతినిధి: అంతర్జాతీయ పర్యాటక రంగంలో వస్తున్న ఆధునిక మార్పులు, టెక్నాలజీ వినియోగంపై ఎన్నో విలువైన విషయాలు తెలుసుకున్నామని, స్పెయిన్ టూరిజం ఇన్నోవేషన్ సమ్మిట్ లో పొందిన అద్భుతమైన అనుభవాలను, ఉత్తమ విధానాలను ఏపీలో పర్యాటక అభివృద్ధికి పూర్తిస్థాయిలో అమలు చేయడానికి విశేష కృషి చేస్తామని మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు.. స్పెయిన్ లోని సెవిల్లెఫిబెస్ వేదికగా జరుగుతున్న ప్రతిష్టాత్మక టూరిజం ఇన్నోవేషన్ సమ్మిట్ 2026లో భాగంగా మూడో రోజు టూరిస్టెక్ స్టార్టప్ ఫెస్ట్, టూరిజం స్టార్టప్ అట్లాస్, టెక్నాలజికల్ టూర్స్, ట్రావెల్ ఏజెన్సీస్ సమ్మిట్, డిస్కవర్ సెవిల్లె, అర్జెంటీనా డెస్టినేషన్ పార్టనర్ 2026, టూరిజం 4 నేచర్ అవార్డ్స్, అలాగే వెల్‌కమ్ పార్టీ, డిస్కవర్ సెవిల్లె విత్ సిటీ సైట్ సీయింగ్ తదితర కార్యక్రమాలలో మంత్రి దుర్గేష్ ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ పర్యటనలో భాగంగా పలు అంతర్జాతీయ ఇన్వెస్టర్లు, పర్యాటక రంగ దిగ్గజాలతో మంత్రి దుర్గేష్ ముఖాముఖి చర్చలు జరిపారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక ప్రాంతాల విశిష్టతలను వారికి వివరించడంతో పాటు, ఏపీ పర్యాటక సంపదను ప్రతిబింబించే ప్రత్యేక సావనీర్ బుక్స్ ను అందజేశారు. ఈ సదస్సు ద్వారా ఏర్పడిన బలమైన నెట్‌వర్క్, పారిశ్రామిక పరిచయాలను రాష్ట్రానికి పెట్టుబడులుగా మలిచేందుకు పూర్తి స్థాయిలో చొరవ తీసుకుంటానని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.ఈ సదస్సులో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమ్మిట్ స్టూడియోలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... ప్రపంచ స్థాయి టూరిజం ఇన్నోవేషన్ సమ్మిట్‌లో భాగస్వామి కావడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దూరదృష్టిగల నేతృత్వంలో రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని విప్లవాత్మకంగా మారుస్తున్నామని తెలిపారు. ఏఐ, క్వాంటం కంప్యూటింగ్ వంటి అధునాతన సాంకేతికతలను పర్యాటక రంగంలోకి విజయవంతంగా తీసుకువచ్చినట్లు వెల్లడించారు. విశాఖపట్నం నుంచి తిరుపతి వరకు యాత్రికుల సౌకర్యార్థం పిలిగ్రిమ్ టూరిజం, ఎకో టూరిజంతో పాటు సుదీర్ఘ సముద్ర తీర ప్రాంతంలో ప్రత్యేక వెల్‌నెస్ సెంటర్లు, అమ్యూస్‌మెంట్ పార్కులు, స్టార్ హోటళ్లు, రిసార్ట్‌లను అత్యాధునిక వసతులతో అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. ఎక్స్‌ప్లరర్ సంస్థతో కుదుర్చుకున్న ఎంఓయూ ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే పర్యాటకులు ఎలాంటి ఖర్చులేకుండా ఉచితంగా 130కి పైగా భాషల్లో 100 పర్యాటక ప్రాంతాల విశేషాలను తెలుసుకునే సరికొత్త సదుపాయాన్ని ఏపీలో అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు.చరిత్ర ఏదైనా, భాష ఏదైనా.. ఏపీ పర్యాటక కేంద్రాల విశేషాలను చిటికెలో తెలిపే అత్యాధునిక డిజిటల్ గైడ్ టెక్నాలజీని ఏపీలో అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నెల్లూరులో 23 ప్రభుత్వ స్కూళ్లకు అంతర్జాతీయ హంగులు

ఆర్ఎస్ఆర్ స్కూల్‌లో మంత్రి నారాయణ

విద్యార్థులతో కలిసి అల్పాహారం చేస్తున్న మంత్రి నారాయణ తదితరులు

నెల్లూరు, అక్టోబర్ 8, ప్రభాతవార్త - వైద్యం పేదరికాన్ని పుస్తకాల్లో చదవలేదు, జీవితంలో అనుభవించానని, అందుకే పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను ఉచితంగా అందించాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నానని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. ఎన్నికల సమయంలో 80 వేల ఇళ్లకు వెళ్లినప్పుడు ఆర్థిక ఇబ్బందులతో చదువుకోలేకపోతున్న నిరుపేద విద్యార్థుల పరిస్థితులను ప్రత్యక్షంగా చూశానని, వారికి నాణ్యమైన విద్య అందిస్తానని ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నానని చెప్పారు. నెల్లూరు సిటీ నియోజకవర్గం స్టోన్‌హౌస్ పేటలోని ఆర్ఎస్ఆర్ ప్రభుత్వ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యా కమిటీ సభ్యులతో నిర్వహించిన ఆత్మీయ సదస్సులో నారాయణ మాట్లాడారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ పొంగూరు షరణితో కలిసి పాల్గొన్న మంత్రి విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని 23 ప్రభుత్వ హైస్కూళ్లను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు. దాతల సహకారంతో ఇప్పటికే 15 పాఠశాలల ఆధునీకరణ పనులు చేపట్టామని తెలిపారు. ప్రభుత్వం పై భారం వేయకుండా సీఎస్ఆర్ నిధులతో పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యా వాతావరణాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు. వక్ఫ్‌బోర్డు స్థలంలో రూ.20 కోట్ల సీఎస్ఆర్ నిధులతో డాక్టర్ అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ స్కూల్‌ను స్విమ్మింగ్ పూల్‌తో నిర్మిస్తున్నామని తెలిపారు.తాటాకు గుడిసెలో పుట్టి, కష్టాల్లో పెరిగానని నారాయణ చెప్పారు. తన తండ్రి ప్రైవేట్ బస్సు కండక్టర్‌గా పనిచేసి తెచ్చిన జీతంతోనే కుటుంబం గడిచేదని తెలిపారు. హరనాథపురం నుంచి వీఆర్సీ వరకు కాలినడకన వెళ్లి చదువుకున్న రోజులను గుర్తుచేసుకున్నారు.అప్పుడే బాగా చదివి పేదరికాన్ని జయించాలని నిర్ణయించుకున్నానని, కష్టపడి చదివి ఈ స్థాయికి వచ్చానని తెలిపారు. అందుకే పేద విద్యార్థులకు విద్య అనే శాశ్వత ఆస్తిని పంచాలని నిర్ణయించుకున్నానన్నారు. గత ప్రభుత్వం మూసేసిన వీఆర్సీ ని ఆధునీకరించడంతో నెల్లూరులో విద్యాయజ్ఞానికి శ్రీకారం చుట్టానని మంత్రి తెలిపారు. అదే స్ఫూర్తితో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆర్ఎస్ఆర్ పాఠశాలను అద్భుతంగా తీర్చిదిద్దారని కొనియాడారు. డిజిటల్ తరగతి గదులు, డైనింగ్ హాళ్లు, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ ల్యాబ్‌లతో పాటు రోబోటిక్స్, ఆస్ట్రో ల్యాబ్‌లు ఏర్పాటు చేశామని వివరించారు. అధునాతన క్రీడా మైదానాలు, మ్యూజిక్, డ్యాన్స్ గదులను కూడా సిద్ధం చేశామని తెలిపారు.

విద్యార్థులంతా బాగా చదివి డాక్టర్లు, ఇంజనీర్లు, ఐఏఎస్ అధికారులు, శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ విద్యాభివృద్ధికి వేస్తున్న బాటలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

గుడ్డు పోషకాహారానికి చౌకైన వనరు ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానం

- ప్రపంచ గుడ్డు దినోత్సవం సందర్భంగా పౌల్ట్రీరైతులకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి అచ్చెన్నాయుడు



అమరావతి, అక్టోబర్ 8,ప్రభాతవార్తప్రతినిధి: అందరికీ సరసమైన ధరలో లభించే నాణ్యమైన పోషకాహారం గుడ్డు అని, గుడ్ల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో నిలవడం గర్వకారణమని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. అక్టోబర్ 9న ప్రపంచ గుడ్డు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన ఒక ప్రకటనలో ప్రజలకు గుడ్డు పోషక విలువలపై అవగాహన పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజలకు అందుబాటు ధరలో నాణ్యమైన ప్రోటీన్‌ను అందించడంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పించడంలో పౌల్ట్రీ రంగం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రతి సంవత్సరం అక్టోబర్ నెల రెండో శుక్రవారం ప్రపంచ గుడ్డు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని, గుడ్డు వల్ల కలిగే పోషక ప్రయోజనాలను ప్రజలకు తెలియజేయడం, సమతుల్య ఆహారంలో దాని ప్రాధాన్యతపై అవగాహన కల్పించడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యమని మంత్రి వివరించారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన ప్రోటీన్‌తోపాటు పలు అవసరమైన పోషకాలను పొందేందుకు గుడ్డు ఉపయోగపడుతుందన్నారు. పిల్లలు, యువత, గర్భిణీలు, బాలింతలు, వృద్ధులు, శారీరక శ్రమ చేసేవారు తమ వయస్సు, ఆరోగ్య పరిస్థితి, పోషక అవసరాలకు అనుగుణంగా సమతుల్య ఆహారంలో గుడ్డును చేర్చుకోవచ్చని సూచించారు. రాష్ట్రంలో 1,190.88 లక్షల కోళ్ల సంపదతో పౌల్ట్రీ రంగం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలమైన ఆధారంగా కొనసాగుతోందని అచ్చెన్నాయుడు తెలిపారు. 2024-25లో ఆంధ్రప్రదేశ్ 2,739.04 కోట్ల గుడ్ల ఉత్పత్తిని నమోదు చేసి దేశంలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. దేశవ్యాప్తంగా ఉత్పత్తి అయిన 14,911 కోట్ల గుడ్లలో రాష్ట్ర వాటా 18.37 శాతంగా ఉందని వివరించారు. ఈ స్థాయికి చేరుకోవడంలో పౌల్ట్రీ రైతుల కృషి ప్రశంసనీయమని, రాష్ట్ర అగ్రస్థానాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పౌల్ట్రీ రంగానికి ప్రోత్సాహం అందిస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో స్వర్ణాంధ్ర-2047, వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా పౌల్ట్రీ రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. పెరుగుతున్న అవసరాలను తీర్చడం, స్వయం సమృద్ధిని సాధించడం, కొత్త అభివృద్ధి అవకాశాలను అందిపుచ్చుకోవడం లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ పౌల్ట్రీ డెవలప్‌మెంట్ పాలసీ 2026-29ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. పౌల్ట్రీ రైతులకు మౌలిక సదుపాయాలు, ఆధునిక పౌల్ట్రీ యూనిట్ల ఏర్పాటు, వడ్డీ రాయితీలు తదితర ప్రోత్సాహకాలతో ఈ రంగాన్ని బలోపేతం చేస్తున్నామని వివరించారు. స్థానికంగా గుడ్ల వినియోగాన్ని పెంచడంతోపాటు వివిధ పౌల్ట్రీ ఉత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో తలసరి గుడ్ల వినియోగం సంవత్సరానికి సుమారు 108 గుడ్లుగా ఉందన్నారు.

లారీ, కారు ఢీ.. ఒకరు మృతి - ముగ్గురికి తీవ్రగాయాలు

తుగ్గలి,అక్టోబర్ 8,ప్రభాతవార్త: మండలంలోని రాతన గిరిజన గురుకుల పాఠశాల సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ముగ్గురు తీవ్రగాయాలకు గురి అయ్యారు. మంత్రాలయంలో శ్రీరాఘవేంద్రస్వామిని దర్శించుకొని స్వగ్రామానికి తిరుగు ప్రయాణమైన వారి జీవితాలు తలకిందులయ్యాయి. సమాచారం అందుకున్న పత్తికొండ రూరల్ సి.ఐ.పెద్దయ్యానాయుడు, తుగ్గలి ఎస్సై నరేష్, జొన్నగిరి ఎస్సై మల్లికార్జున హుటాహుటిన ఘటనా స్థలానికి గాయపడిన వారిని 108లో అంబులెన్స్ ద్వారా పత్తికొండ ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. ప్రమాద తీవ్రతకు కారు నుజ్జునుజ్జు కావడంతో అందులో బుజేంద్ర అనే వ్యక్తి మృతదేహం కారులో ఇరుక్కొని పోవడంతో తీసేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. జేసీబీ క్రేన్ సహాయంతో కారులోంచి మృతదేహాన్ని బయటికి తీశారు. అనంతరం అంబులెన్స్‌లో పోస్టుమార్టం నిమిత్తం పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసుల తెలిపిన వివరాల మేరకు చిక్‌బళ్ళాపురానికి చెందిన బుజేంద్ర, బాలకృష్ణ, ప్రకాష్, సుదీప్‌లు కారులో మంత్రాలయం వెళ్ళి శ్రీరాఘవేంద్రస్వామిని దర్శించుకొని తమ స్వగ్రామానికి తిరుగు ప్రయాణమై వెళుతుండగా ఈ ధుర్ఘటన రాతన గిరిజన గురుకుల పాఠశాల సమీపంలోకి చేరుకోగానే కడప నుంచి గుజరాత్ వైపు వెళుతున్న లారీ కారును బలంగా ఢీ కొట్టగా బుజేంద్ర మృతి చెందగా సుదీప్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బాలకృష్ణ, ప్రకాష్‌లకు స్వల్ప గాయాలుఅయ్యాయి. మెరుగైన చికిత్స నిమిత్తం వారిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఓటు చోరీపై నిలదీస్తే అరెస్టులా! - తిరుపతిలో కాంగ్రెస్ నేతల వినూత్న నిరసన

తిరుపతి, అక్టోబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి: లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఎంపి ప్రియాంకా గాంధీ అరెస్టు అప్రజాస్వామిక చర్య అని కాంగ్రెస్ పార్టీ తిరుపతి అర్బన్ జిల్లా అధ్యక్షుడు గౌడపేర చిట్టిబాబు ఖండించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దుర్మార్గంగా ఓట్ చోరీకి పాల్పడుతుంటే నిలదీసినందుకు లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని,ఎంపి ప్రియాంక గాంధీ తో బాటు పలువురు ఎంపిలను పోలీసులు దౌర్జన్యంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. దుర్మార్గపు చర్యఅని కాంగ్రెస్ పార్టీ తిరుపతి అర్బన్ జిల్లా అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ తిరుపతి అర్బన్ జిల్లా అధ్యక్షుడు గౌడపేర చిట్టిబాబు విమర్శించారు. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ పోలీసులు అడ్డుకోవడం బలవంతంగా అరెస్టు చేసి పోలీస్ వ్యాన్లలో తరలించడం భారతదేశ ప్రజాస్వామ్యానికే బ్లాక్ డేగా భావించారు. ఎఐసిసి,పిసిసి పిలుపు మేరకు బుధవారం తిరుపతిలోని గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ నేతలు నల్ల దుస్తులు ధరించి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తిరుపతి అర్బన్ జిల్లా అధ్యక్షుడు గౌడపేర చిట్టిబాబు మాట్లాడుతూ ఓటు చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఈ పోరాటం కేవలం రాజకీయ మైనది కాదని, దేశ రాజ్యాంగాన్ని, ప్రజా స్వామ్యాన్ని కాపాడుకోవడానికి చేస్తున్న పోరాటం అని స్పష్టం చేశారు. తప్పులు జరిగితే సరిదిద్దాల్సిన ఎలక్షన్ కమిషనర్ అందుకు విరుద్ధంగా బిజెపికి లబ్ధి చేకూర్చేలా ఓటర్ల జాబితా సవరణ పేరుతో చోరీకి పాల్పడటం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే అన్నారు. దేశ ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు తమ పోరాటం ఆగేది లేదని చెప్పారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్‌రాష్ట్ర ఉపాధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

పలాస - కాశీబుగ్గను మోడల్ పట్టణంగా తీర్చిదిద్దుతాం

ఇంటింటికీ నిరంతర తాగు నీరు - డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం

కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు

పలాస (శ్రీకాకుళం జిల్లా), అక్టోబర్ 8 ప్రభాతవార్త : పలాస-కాశీబుగ్గ పట్టణ ప్రజలు, ముఖ్యంగా మహిళలు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న తాగునీరు, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించి, ఆధునిక మౌలిక వసతులతో మున్సిపాలిటీని మోడల్ పట్టణంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి గురువారం పలాస-కాశీబుగ్గ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించిన సందర్భంగా మంత్రి మాట్లాడారు. పట్టణంలోని ప్రతి ఇంటికీ 24 గంటల పాటు స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. యుఐడిఎఫ్ నిధులతో రూ.121.99 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే సమగ్ర మంచినీటి సరఫరా అభివృద్ధి పథకానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, హిరమండలం రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకువచ్చి సూదికొండతోపాటు అవసరమైన ప్రాంతాల్లో నీటి ట్యాంకులు నిర్మించి, ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా సరఫరా చేస్తామని వివరించారు. పట్టణంలోని వార్డులు, మురికివాడల్లో డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) నిధులతో రూ.5 కోట్ల అంచనా వ్యయంతో సీసీ డ్రైన్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. అవసరమైన ప్రాంతాల్లో దశలవారీగా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామన్నారు. పలాస- పూండి రైల్వే స్టేషన్ల మధ్య ఎల్.సి. స్థానంలో రూ.46.23 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన రైల్వే ఓవర్ బ్రిడ్జిని ప్రారంభించామని మంత్రి తెలిపారు. రైల్వే క్రాసింగ్ వద్ద వాహనదారులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు ఈ వంతెనతో పరిష్కారం లభిస్తుందన్నారు. దసరా నాటికి పూర్తిస్థాయిలో వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యేలా మిగిలిన పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించినట్లు చెప్పారు. ఎన్నికల నోటిఫికేషన్ వస్తే పనులు మరో మూడు నెలలు ఆలస్యమయ్యే అవకాశం ఉన్నందున వంతెన పనులు ము గింపు దశకు చేరగానే ప్రారంభిం చామన్నారు. ఫ్లైఓవర్ నుంచి జాతీయ రహదారి వరకు రహదారిని విస్తరించి, డబుల్ రోడ్డుతోపాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

హైదరా బాద్, సికింద్రాబాద్ తరహాలో పలాస-కాశీబుగ్గను ఆధునికంగా, సుందరంగా అభివృద్ధి చేస్తామని, ప్రత్యేకంగా జిల్లా కేంద్ర హోదా అవసరం లేకుండానే జిల్లా కేంద్రాన్ని తలదన్నే స్థాయిలో మున్సిపాలిటీని తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. 2014లో రాష్ట్ర విభజన అనంతరం తీవ్ర ఆర్థిక లోటు, రాజధాని లేని క్లిష్ట పరిస్థితుల్లోనూ చంద్రబాబు నాయుడు నాయకత్వంలో జరిగిన అభివృద్ధితో 2014-2019 పాలన రాష్ట్ర చరిత్రలో స్వర్ణయుగంగా నిలిచిందని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ప్రజలు 2024 ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి ఘన విజయాన్ని అందించారని చెప్పారు. 2024 జూన్ 12న చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా, తాను మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి రాష్ట్ర పునర్నిర్మాణం, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు.

మేం అధికారం చేపట్టే సమయానికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వెంటిలేటర్‌పై ఉన్న రోగిలా ఉంది. ఆ వ్యవస్థకు ఆక్సిజన్ అందించి, తిరిగి గాడిన పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం" అని మంత్రి వ్యాఖ్యానించారు.

ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు చెల్లించడంలో ఎదురైన ఇబ్బందులను అధిగమించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు సమర్థ నాయకత్వంలో చర్యలు చేపట్టామని తెలిపారు.

నేటి నుండి విజయవాడలో గాంధీ శిల్ప బజార్

విజయవాడ, అక్టోబర్ 9,ప్రభాతవార్తప్రతినిధి: విజయవాడ ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలోని మారిస్ స్టెల్లా ఇండోర్ స్టేడియంలో గాంధీ శిల్ప బజార్‌ను (ప్రత్యేక ప్రదర్శన, అమ్మకం) శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ప్రారంభించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ వైస్‌చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ విశ్వ మనోహరన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పీ.సిసోడియా ముఖ్య అతిథిగా హాజరు కానుండగా, సంస్థ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ ప్రదర్శనను ప్రారంభించనున్నారు. కేంద్ర హస్తకళల అభివృద్ధి కమిషనర్, కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ సహకారంతో అక్టోబర్ 18 వరకు ఈ ప్రదర్శన నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 70 మంది కళాకారులు, చేతివృత్తిదారులు ఇందులో పాల్గొంటారు. కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు, కలంకారీ, చెక్క శిల్పాలు, టెర్రకోట, తోలుబొమ్మలు, క్రోషే లేస్ తదితర సంప్రదాయ హస్తకళా ఉత్పత్తులను ప్రత్యేకంగా ప్రదర్శించి విక్రయించనున్నారు. ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రదర్శన అందుబాటులో ఉంటుందని విశ్వ మనోహరన్ తెలిపారు. నగర ప్రజలు పెద్ద సంఖ్యలో శిల్పి బజార్ ను సందర్శించి కళాకారులను ప్రోత్సహించాలని ఆయన కోరారు.

విజయవాడ దసరా ఉత్సవాలకు ఉపరాష్ట్రపతి, ప్రముఖులకు ఆహ్వానం

విజయవాడ, అక్టోబరు 8(ప్రభాతవార్త): విజయవాడలో జరగనున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్ 2.0, సరస్ మేళా కార్యక్రమాల్లో పాల్గొనాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ కు గురువారంనాడు ఆహ్వానం పలికింది. ఎంపీలు కేశినేని చిన్ని, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, దగ్గుమళ్ల ప్రసాద్ ఆయనను కలిసి విజయవాడ దసరా వేడుకలలో పాల్గొనాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. విజయవాడ ఉత్సవాలలో పాల్గొనాల్సిందిగా భారత రాష్ట్రపతి, పలువురు కేంద్రమంత్రులు, అస్సాం, గుజరాత్, తమిళనాడు, కర్ణాటక, ఢిల్లీతో సహా పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానం పలికిన విషయం విదితమే. కాగా, గురువారంనాడు తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విజయవాడ ఎంపీలు కేశినేని శివనాథ్ (చిన్ని),

సాన సతీష్ బాబు, ఎంపి భరత్ లు కలిసి ఆహ్వాన పత్రికను అందచేశారు. కాగా, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను ఎంపిలు లావు కృష్ణదేవ రాయలు, సాన సతీష్,బైరెడ్డి శబరి గురువారం కలిసి విజయవాడలో జరిగే దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు.

రోజా 'ఆడుదాం ఆంధ్ర' అవినీతిలో జైలుకెళ్లడం ఖాయం

- జనసేన నాయకుడు కిరణ్ రాయల్

తిరుపతి హెల్త్, అక్టోబర్ 8, ప్రభాతవార్త గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా ఎక్కడపడితే అక్కడ దోచేసిన మాజీ మంత్రి రోజా ఈరోజు నేనున్నాను అంటూ మీడియా ముందుకు వచ్చి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని జనసేన పార్టీ నాయకులు కిరణ్ రాయల్ అన్నారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదవిని అడ్డుపెట్టుకొని ఆడుదాం ఆంధ్ర పేరుతో దోచేసిన అవినీతి సొమ్ములతో చెన్నై, బెంగళూరు, హైదరాబాదు, థాయిలాండ్లలో బంగ్లాలు కొంటే, కోట్లాది మంది అభిమానులు కలిగిన వ్యక్తి, ఉప ముఖ్యమంత్రిగా ఉన్న పవన్ కళ్యాణ్ తన సొంత డబ్బులతో స్పెషల్ ఫ్లైట్లో ప్రజల అవసరాల రీత్యా తిరిగితే తప్పేముంది అన్నారు. ఆడుదాం ఆంధ్ర పేరుతో అవినీతికి పాల్పడ్డ నీవు తొందరలోనే జైలుకు వెళతావని, నీ అక్రమ ఆస్తులు పైన ఎంక్వాయిరీ వేయించి, అవినీతి సొమ్మును అంతా కక్కిస్తామన్నారు.35వేల 150కోట్ల రూపాయలతో పవన్ కళ్యాణ్ కృషితో జలజీవన్ ప్రాజెక్టు తెచ్చామన్నారు.

స్వాతంత్రం వచ్చి ఇన్ని సంవత్సరాలు కావస్తున్న రోడ్లు లేని ఊర్లకు రోడ్లు వేయడం క్రెడిట్ చోరీనా? అని ప్రశ్నించారు. గత మీ పాలనలో పల్లె నిద్ర కార్యక్రమంలో సినిమా యాక్టింగ్ లా నిద్ర చేసిన సంగతి ప్రజలు ఇంకా మరువలేదన్నారు. నీకు మీ నాయకుడు నగిరి ఎమ్మెల్యే సీటు కాదు కదా కార్పొరేషన్ సీటు కూడా ఇవ్వడని ఆరోపించారు.

ఎర్రచందనం దొంగలను అక్రమ రవాణా చేస్తేనే కదా పట్టుబడ్డతాయని,పట్టు పడడం లేదంటే అక్రమ రవాణా జరగలేదని, జరిగితే పవన్ కళ్యాణ్ ఏంటో చూస్తారన్నారు.

శ్రీకాకుళం అభివృద్ధి కార్యక్రమాల్లో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

శ్రీకాకుళం, అక్టోబర్ 8, ప్రభాతవార్త : కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు గురువారం పలాస నియోజకవర్గ పరిధిలోని వజ్రపుకొత్తూరు, మందస మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వజ్రపుకొత్తూరు మండలం దేవునల్తాడలో పీఎంఎస్ఎస్‌వై పథకం నిధులు రూ.1.32 కోట్లతో నిర్మించిన చేపల వేలం హాల్, చేపల ప్రాసెసింగ్ కేంద్రాన్ని ప్రారంభించారు. వజ్రపుకొత్తూరు మండలం పెద్ద మురహరిపురంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీతో కలిసి ఆవిష్కరించారు. మందస మండలం హరిపురం రట్టి కూడలిలో సుడా నిధులు రూ.74 లక్షలతో ఏర్పాటు చేయనున్న సెంట్రల్ డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులకు, హరిపురంలో రూ.2.50 కోట్ల రూపాయల ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా సి.ఎస్.ఆర్ నిధులతో నిర్మిస్తున్న మినీ స్టేడియం పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో జేసీ ఫర్మన్ అహ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం : మంత్రి పార్థసారథి

ఆగిరిపల్లి, అక్టోబరు08, (ప్రభాతవార్త) భూసమస్యలు లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం కనసానపల్లి, వట్టిగుడిపాడు గ్రామాల్లో నిర్వహించిన "మీ భూమి-మీ హక్కు కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు.

కనసానపల్లిలో 635, నూగుండపల్లిలో 685, నర్సింగపాలెంలో 565, వట్టిగుడిపాడులో 942, కృష్ణవరంలో 704 మంది రైతులకు పాసుపుస్తకాలు అందజేశారు. గ్రామసభల్లో ప్రజలు పలు భూసమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా, వాటిపై వెంటనే స్పందించాలని అధికారులను ఆదేశించారు. నాలుగు నుంచి ఆరు రోజుల్లో పరిష్కరించగల సమస్యలను పరిష్కరించాలని, వీలుకాని వాటిని తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. వీబీ జీరామ్‌జీ ద్వారా నియోజకవర్గానికి అదనంగా రూ.25 కోట్లు నిధులు మంజూరయ్యాయని మంత్రి తెలిపారు. కనసానపల్లిలో కమ్యూనిటీ హాలు నిర్మాణం, వట్టిగుడిపాడులో దసరా నాటికి 200 మందికి ఇళ్ల పట్టాలు, రహదారుల నిర్మాణానికి హామీ ఇచ్చారు. రైతుల ఆస్తులు, భూహక్కులకు భరోసా కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమని పార్థసారథి తెలిపారు. రీసర్వేలో రైతులను భాగస్వాములను చేసి, వివరాలను పరిశీలించిన అనంతరం ఈకేవైసీ పూర్తి చేసి పాసుపుస్తకాలు జారీ చేస్తున్నామని చెప్పారు. పాసుపుస్తకాల్లో తప్పులు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకువస్తే సరిచేసి అందజేస్తామని అన్నారు. పాసుపుస్తకంలోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే పట్టాదారు వివరాలు, భూమి విస్తీర్ణం, స్కెచ్, రూట్ మ్యాప్, ఉపగ్రహ చిత్రాలను కూడా పరిశీలించవచ్చని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఏపీ అగ్రికల్చర్ మిషన్ వైస్‌చైర్మన్ మర్రిరెడ్డి శ్రీనివాసరెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, రైతులు, భూయజమానులు పాల్గొన్నారు.

అర్హతలేని వ్యక్తిని కమిషనర్‌గా నియమించటం సిగ్గుచేటు

- మంత్రి కనుసన్నల్లోనే కార్పోరేషన్‌లో ప్రజాధనం లూటీ - మంత్రి నారాయణ

అవినీతికి ప్రజలకు వివరణ ఇవ్వాలి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు,అక్టోబరు8 ప్రభాతవార్త-విద్య నిబంధనలకు విరుద్ధంగా అర్హతలేని వ్యక్తిని మంత్రి నారాయణ తన అవినీతిని సాఫీగా కొనసాగించుకునేందుకు నెల్లూరు మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్‌గా నియమించారని వైకాపా నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్, తూర్పురాలయసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చందశేఖర్‌రెడ్డి ధ్వజమెత్తారు. గురువారం నగరంలోని స్థానిక రాంజీ నగర్‌లోని వైకాపా నగర కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్సీ మాట్లాడుతు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి కార్పోరేషన్‌లో పరిస్థితి దారుణంగా తయారైందన్నారు. నెల్లూరుమున్సిపల్ కార్పోరేషన్ కి ఐఏఎస్ లేదా సీనియర్ ఐఏఎస్ అధికారి స్థాయి వారిని కమిషనర్‌గా నివమించాలని ఆదేశాలు ఉన్నా అర్హత లేని నందన్‌ను ఇచ్‌చార్జ్‌గా విధులు అప్పగించారన్నారు. దీనిని ఆయన తిరస్కరించటంతో అప్పటి కప్పుడు యుద్ధ ప్రాతిపదికన మంత్రి నారాయణ ప్రత్యేక ఆదేశాలతో ఎఫ్ఏసీగా నియమించటం జరిగిందన్నారు. మంత్రి నారాయణ చెప్పినట్టు వినే, సంతకాలు చేసే అధికారిని కావాలనే నియమించుకుని అవినీతికి బీజం వేశారన్నారు. ఇందులో భాగంగానే అప్పడు విధులు నిర్వహిస్తున్న సూర్యతేజ ఐఏఎస్‌ను యుద్ధ ప్రాతిపదికన బదిలీ చేశారని పేర్కొన్నారు. 8 లక్షల మంది జనాబా కలిసిన కార్పోరేషన , మున్సిపల్ శాఖమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నగరంలో ఓ ఐఏఎస్‌ను అధికారిగా నియమించలేక పోవటం సిగ్గుచేటన్నారు. గత 19 నెలలుగా కార్పోరేషన్ ఇన్‌చార్జ్ అధికారి ఆధ్వర్యంలో ఉంటే రెగ్యులర్ అధికారిని నియమించాలన్న కనీస అవగాహన మంత్రి నారాయణకు లేదా అని ప్రశ్నించారు. ప్రస్తుతం కార్పోరేషన్‌లో జరుగుతున్న ప్రతి అవినీతి మంత్రి నారాయణ కనుసన్నల్లోనే జరుగుతుందన్నారు. అలాగే తెలుగుదేశం పార్టీ కార్యాలయం నిర్మానానికి కాలువ పోరంబోకును కాజేయాలని పదకం రచించారన్నారు. స్వాయనా కలెక్టర్ ఇరిగేషన్ అధికారులకు లెటర్ రాయటం విడ్డూరంగా ఉందన్నారు. అలాగే పన్నులకు కట్టలేదని ప్రజలను కోర్డుకు లాగటం సిగ్గుచేటన్నారు. గతంలో ఎన్నడూ ఇలా జరుగలేదన్నారు. ముక్కుపిండి వసూల్లు చేస్తున్న పన్నును దోచుకుతింటున్నారని ఆరోపించారు.

9-10Pg5.qxd:9-10Pg5.qxd 1/1/02 6:59 AM Page 1

సిఇసి జ్ఞానేశ్‌కు 42 మంది మాజీ జడ్జిల మద్దతు

న్యూఢిల్లీ, అక్టోబరు 8: ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ని వ్యతిరేకిస్తూ, సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షాలు, కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ), వామపక్ష విద్యార్థి సంఘాలు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో, జ్ఞానేష్ కుమార్‌కు భారీ మద్దతు లభించింది. 42 మంది మాజీ న్యాయమూర్తులు సీఈసీకి మద్దతుగా నిలిచారు. ఎన్నికల సంఘం, న్యాయవ్యవస్థ, ఇతర రాజ్యాంగ సంస్థలను బలహీనపరిచేలా నిరంతర ప్రచారం జరుగుతోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ఓట్ చోరీ ఆరోపణలు చేయడం, రాజ్యాంగ సంస్థలను దొంగలుగా, రాజకీయ సంస్థలను పదే పదే చిత్రీకరించడం ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తుందని మాజీ జడ్జిలు హెచ్చరించారు. సంస్థల్ని విమర్శించడం ప్రజాస్వామ్య హక్కు. కానీ కించపరచడం మాత్రం కాదు అని వారు లేఖలో పేర్కొన్నారు.సర్ ప్రక్రియను కూడా మాజీ న్యాయమూర్తులు సమర్థించారు. ఓటర్ల జాబితా మరింత స్వచ్ఛంగా, ఖచ్చితంగా రూపొందించేందుకు చట్టబద్ధంగా చేపట్టిన ప్రక్రియ అని అభివర్ణించారు. ఎన్నికల ప్రక్రియను, ఎన్నికల ఫలితాల విశ్వసనీయతను ప్రశ్నిస్తూ రాజ్యాంగ సంస్థలను పూర్తిగా అనుమానాస్పదంగా చూపించే ప్రయత్నాలు అశాంతికి దారి తీయొచ్చని వారు హెచ్చరించారు. ఇలాంటి పరిస్థితులు అరాచక శక్తులకు ఊతమిస్తాయని లేఖలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యానికి నమ్మకమే పునాది అని వారు వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రక్రియపై రాజకీయ పార్టీలకు అభ్యంతరాలు ఉంటే వాటిని రాజ్యాంగం, చట్టం కల్పించిన మార్గాల్లో పరిష్కరించుకోవాలని మాజీ న్యాయమూర్తులు సూచించారు. ఎన్నికల వివాదాలు న్యాయపరమైన ప్రక్రియ ద్వారా పరిష్కరించుకోవాలని, రాజ్యాంగ సంస్థలపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసేలా ఆరోపణలు చేయకూడదని హితవు పలికారు. మరోవైపు, దీనిది జ్ఞానేష్ కుమార్‌పై విపక్ష పార్టీలు తీవ్ర ఆరోపణలు చేస్తున్నాయి. సర్ పేరుతో భారీ సంఖ్యలో అర్హులైన ఓటర్లను తీసేశారని ఆరోపిస్తున్నాయి. 2025 నాటి ఓటర్ల జాబితానే కొనసాగించాలని, ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఓట్లను తొలగించడం వల్ల బీజేపీకి న్యాయం చేకూరుతోందని, సీఈసీ బీజేపీకి ప్రయోజనం చేకూరేలా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నాయి.సర్‌కు సంబంధించిన పలు నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత 10 నెలల్లో కనీసం 14 సందర్భాల్లో అభ్యంతరాలు వ్యక్తం చేశారనే మీడియా నివేదికలను ఆధారంగా చేసుకుని విపక్షాలు ఆందోళనలు చేస్తున్నాయి.

విద్యార్థుల ఆందోళనలతో అట్టుడుకుతున్న ఫ్రాన్స్

ప్యారిస్, అక్టోబరు 8: పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు, టీచర్ల నియామకం వంటి డిమాండ్లతో విద్యార్థులు చేపట్టిన నిరసనలతో ఫ్రాన్స్ దద్దరిల్లుతోంది. 15 నుంచి 18 ఏళ్లలోపు విద్యార్థులు వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేస్తుండటంతో దేశం అట్టుడుకుతోంది. సోషల్ మీడియా వేదికగా టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్‌ల ద్వారా వేగంగా వ్యాపించిన ఈ ఉద్యమం.. ఇప్పుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారింది. గత నెల 21న పారిస్ సమీపంలోని ఓ పాఠశాలలో టీచర్ల కొరతను నిరసిస్తూ ఉపాధ్యాయులు చేపట్టిన ధర్నాకు విద్యార్థులు మద్దతు పలకడంతో ఈ ఉద్యమం మొదలైంది. ప్రభుత్వం తాత్కాలికంగా ఆ స్కూల్‌కు కొత్త టీచర్లను పంపినా, దేశంలోని ఇతర లీసే (హైస్కూల్) పాఠశాలల్లోని విద్యార్థులు కూడా తమ సమస్యలపై గళం విప్పారు. పాఠశాలల్లో సరైన వసతులు లేకపోవడం, తరగతి గదుల్లో పరిమితికి మించి విద్యార్థులు ఉండటం, టీచర్ల వేతనాల్లో కోత విధించాలన్న ప్రభుత్వ ఆలోచన వంటివి విద్యార్థుల ఆగ్రహానికి ఆజ్యం పోశాయి. ప్రశాంతంగా మొదలైన ఆందోళనలను అణచివేసేందుకు పోలీసులు ప్రయత్నించడంతో పరిస్థితి హింసాత్మకంగా మారింది. విద్యార్థులపై భాష్పవాయువు, రబ్బరు బుల్లెట్లు ప్రయోగించడం, లాఠీఛార్జ్ చేయడంతో వారు మరింత రెచ్చిపోయారు. పలుచోట్ల పాఠశాల భవనాలకు నిప్పుపెట్టారు.

ఇప్పటివరకు సుమారు 100 పాఠశాలలు ధ్వంసం కాగా, పోలీసులు దాదాపు 6,000 మందిని అరెస్ట్ చేశారు. వీరిలో 87 శాతం విద్యార్థులేనని ప్రభుత్వం పేర్కొంది. పోలీసుల గ్రెనేడ్ దాడిలో ఓ విద్యార్థి చేయి కోల్పోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ ఉద్యమంలోకి క్రమంగా వామపక్ష పార్టీలు, కార్మిక సంఘాలు, రైతులు కూడా ప్రవేశించారు. ఇది విద్యార్థుల ఉద్యమం కాదని, ప్రతిపక్షాల రాజకీయ కుట్ర అని ప్రధాని సెబాస్టియన్ లీకార్ను ఆరోపించారు. మరోవైపు, ఈ హింసను అందరూ ఖండించాలని పిలుపునిస్తూనే, విద్యార్థుల డిమాండ్లను వినాలని అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది దేశంలో అధ్యక్ష ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ పరిణామాలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

సిఇసీ, ఎన్నికల కమిషనర్ల నియామకంపై విచారణకు పిటిషన్

న్యూఢిల్లీ, అక్టోబరు 8: కేంద్ర ఎన్నికల సంఘంలో సీఈసీతో పాటు కమిషనర్ల నియామకాల కోసం గతంలో ఉన్న కమిటీలో మార్పులు చేస్తూ కేంద్రం పార్లమెంట్ లో 2023లో ఓ చట్టం చేసింది. దీని ప్రకారం అప్పటివరకూ ఉన్న ఎన్నికల కమిషనర్ల నియామకాల కమిటీలో ప్రధాని, విపక్ష నేతతో పాటు ఉన్న సుప్రీంకోర్టు ఛీఫ్ జస్టిస్ ను కాదని, ఆ స్థానంలో ప్రధాని సిఫార్సు చేసే కేంద్రమంత్రిని చేర్చేలా ఈ చట్టంలో మార్పు చేశారు. దీని ఆధారంగా జరిగిన సీఈసీ జ్ఞానేష్ కుమార్, కమిషనర్లు సుఖ్ బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషీల నియామకాలు రద్దుచేయాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఓవైపు ఎస్ఐఆర్ పై ఎన్నికల సంఘంలో కమిషనర్ల మధ్య విభేదాల ఆరోపణలు, మరోవైపు 2023 నాటి ఎన్నికల కమిషనర్ల నియామక చట్టంలో మార్పుల వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో ఈ పిటిషన్ సుప్రీంకోర్టులో దాఖలైంది. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిల నియామకాలన్నింటినీ సవాలు చేస్తూ, వారికి వ్యతిరేకంగా కో వారంటో రిట్ జారీ చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. వారి నియామకాలు 2023 సీఈసీ, ఈసీల చట్టం కింద నిర్దేశించిన విధానాన్ని ఉల్లంఘించాయని పిటిషనర్ వాదిస్తున్నారు. హడావిడిగా చేసిన ఈ నియామకాలపై ఆందోళన వ్యక్తం చేస్తూ, ఎంపిక కమిటీ సభ్యులకు పూర్తి వివరాలను పంపిణీ చేసిన తర్వాత మాత్రమే నియామకాలు జరగాలని పేర్కొన్న సుప్రీంకోర్టు మార్చి 2024 ఉత్తర్వును పిటిషనర్ ప్రస్తావించారు. చట్టంలోని సెక్షన్ 6 ప్రకారం, ప్రతి ఖాళీకి 5 పేర్లతో కూడిన ప్యానెల్‌ను ఏర్పాటు చేయాల్సి ఉండగా, అలా చేయలేదని పిటిషనర్ వాదిస్తున్నారు. ఈ అధికారులలో ఎవరూ గతంలో ఎన్నికలకు సంబంధించిన పనులను నిర్వహించలేదని, అలాగే వారు సెక్షన్ 5 కింద అర్హతా ప్రమాణాలను అందుకోలేదని కూడా పిటిషనర్ వాదిస్తున్నారు. దీంతో ఎన్నికల కమిషనర్ల నియామకాల చట్టం రాజ్యాంగ బద్దతపై దాఖలైన పిటిషన్లపై విచారణ, తుది తీర్పును ఆలస్యం చేస్తున్న సుప్రీంకోర్టుకు ఇప్పుడు ఏదో ఒక నిర్ణయం తీసుకోక తప్పని పరిస్థితి ఎదురు కాబోతోంది.

జ్ఞానేశ్ తప్పుకోవలసిందే..

బెంగళూరులో సిజెపి మహాధర్నా

పాల్గొన్న ప్రకాష్‌రాజ్, అభిజిత్ దీప్కే ప్రభృతులు

బెంగళూరు, అక్టోబరు 8: ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల చోరీకి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా డిమాండ్ తో ఉద్యమిస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ నేతలు ఇవాళ బెంగళూరు ఫ్రీడమ్ పార్క్ లో మహాధర్నా చేపట్టారు. అక్టోబర్ 10న ఢిల్లీ వేదికగా జరిగే భారీ ధర్నాకు సన్నాహకంగా బెంగళూరులో వారు సమావేశమయ్యారు. ఈ ధర్నాకు నటుడు, సామాజిక కార్యకర్త ప్రకాష్ రాజ్ , ప్రముఖ యూట్యూబర్ ధ్రువ్ రాఠీ, సీజేపీ నేత అభిజీత్ దీప్కే సహా పలువురు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఓటర్ల జాబితాల సవరణ కార్యక్రమం సర్ ను రద్దు చేయాలని, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ పదవి నుంచి తప్పుకోవాలని కాక్రోచ్ పార్టీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బెంగళూరు ఫ్రీడమ్ పార్క్ లో ప్రజా ట్రైబ్యునల్ నిర్వహిస్తున్నారు. ఇవాళ ఉదయం నుంచే పలువురు కార్యకర్తలు, పౌర సమాజ సంస్థలు బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్‌కు తరలిరావడంతో జనసమూహం పెరగడం ప్రారంభమైంది. మధ్యాహ్నం సుమారు 1 గంటకు, సీజేపీ నాయకులు దీప్కే, సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా సభా ప్రాంగణానికి చేరుకుని, రాఠీ, ప్రకాష్ రాజ్‌లతో కలిసి వేదికపై చేతులు పైకెత్తారు. జనం మోడీ వ్యతిరేక నినాదాలు, ఓటు దొంగ, ఓటు దొంగ నినాదాలు చేశారు. ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా దేశం మొత్తాన్ని అవమానించిందని నటుడు ప్రకాష్ రాజ్ ఆరోపించారు. ఈ దేశంలో ప్రభుత్వాన్ని ఎవరు ఏర్పాటు చేయాలో ప్రజలే నిర్ణయించేవారని, కానీ ఎస్ఐఆర్ తో ఎవరు ఓటు వేయాలో ప్రభుత్వమే నిర్ణయిస్తోందన్నారు. 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో 13 కోట్లకు పైగా ప్రజలు ఎన్నికలలో పాల్గొనకుండా మినహాయింపునకు గురైన సర్ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అందుకే పౌరుల హక్కులను పునరుద్ధరించడానికే ఈ ఆందోళన చేస్తున్నట్లు ప్రకాష్ రాజ్ తెలిపారు. ఈ నిరసన యొక్క లక్ష్యం కేవలం సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించడం మాత్రమే కాదని, ఆయన వెళ్తే, ఆయన స్థానంలో మరొకరు వస్తారన్నారు. ఎస్ఐఆర్ ను రద్దు చేయించడమే తమ లక్ష్యమన్నారు.మరోవైపు ఫ్రీడమ్ పార్క్‌లో జరుగుతున్న సీజేపీ నిరసన కార్యక్రమంలో ఎస్ఐఆర్ సమయంలో ముసాయిదా జాబితాల నుండి పేర్లు తొలగించిన పలువురు పాల్గొన్నారు. వారు ఒకే చోట నివసిస్తున్నప్పటికీ, వారిని స్థానమార్పిడి చెందినవారు, గైర్హాజరుగా గుర్తించారని సీజేపీ ఆరోపించింది వాస్తవానికి, ఓటర్ల జాబితాల నుండి తొలగించబడిన ప్రజల అనుభవాలను వినడానికే ఈ ప్రజా న్యాయస్థానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బతికి ఉన్నవారిని చనిపోయినవారిగా ప్రకటిస్తున్నారని, ఇదే ప్రజాస్వామ్య మరణం అని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఆరోపించారు. తమను బొద్దింకలలా బతకాలని వారు కోరుకుంటున్నారు కాబట్టే బొద్దింకలని పిలుస్తున్నారని,, కానీ మనం బొద్దింకలాగే దృఢంగా ఉండాలన్నారు.

యుపిఐ ఎండిఆర్‌ఛార్జి వసూలు వాయిదా!

ముంబయి, అక్టోబరు 8: యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిగే భారీ విలువ గల లావాదేవీలపై ప్రతిపాదించిన రుసుము అమలును కొన్ని నెలల పాటు వాయిదా వేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. త్వరలో ప్రారంభం కానున్న పండగ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకునే అవకాశముందని తెలుస్తోంది. దీనిపై త్వరలోనే అధికారికంగా స్పష్టత వచ్చే అవకాశం ఉంది. రూ. 2,000 కంటే ఎక్కువ విలువైన మర్చంట్ యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం రుసుమును అక్టోబర్ 15 నుంచి అమలు చేయాలని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ప్రతిపాదించింది. ఈ గడువును వచ్చే ఏడాది జనవరి వరకు పొడిగించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ నిర్ణయం వల్ల పేమెంట్ కంపెనీలు తమ సాంకేతిక వ్యవస్థలను ఆధునీకీకరించుకోవడానికి సమయం దొరకడమే కాకుండా, పండగ సీజన్‌లో వ్యాపారులపై అదనపు ఛార్జీల భారం పడకుండా ఉంటుందని అంచనా. ఆరేళ్లకు పైగా ఎలాంటి రుసుము లేకుండా కొనసాగుతున్న యూపీఐ చెల్లింపులపై ఈ ఛార్జీలను ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే ఇది వినియోగదారులకు ప్రత్యక్షంగా వర్తించదు. ఇది వ్యాపారుల వైపు నుంచి చెల్లించాల్సి న ఇంటర్‌ఛేంజ్ రుసుము. ప్రస్తుతం దేశంలో 50 కోట్లకు పైగా యూపీఐ వినియోగదారులు ఉన్నారు. ఆగస్టు 2026 నెలలోనే యూపీఐ ద్వారా రూ. 29.82 లక్షల కోట్ల విలువైన 2,451 కోట్ల లావాదేవీలు జరిగాయంటే దీని ప్రాధాన్యం అర్థం చేసుకోవచ్చు. అక్టోబర్ 15 నుంచి ఛార్జీల అమలు మొదలుపెడితే, అది దసరా, దీపావళి వంటి పండగల సమయంలో వినియోగదారుల కొనుగోళ్లపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ కీలక సమయంలో రిటైల్ చెల్లింపులకు అంతరాయం కలగకుండా చూడాలనేది ప్రధాన ఉద్దేశం. అదే సమయంలో, ఈ అదనపు గడువులో పేమెంట్ కంపెనీలు తమ సాంకేతిక వ్యవస్థలను మెరుగుపరుచుకోవడానికి, ఛార్జీల భారాన్ని వినియోగదారులపై పడకుండా ఎలా సర్దుబాటు చేయాలో ప్రణాళిక రచించుకోవడానికి సమయం లభిస్తుంది.

తమిళనాట మళ్లీ రచ్చకెక్కిన భాషా వివాదం

చెన్నై, అక్టోబరు 8: తమిళనాడులో భాషా విధానంపై కొనసాగుతున్న రాజకీయ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు అందించే మందుల కవర్లపై తమిళం, ఇంగ్లిష్‌తో పాటు హిందీలోనూ మోతాదు, వినియోగానికి సంబంధించిన వివరాలు ముద్రించడంపై వివాదం చెలరేగింది. ఈ నేపథ్యంలో కోయంబత్తూరు, కరూర్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో మూడు భాషల్లో ముద్రించిన మందుల కవర్ల పంపిణీని నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. రాజకీయ విమర్శలు కరూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో పంపిణీ చేసిన మందుల కవర్ల ఫొటోలను డీఎంకే నేత టి.ఆర్.బి. రాజా సోషల్ మీడియాలో షేర్ చేయడంతో ఈ అంశం రాజకీయంగా మరింత వేడెక్కింది. తమిళనాడు ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలో మూడు భాషల విధానాన్ని రహస్యంగా అమలు చేస్తున్నారంటూ ఆయన ఆరోపించారు. తమిళనాడులో విద్య, ప్రభుత్వ పరిపాలనలో తమిళం, ఇంగ్లిష్‌కు ప్రాధాన్యం ఇచ్చే రెండు భాషల విధానం కొనసాగుతున్న నేపథ్యంలో మందుల కవర్లపై హిందీ ముద్రణపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. తన ఎక్స్ పోస్టులో, తమిళనాడు ఆసుపత్రుల్లోనూ మూడు భాషల విధానం అమలవుతున్నట్లు కనిపిస్తోందని, మొదట కరూర్‌లో, ఇప్పుడు కోయంబత్తూరులోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోందని రాజా పేర్కొన్నారు. అయితే ఆసుపత్రి అధికారులు ఈ కవర్లు ఇటీవలే తీసుకొచ్చినవి కావని స్పష్టం చేశారు. వివాదానికి కారణమైన మందుల కవర్లు గత 18 నెలలుగా ఉపయోగిస్తున్నవేనని తెలిపారు. చింతామణి కోఆపరేటివ్ సొసైటీ ద్వారా స్పాన్సర్ చేసిన కవర్లను మందుల పంపిణీ కోసం ఉపయోగిస్తున్నట్లు వెల్లడించారు.

దక్షిణకొరియా మానవతా సాయం మాకేమీ అక్కర్లేదు!

కిమ్‌సోదరి కిమ్‌యోజోంగ్ తిరస్కృతి

సియోల్, అక్టోబరు 8: దక్షిణ కొరియా ఇస్తామన్న మానవతా సాయాన్ని ఉత్తర కొరియా తిరస్కరించింది. ఇది తమ దేశానికి జరిగిన అవమానమని, రాజకీయ ప్రేరేపిత కవ్వింపు చర్య అని ఘాటుగా విమర్శించింది. ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ సోదరి, దేశంలో అత్యంత శక్తిమంతమైన నాయకురాలిగా భావించే కిమ్ యో జోంగ్ ఈ మేరకు అధికారిక మీడియా సంస్థ కేసీఎన్ఏ ద్వారా ఓ ప్రకటన విడుదల చేశారు. మానవతా కార్యక్రమంలో భాగంగా ప్యాంగ్యాంగ్‌లోని ఒక ఆసుపత్రికి అవసరమైన వైద్య పరికరాలను పంపాలని దక్షిణ కొరియా ప్రణాళిక సిద్ధం చేసింది. వ్యాధి నిర్ధారణ, శస్త్రచికిత్సలు, ఇతర చికిత్సలకు అవసరమైన 166 కేటగిరీలకు చెందిన 1,431 వైద్య వస్తువులను పంపేందుకు ఏర్పాట్లు చేసింది. దీనికోసం మే నెలలోనే ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి నుంచి ఆంక్షల మినహాయింపును కూడా పొందింది. ఈ సాయాన్ని కిమ్ యో జోంగ్ ఒక ప్రహసనం గా కొట్టిపారేశారు. ఇది మా దేశానికి అవమానం. మా జాతీయ చట్టాలను ఉల్లంఘించేలా రాజకీయంగా ప్రేరేపించిన కవ్వింపు చర్య. ఈ చర్య అత్యంత వికారమైనదని ఆమె తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గతంలో, సెప్టెంబర్ 21న జరిగిన మైన్ పేలుడు ఘటనలో ముగ్గురు దక్షిణ కొరియా సైనికులు గాయపడటానికి ఉత్తర కొరియానే కారణమని సియోల్ తేల్చడాన్ని కూడా ఆమె విమర్శించారు. "మైన్ పేలుడు అనే నాటకం ఫ్లాప్ అవ్వడంతో, ఇప్పుడు వైద్య పరికరాల సహాయం అనే మరో నాటకానికి తెరలేపారని ఎద్దేవా చేశారు. దక్షిణ కొరియాతో చర్చలు జరిపే ఉద్దేశం తమకు ఏమాత్రం లేదని ఆమె స్పష్టం చేశారు. రిపబ్లిక్ ఆఫ్ కొరియాతో మేం ఇచ్చిపుచ్చుకునేది ఏమీ లేదు. వారితో ముఖాముఖి భేటీ కావాల్సి న అవసరం కూడా లేదని ఆమె స్పష్టం చేశారు. ఇరు దేశాల మధ్య సంబంధాలు పూర్తిగా క్షీణించిన నేపథ్యంలో ఈ సాయాన్ని ఉత్తర కొరియా స్వీకరిస్తుందా? అనే అనుమానాలు ముందు నుంచే ఉన్నాయి. తాజాగా ఉత్తర కొరియా తిరస్కరించడంతో, ఈ సాయాన్ని పంపే అవకాశాలు చాలా తక్కువని, ఐక్యరాజ్యసమితిని గడువు పొడిగింపు కోరతామని దక్షిణ కొరియా అధికారి ఒకరు తెలిపారు.

నానాపాటేకర్ మృతికి పలువురి సంతాపం

ముంబయి,అక్టోబరు 8: భారతీయ చిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. తన విలక్షణ నటనతో దశాబ్దాల పాటు ప్రేక్షకులను అలరించిన దిగ్గజ నటుడు నానా పటేకర్ ఆకస్మికంగా కన్నుమూశారు. గోవాలోని తన నివాసంలో గుండెపోటు రావడంతో ఆయన తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ వార్త తెలియగానే బాలీవుడ్ సహా యావత్ భారత సినీ రంగం దిగ్భ్రాంతికి గురైంది. నానా పటేకర్ మృతి పట్ల పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, నానా పటేకర్ మృతిపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనకు సోషల్ మీడియా వేదికగా భావోద్వేగ నివాళి అర్పించారు. నటనలో కొత్త ఒరవడి సృష్టించిన కళాకారుడు. స్ఫూర్తిదాయకమైన నటుడు. మట్టి వాసన తెలిసిన సహజ నటుడు.ఎంతో ఉత్సాహభరితంగా, అదే సమయంలో కవితాత్మకంగా ఉండగలరు. భారతీయ సినిమాలో ఆయనొక అరుదైన ఆణిముత్యం. ఆయన నటన ఎప్పటికీ స్ఫూర్తినిస్తూనే ఉంటుంది. ఆయన నైపుణ్యం చిరకాలం గుర్తుండిపోతుంది. ఆయన కుటుంబ సభ్యులకు, ఆప్తులకు నా ప్రేమ, ప్రగాఢ సానుభూతి. ఓం శాంతి" అని అల్లు అర్జున్ తన పోస్టులో పేర్కొన్నారు. సంభాషణలు చెప్పడంలో తనదైన ప్రత్యేక శైలి, ఎలాంటి పాత్రలోనైనా జీవించే అద్భుతమైన నటనతో నానా పటేకర్ కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు.

వారెవ్వా.. మోరుమియా!

బంగ్లా బిచ్చగాడికి 21 మంది భార్యలు

ఢాకా, అక్టోబరు 8: ప్రస్తుత కాలంలో పెళ్లికాని ప్రసాద్‌లు పెరిగిపోతున్నారు. కారణాలేంటో తెలియదు గానీ బ్యాచ్‌లర్స్ ఎక్కువైపోతున్నారు. కర్ణాటకలో అయితే ఓ రైతు పెళ్లి కావడం లేదని ముఖ్యమంత్రి డీకే.శివకుమార్ సమక్షంలోనే మొరపెట్టుకున్నాడు. అలాంటిది ఓ బిచ్చగాడు ఒక్కరు కాదు ఇద్దరు కాదు ఏకంగా 21 మందిని పెళ్లి చేసుకున్నాడు. ఇదెలా సాధ్యమైంది ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారిన ఈ స్టోరీ ఏంటో చదివేయండి. బంగ్లాదేశ్‌కు చెందిన మోరు మియా(35) అనే యువకుడు బిచ్చగాడు. ఓ పూరి గుడిసెలో ఉంటూ భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడు. అలాంటి వ్యక్తిని ఒక్కరు కాదు ఇద్దరు కాదు ఏకంగా 21 మంది మహిళలు పెళ్లి చేసుకున్నారు. ప్రస్తుతం ఈ వార్త సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. కనీసం భార్యల పేర్లు కూడా చెప్పలేని బిచ్చగాడిని అంత మంది ఎలా పెళ్లి చేసుకున్నారని నెటిజన్లను ఆశ్చర్యానికి గురవుతున్నారు. మోరు మియా బంగ్లాదేశ్ మీడియాతో మాట్లాడుతూ తాను ఎవరినీ పెళ్లి చేసుకోవాలని స్వయంగా కోరుకోలేదని చెప్పాడు. తనను పెళ్లి చేసుకోవాలంటూ మహిళలే తన దగ్గరకు వచ్చేవారని తెలిపాడు. ముఖ్యంగా తన కంటే వయసులో పెద్దవాళ్లు కూడా పెళ్లి ప్రతిపాదనలు చేసేవారని చెప్పాడు. తనను చూసి మహిళలకు ఏం నచ్చుతుందో తనకు తెలియదని వాపోయాడు.నాలో వాళ్లకు ఏం కనిపిస్తుందో నాకు తెలియదు. దానికి వాళ్లే సమాధానం చెప్పాలి. మహిళలే నా దగ్గరకు వచ్చి పెళ్లి చేసుకుందామని అడుగుతారని మీడియాతో చెప్పినట్లు కథనాలు పేర్కొన్నాయి.

పెళ్లిలో విందు ఇస్తే లక్ష రూపాయలు జరిమానా

విందుకు వచ్చినవారికి రూ.50వేలు ఫైన్

కర్ణాటకలో ఒక గ్రామం నిర్ణయం - నెట్టింట వైరల్

శివమొగ్గ, అక్టోబరు 8: అప్పుల ఊబిలో కూరుకు పోవడానికి కారణ మవుతున్న అనవసరపు ఖర్చులకు అడ్డుకట్ట వేసేందుకు ఓ గ్రామం తీసుకున్న నిర్ణయం అందరి ప్రశంసలు అందు కుంటోంది. పెళ్లి తర్వాత ఇచ్చే ఖరీదైన మాంసాహార విందును పూర్తిగా నిషేధిస్తూ గ్రామస్థులంతా ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ నిబంధనను ఉల్లంఘించి విందు ఏర్పాటు చేస్తే ఏకంగా లక్ష రూపాయలు, ఆ విందుకు హాజరైన వారికి 50 వేల రూపాయల జరిమానా విధించనున్నట్లు ప్రకటించారు. కర్ణాటకలోని శివమొగ్గ జిల్లా, శికారిపుర తాలూకా పరిధిలోని హారగి గ్రామంలో ఈ వినూత్న నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలోని సుమారు 360 కుటుంబాలు స్థానిక ఆంజనేయ స్వామి ఆలయం వద్ద సమావేశమై ఈ కఠిన నిర్ణయాన్ని ఆమోదించాయి. దీని వెనుక బలమైన కారణాలను గ్రామస్తుడు కేబీ శేఖరాజ్ వివరించారు. గ్రామంలో తీవ్రమైన కరవు నెలకొంది. వరుసగా పంటలు నష్టపోవడంతో రైతులు, ఇతర కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లోనూ పెళ్లి తర్వాత బీగర ఊట ఇవ్వడం సామాజిక గౌరవంగా మారింది. స్థోమత లేని వారు కూడా అప్పులు చేసి మరీ ఈ విందులు ఏర్పాటు చేయాల్సి వస్తోంది. దీంతో చాలా కుటుంబాలు రుణాల భారంతో కుంగిపోతున్నాయని ఆయన తెలిపారు. ఈ సమస్యకు పరిష్కారంగానే గ్రామస్థులందరూ కలిసి ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే, పెళ్లి తంతు, ఇతర మతపరమైన కార్యక్రమాలను యథావిధిగా జరుపుకోవచ్చని స్పష్టం చేశారు. కేవలం దగ్గరి బంధువులు, కుటుంబ సభ్యులతో (1020 మంది) సాధారణ భోజనాలు చేసుకోవడానికి ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపారు. గ్రామం మొత్తాన్ని పిలిచి భారీ ఎత్తున విందులు ఇవ్వడంపైనే నిషేధం ఉంటుందని తేల్చిచెప్పారు. కర్ణాటకలోని పాత మైసూరు, మల్నాడ్ ప్రాంతాల్లో బీగర ఊట అనేది ఒక సంప్రదాయం. కాలక్రమేణా ఇది హోదా ప్రదర్శనగా మారడంతో, హారగి గ్రామస్థులు తీసుకున్న ఈ నిర్ణయం చర్చనీయాంశంగా మారింది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా ఈ నిర్ణయాన్ని మెచ్చుకుంటూ, ఇలాంటి ఆర్థిక క్రమశిక్షణ పాటించడం అవసరమని అభిప్రాయపడుతున్నారు.

అమెరికాలో విదేశీ విద్యార్థులకు ఫీజు భారం!

వాషింగ్టన్, అక్టోబరు 8: అమెరికాలో చదువుకునే విదేశీ విద్యార్థులకు భారీ ఫీజు భారం పడే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. చదువు పూర్తయ్యాక అమెరికాలో ఉద్యోగ అనుభవం పొందేందుకు ఉన్న ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ) కార్యక్రమంలో తొలిసారి పాల్గొనే విద్యార్థులకు 70 వేల డాలర్ల ఫీజు విధించాలని అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం (డీహెచ్ఎస్) ప్రతిపాదించింది. తర్వాత మరోసారి ఓపీటీలో పాల్గొనే వారికి 30 వేల డాలర్ల ఫీజు విధించాలని సూచించింది. అయితే ఇవి కేవలం ప్రతిపాదనలు మాత్రమే. ప్రస్తుతం అమల్లోకి రాలేదు. అక్టోబర్ 8 నుంచి నవంబర్ 9 వరకు దీనిపై ప్రజల నుంచి అభిప్రాయాలను డీహెచ్ఎస్ స్వీకరించనుంది. ఎఫ్1 వీసాపై అమెరికాలో చదివే అర్హత కలిగిన విదేశీ విద్యార్థులకు చదువుకు సంబంధించిన ఉద్యోగం చేసేందుకు ఓపీటీ అవకాశం కల్పిస్తుంది. ముఖ్యంగా సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితం (స్టెమ్) రంగాల్లో చదివే విద్యార్థులకు ఇది ఎంతో కీలకం. ప్రతిపాదిత విధానం ప్రకారం విద్యార్థి ఓపీటీకి దరఖాస్తు చేయడానికి ముందే సంబంధిత విద్యాసంస్థ ఫీజును చెల్లించాలి. విద్యాసంస్థ చెల్లింపు చేయకపోతే ఉద్యోగం చేసుకునేందుకు అమెరికా పౌరసత్వం, వలస సేవల విభాగం (యూఎస్‌సీఐఎస్) అనుమతిని మంజూరు చేయదు. వలస వ్యవస్థలో మోసాలు, దుర్వినియోగాన్ని అరికట్టేందుకుమార్పులు ప్రతిపాదించారు.

సంక్షిప్త వార్తలు

సౌదీ అరేబియాపై హౌతీల దాడులను ఖండించిన భారత్

అబుదాబి, అక్టోబరు 8: సౌదీ అరేబియా లక్ష్యంగా యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటు దారులు దాడులకు పాల్పడుతున్నారు. ఇటీవల సౌదీ రాజధాని రియాద్‌తో పాటు ఆభా నగరంలోని విమానాశ్రయాలపై డ్రోన్లు, క్షిపణులు ప్రయోగించి ప్రాణ నష్టం కలిగించారు. ఈ దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. పౌర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకోవడం ఎంతమాత్రం ఆయోదయోగ్యం కాదని స్పష్టం చేసింది.

'రియాద్‌లోని కింగ్ ఖలీద్ అంతర్జాతీయ విమానా శ్రయంతోపాటు అభాలోని ఎయిర్ పోర్టుపై జరిగిన దాడులను ఖండిస్తున్నామని పేర్కొంది.

ఎనిమిది యుద్ధాలు పరిష్కరించా: ట్రంప్



వాషింగ్టన్, అక్టోబరు 8: నేనేమీ డబ్బా కొట్టుకోవట్లేదు. నిజాలే చెప్తున్నాను. ఇప్పటివరకు ఏకంగా ఎనిమిది యుద్ధాలను పరిష్కరించానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి హాట్ కామెంట్స్ చేశారు. నోబెల్ శాంతి బహుమతి (నోబెల్ పీస్ ప్రైజ్)కి అసలైన అర్హుడిని తానేనంటూ ఆయన మళ్ళీ డిమాండ్ తెరపైకి తెచ్చారు. వైట్ హౌస్ వేదికగా మాట్లాడిన ఆయన, ఏ ప్రెసిడెంట్ కూడా సాధించని రికార్డును తాను సాధించానని చెప్పారు. ఎనిమిది యుద్ధాలను శాంతియుతంగా ముగించానని చెప్పుకొచ్చిన ట్రంప్, త్వరలోనే మరో పెద్ద విజయం కూడా తన ఖాతాలో పడబోతోందని హింట్ ఇచ్చారు.

పాక్‌కు ఐఎంఎఫ్ 1.21 బిలియన్ డాలర్ల సాయం

ఇస్లామాబాద్, అక్టోబరు 8: ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న పాకిస్థాన్‌కు అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) నుంచి భారీ ఊరట లభించింది. ఆ దేశానికి అదనంగా 1.21 బిలియన్ డాలర్ల నిధులు అందించేందుకు ఐఎంఎఫ్ సిబ్బంది స్థాయి ఒప్పందానికి వచ్చారు. అయితే ఈ నిధుల విడుదలకు ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ బోర్డు ఆమోదం అవసరం. ఈ ఒప్పందంలో పాకిస్థాన్ 37 నెలల ఎక్స్‌టెండెడ్ ఫండ్ ఫెసిలిటీ కార్యక్రమంలో నాలుగో సమీక్ష, 28 నెలల రెసిలియన్స్ అండ్ సస్టెయినబిలిటీ ఫెసిలిటీలో మూడో సమీక్ష ఉన్నాయి. బోర్డు ఆమోదం తర్వాత ఈఎఫ్ఎఫ్ కింద సుమారు 1 బిలియన్ డాలర్లు, ఆర్ఎస్ఎఫ్ కింద మరో 210 మిలియన్ డాలర్లు అందనున్నాయి.

నాపైనా స్టింగ్ ఆపరేషన్లు జరిగాయి: కర్ణాటక సిఎం డికె



బెంగళూరు, అక్టోబరు 8: కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సంచలన ఆరోపణలు చేశారు. తాను సీఎం అయిన తర్వాత తనను స్టింగ్ ఆపరేషన్‌లో ఇరికించేందుకు ప్రయత్నం జరిగిందని చెప్పారు. దీనికి సంబంధించిన ఫొటోలు, పత్రాలు తన వద్ద ఉన్నాయని తెలిపారు. ఈ వ్యవహారం వెనుక ఎవరున్నారో తనకు తెలుసని అన్నారు. ఢిల్లీలో గురువారం మీడియాతో మాట్లాడిన శివకుమార్ ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన తర్వాత కొందరు వ్యక్తులు తనను కలిశారని చెప్పారు. వారెవరో, ఎవరి కోసం వచ్చారో తనకు తెలుసన్నారు. నన్ను ఇరికించేందుకు ప్రయత్నం చేశారు. నా వద్ద ఫొటోలు ఉన్నాయి. ఈ స్టింగ్ ఆపరేషన్ల వెనుక ఉన్న వ్యక్తి ఎవరో నాకు తెలుసు అని పేర్కొన్నారు.

9-10Pg6exHMNWJQE.qxd:9-10Pg6exHMNWJQE.qxd 1/1/02 7:01 AM Page 1

రాయచోటికి శాశ్వత తాగునీటి భరోసా

రూ.2,370 కోట్ల సమగ్ర ప్రాజెక్టు

• నిలిచిపోయిన పనుల పునరుద్ధరణకు మరో రూ.28.78 కోట్లు

• 887 ఆవాసాలు, 2.24 లక్షల మందికి ప్రయోజనం: మంత్రి రాంప్రసాద్ రెడ్డి

రాయచోటి, అక్టోబరు 8 ప్రభాతవార్త: రాయచోటి నియోజకవర్గ ప్రజలకు శాశ్వత తాగునీటి భరోసా కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోందని రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. రాయచోటి ప్రాంతంలో తాగునీటి మౌలిక వసతులను సమూలంగా బలోపేతం చేసేందుకు ఒకవైపు రూ.2,370 కోట్ల అంచనా వ్యయంతో సమగ్ర తాగునీటి సరఫరా ప్రాజెక్టు పనులు కొనసాగుతుండగా, మరోవైపు జల్ జీవన్ మిషన్ 2.0లో రూ.28.78 కోట్లతో 49తాగునీటి పథకాలను పునరుద్ధరిస్తున్నామని ఆయన వెల్లడించారు. ఈ రెండు కార్యక్రమాల ద్వారా రాయచోటి నియోజకవర్గంలోని వందలాది ఆవాసాలకు, లక్షలాది మంది ప్రజలకు తాగునీటి సౌకర్యం మరింత మెరుగుపడనుంది. ప్రతి ఇంటికీ కుళాయి నీరు అందించడంతో పాటు, భవిష్యత్ తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని శాశ్వత తాగునీటి మౌలిక వసతులను కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. రూ.2,370 కోట్లతో భారీ తాగునీటి ప్రాజెక్టుజల్ జీవన్ మిషన్‌లో భాగంగా చేపడుతున్న పశ్చిమ చిత్తూరు ప్రాంత సమగ్ర తాగునీటి సరఫరా ప్రాజెక్టులో రాయచోటి సెగ్మెంట్‌కు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించారు. రాయచోటి సెగ్మెంట్ ఫేజ్-IIలో 6 మండలాల పరిధిలోని 887 ఆవాసాలకు తాగునీటి సదుపాయం కల్పించనున్నారు. 2027 నాటికి సుమారు 2.24 లక్షల జనాభాకు, 2057 నాటికి 2.64 లక్షల జనాభాకు తాగునీటి అవసరాలను తీర్చేలా ప్రాజెక్టును రూపొందించారు. మొత్తం 37,781 కుటుంబాలకు తాగునీటి సౌకర్యం కల్పించేలా ప్రణాళిక రూపొందించారు. వెలిగల్లు జలాశయం నుంచి 0.327 టీఎంసీల నీటిని తీసుకుని, 26 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన నీటి శుద్ధి కేంద్రం ద్వారా శుద్ధి చేసి ప్రజలకు సరఫరా చేయనున్నారు. ఇందులో భాగంగా ఇంటెక్ వెల్, క్లియర్ వాటర్ సంపులు, ఓహెచ్‌బిఆర్‌లు, బిబిటిలు, ఓహెచ్‌ఎస్ఆర్‌లు, ట్రాన్స్ మిషన్, డిస్ట్రిబ్యూషన్ పైప్‌లైన్లను ఏర్పాటు చేస్తున్నారు.

పనులు వేగంగా.. 156.73 కిలోమీటర్ల పైప్‌లైన్ పూర్తి: రూ.2,370 కోట్ల అంచనా వ్యయం కలిగిన ఈ ప్రాజెక్టుకు రూ.1,939.42 కోట్ల ఒప్పంద విలువ ఉంది. 2025 ఏప్రిల్ 7న ఒప్పందం కుదరగా, 2027 అక్టోబర్ 6 నాటికి ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మొత్తం 563 నిర్మాణాల్లో 33పూర్తికాగా, 193 నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయి. పైప్‌లైన్ పనుల్లో భాగంగా 4,05,110 మీటర్లకు ఆమోదం లభించగా, 2,66,508 మీటర్ల పైప్‌లైన్ సేకరణ పూర్తయింది. ఇప్పటివరకు 1,56,726 మీటర్ల పైప్‌లైన్ పనులు పూర్తయ్యాయి.

49 పథకాలతో నిలిచిపోయిన పనులకు పునరుజ్జీవం: గతంలో నిలిచిపోయిన తాగునీటి పనులను పునః ప్రారంభించేందుకు ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ 2.0లో ప్రత్యేక చర్యలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 13,252 తాగునీటి పనులను రూ.4,053.85 కోట్లతో పునరుద్ధరించేందుకు ఆమోదం లభించగా, నియోజకవర్గంలో 34గ్రామాల్లో 49 ఐఎంఐఎస్ తాగునీటి పథకాలను పునరుద్ధరిస్తున్నారు. ఈ పనులకు మొత్తం రూ.28.78 కోట్ల అంచనా వ్యయం కాగా, 499 ఆవాసాలకు ప్రయోజనం చేకూరనుంది. రాయచోటి మండలంలో రూ.3.51 కోట్లతో 16 పథకాలు, రామాపురంలో రూ.1.52 కోట్లతో 14 పథకాలు, సంబేపల్లిలో రూ.23.13 కోట్లతో 6 పథకాలు, చిన్నమండెంలో రూ.5.01 లక్షలతో 5 పథకాలు, గాలివీడులో రూ.50.89 లక్షలతో 6 పథకాలు, లక్కిరెడ్డిపల్లిలో రూ.7.03 లక్షలతో 2 పథకాలను చేపడుతున్నారు.

నీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం: రాయచోటి నియోజకవర్గంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడమే తన ప్రధాన లక్ష్యాల్లో ఒకటని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. రాయచోటి నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి నీరు.. ప్రతి ఆవాసానికి కుళాయి.. ప్రతి కుటుంబానికి సురక్షితమైన తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ సంకల్పం. గతంలో నిలిచిపోయిన పనులను పునరుద్ధరించడంతో పాటు, భవిష్యత్ అవసరాలను తీర్చేలా భారీ సమగ్ర తాగునీటి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తున్నాం. పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు పూర్తి స్థాయిలో తాగునీటి సౌకర్యాన్ని అందిస్తాం అని మంత్రి స్పష్టం చేశారు. రాయచోటి ప్రజల చిరకాల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా జల్ జీవన్ మిషన్ ద్వారా చేపడుతున్న ఈ కార్యక్రమాలు చరిత్రలో కీలక మైలురాళ్లుగా నిలుస్తాయని మంత్రి పేర్కొన్నారు.

పార్టీ కోసం కష్టపడినోళ్లకే స్థానిక ఎన్నికల్లో ప్రాధాన్యత

• టిడిపి జిల్లా పరిశీలకులు నూకసాని బాలాజీ

శ్రీకాళహస్తి, అక్టోబరు 8 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ కోసం కష్టకాలంలో చెమటోడ్చి పని చేసిన వారి సేవలను మరువదని రాబోయే స్థానిక ఎన్నికల్లో వారికే పెద్దపీట అని గురువారం రాత్రి జరిగిన నియోజకవర్గ సమీక్షా సమావేశంలో వక్తలు స్పష్టం చేశారు. పట్టణంలోని ఎన్‌టిఆర్ ట్రస్ట్ భవనంలో జరిగిన సమావేశానికి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అధ్యక్షత వహించగా పార్లమెంటు అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, పార్టీ జిల్లా పరిశీలకులు నూకసాని బాలాజీ హాజరయ్యారు. ఈ సమావేశంలో పనబాక లక్ష్మీ మాట్లాడుతూ పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో పార్టీని బలోపేతం చేసుకుంటూ అన్ని స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పని చేస్తున్నామని అన్నారు. క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన కార్యకర్తలే పార్టీకి అసలైన ఆస్తి అన్నారు. వారి శ్రమ ఆధారంగానే భవిష్యత్తులో రాజకీయ అవకాశాలు దక్కుతాయని ప్రకటించారు. స్థానిక ఎన్నికల్లో ప్రతి కార్యకర్తలందరూ ఐక్యంగా పనిచేసి పార్టీ జెండాను ఎగురవేయాలని పిలుపు నిచ్చారు. జిల్లా ఇన్‌ఛార్జ్, ఏపి టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ పార్టీ యంత్రాంగం కార్యకర్తల సమన్వయంతో రాబోయే స్థానిక ఎన్నికల్లో విజయానికి మార్గదర్శకులని బాలాజీ అన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీకి అహర్నిశలు సేవ చేసిన వారికే ఎన్నికల్లో ప్రాధాన్యత ఉంటుందని ప్రతి ఒక్కరి పనితీరును పార్టీ గమనిస్తుందన్నారు. నాయకులు కార్యకర్తలు కలసికట్టుగా రాబోయే ఎన్నికలకు సమాయత్తం కావాలని సూచించారు. శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహాలు, పార్టీ బలోపేతం నాయకులు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పార్టీ కోసం కష్టపడిన చేసిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కార్యకర్తల త్యాగాలు, శ్రమ ఎన్నటికీ వృధా పోవని చెప్పారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో స్థానిక నాయకులకే మొదటి ప్రాధాన్యత ఇస్తామన్నారు. టిడిపి పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్ నాయుడు, మునిరాజా నాయుడు, నాగరాజు నాయుడు పాల్గొన్నారు.

ప్రభుత్వ సమాచారాన్ని వేగంగా ప్రజలకు చేరవేసేందుకు

నూతన డిజిటల్ యాప్

• సమీకృత మొబైల్, వెబ్ అప్లికేషన్‌ను ప్రారంభించిన మంత్రి కొలుసు పార్థసారధి

విజయవాడ, అక్టోబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు మరింత వేగంగా, పారదర్శకంగా అందించేందుకు రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ రూపొందించిన సమీకృత మొబైల్, వెబ్ అప్లికేషన్‌ను ఆ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి గురువారం విజయవాడలోని తన కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో ప్రజలు సమాచారాన్ని స్వీకరించే విధానంలో గణనీయమైన మార్పులు వచ్చాయని అన్నారు. ప్రజలకు ప్రభుత్వ సమాచారాన్ని వేగంగా, డిజిటల్, వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా అందించాలనే లక్ష్యంతో ఈ యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించిన ప్రామాణిక సమాచారాన్ని అత్యంత వేగంగా ప్రజలకు చేరవేయడంలో ఈ యాప్ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ప్రభుత్వం, మీడియా, ప్రజల మధ్య మరింత బలమైన డిజిటల్ వారధిగా ఈ యాప్ పనిచేస్తుందని పేర్కొన్నారు. యాప్ రూపకల్పన, వినియోగంలోకి తీసుకురావడానికి కృషి చేసిన శాఖ సంచాలకులు కె. విశ్వనాథన్ ను ప్రత్యేకంగా అభినందించారు.

నూతన యాప్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కొలసు పార్థసారధి, చిత్రంలో సమాచార శాఖ సంచాలకులు కె.విశ్వనాథన్, చీఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్ మధుసూదన్, టి.నాగరాజు, దున్న రమేష్, రాణి సుస్మిత, గల్లా శేషు

అంతేకాకుండా యాప్ రూపకల్పనలో భాగస్వాములైన సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులు, సాంకేతిక బృందాన్ని కూడా మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ ఓ. మధుసూదన్, రీజనల్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ టి. నాగరాజు, మీడియా రిలేషన్స్ విభాగం ఉప సంచాలకులు దున్న రమేష్, డిజిటల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. రాణి సుస్మిత, ప్రత్యేక అధికారి గల్లా శేషు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణహిత ఖనిజాన్వేషణకు ప్రాధాన్యం

• ఖనిజ వనరులను డిజిటల్ విధానంలో మ్యాపింగ్ • రూ.21 కోట్లను వివిధ ఖనిజ అన్వేషణకు వ్యయం • ఎన్ఎంఇటి గ్రాంట్ల ద్వారా మెరిట్ ట్రస్ట్‌కు రూ.177.05 కోట్లు ఆదాయం • మెరిట్ గవర్నింగ్ బాడీ రెండో సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర

విజయవాడ, అక్టోబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌లో ఖనిజ వనరుల అన్వేషణ, అభివృద్ధిని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అధికారులను ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూనే రాష్ట్రంలో ఉన్న ఖనిజ సంపదను పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. సచివాలయంలోని మంత్రి కార్యా లయంలో మెరిట్ (మినరల్ ఎక్స్ప్లోరేషన్ రిసెర్చ్ ఇన్నోవేషన్ ట్రస్టు) గవర్నింగ్ బాడీ రెండో సమావేశం జరిగింది. రాష్ట్రంలో ఖనిజ అను మతుల ప్రక్రియను సులభతరం చేయడంతో పాటు, కొత్త ఖనిజ నిల్వలను గుర్తించడం, ఆధునిక సాంకేతికతను వినియోగించడం వంటి అంశాలపై సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఖనిజ వనరులను డిజిటల్ విధానంలో మ్యాపింగ్ చేసి, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అన్వేషణను చేపట్టాలని మంత్రి సూచించారు. మైనర్ మినరల్ లీజుదారుల నుంచి వచ్చే సీనరేజి రుసుములో 2 శాతం విరాళం, కేంద్ర ఎన్ఎంఇటి గ్రాంట్ల ద్వారా ఇప్పటివరకు మెరిట్ ట్రస్ట్‌కు రూ.177.05 కోట్ల ఆదాయం సమకూరింది.

మెరిట్ గవర్నింగ్ బాడీ రెండో సమావేశంలో మంత్రి రవీంద్ర

ఇందులో రూ.21 కోట్లను వివిధ ఖనిజ అన్వేషణ పనులకు ఖర్చు చేశారు. ప్రస్తుతం ట్రస్ట్ వద్ద రూ.156.05 కోట్ల నిధులు అందుబాటులో ఉన్నాయని అధికారులు సమావేశంలో వివరించారు. దేశంలోనే తొలిసారిగా ప్రి-ఎంబెడెడ్ క్లియరెన్స్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

తిరుమల సమాచారం

శ్రీవారికి బంగారు పగడాల హారాలు

తిరుమల, అక్టోబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి: ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి భక్తులు తమ భక్తిపూర్వకంగా పలు రకాల కానుకలు విరాళ రూపంలో అందిస్తున్నారు. ఇలా దాతలు తమ ఇష్టదైవానికి రోజువారీగా విరాళాలందిస్తుండటం విదితమే. తాజాగా గురువారం ఉదయం తెలంగాణ హైదరాబాద్‌కు చెందిన కమల శ్రీవారికి దాదాపు రూ.25 లక్షలు విలువైన రెండు బంగారు పగడాల హారాలు విరాళంగా అందించారు. దాత తన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టిటిడి అదనపు ఇఒ సి.హెచ్.వెంకయ్య చౌదరికి హారాలను అందజేశారు. ఆలయ డిప్యూటీ ఇఒ భాస్కర్ కూడా పాల్గొన్నారు. అనంతరం దాతకు శ్రీవారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

టిటిడి ట్రస్ట్‌లకు రూ.20 లక్షలు విరాళం

తిరుమల, అక్టోబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి: ధార్మికసంస్థ టిటిడి నిర్వహిస్తున్న పలు పథకాలు, ట్రస్ట్‌లకు దాతలు తమవంతుగా విరాళాలందిస్తున్నారు. గురువారం ఉదయం తెలంగాణ హైదరాబాద్‌కు చెందిన కొడాలి మారుతి శేషతల్ప సాయి టిటిడి బర్డ్ ట్రస్టుకు రూ.10,00,116లు విరాళంగా అందించారు. అలాగే అమెరికాకు చెందిన ఎన్‌ఆర్ఐ నల్లపాటి గిరిధర్ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.10,00,116లు విరాళమిచ్చారు. దాతలు శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టిటిడి అదనపు ఇఒ సి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం డిడిలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు నన్నపనేని సదాశివరావు, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఇఒ భాస్కర్ పాల్గొన్నారు.

టిటిడి గోశాల మావటి చంద్రశేఖర్ మృతి

తిరుపతి, అక్టోబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో శ్రీనిధి ఏనుగు దాడిలో తీవ్రంగా గాయపడిన మావటి చంద్రశేఖర్‌రెడ్డి (చంద్రయ్య) చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఈనెల 4వ తేదీ ఆదివారం సాయంత్రం అమ్మవారి ఆలయ వేడుకల్లో పాల్గొన్న శ్రీనిధి ఏనుగు గోశాలకు తరలిస్తుండగా టిటిడి గోశాల మావటి చంద్రయ్యపై ఆస్థాన ఏనుగు తొండంతో దాడి చేసి తొక్కేసిన ఘటన విదితమే. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతను స్విమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. హార్మోన్ల మార్పుల కారణంగా ఏనుగులో దూకుడు పెరిగిందని వెటర్నరీ డాక్టర్లు, టిటిడి అధికారులు నిర్ధారించారు. తీవ్ర గాయాలపాలైన చంద్రయ్య చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. ఈ ఘటన కలకలం రేపిన విషయం విదితమే.

రోజుకు 3 లక్షల మంది భక్తులకు

అన్నప్రసాదం

•15.8 టన్నుల బియ్యంతో నిత్యం మహాయజ్ఞంలా కొనసాగుతున్న అన్నప్రసాద సేవ

తిరుమల, అక్టోబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమలలో ఆకలితో ఉన్న భక్తుడికి అన్నం అందించడమే లక్ష్యంగా టిటిడి అన్నప్రసాదం విభాగం 24గంటలూ నిరంతరంగా పనిచేస్తోంది. సాధారణ రోజుల్లో సుమారు 1.80 లక్షల నుండి 1.90 లక్షల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరిస్తుండగా, రద్దీ రోజులు, వారాంతాల్లో ఈ సంఖ్య 3 లక్షలకు మించుతోంది. పానీయాలు, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం కలిపి రోజుకు దాదాపు 3 లక్షల సర్వింగ్స్ భక్తులకు అందుతున్నాయి. రోజుకు 15.8 టన్నుల బియ్యం వినియోగం. లక్షలాది మంది భక్తులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు టిటిడి ప్రతిరోజూ భారీ స్థాయిలో ముడి పదార్థాలను వినియోగిస్తోంది. రోజుకు సుమారు 15,788 కిలోల బియ్యం, 3,110 కిలోల సన్‌ఫ్లవర్ ఆయిల్, 2,861 కిలోల కందిపప్పు, 2,832 కిలోల సుజీ రవ్వ, 2,825 కిలోల గోధుమ రవ్వ, 1,729 కిలోల మినపప్పు, 1,436 కిలోల ఉప్పు, 1,276 కిలోల బెల్లం, 497 కిలోల చింతపండు వినియోగిస్తున్నారు. అదేవిధంగా రోజుకు సుమారు 4,375 కొబ్బరికాయలు, 430 కిలోల చక్కెర, 309 కిలోల ఎండు మిర్చి, 209 కిలోల ధనియాలు తదితర ముడి పదార్థాలను ఉపయోగిస్తున్నారు. 2026 జనవరి-సెప్టెంబర్ వరకు 9 కోట్లకు పైగా సర్వింగ్స్ అయ్యాయి. భక్తుల రద్దీకి అనుగుణంగా ఎప్పటికప్పుడు తాజాగా నాణ్యమైన, రుచికరమైన అన్న ప్రసాదాలు తయారు చేస్తూ భక్తులకు పంపిణీ చేయడం జరుగుతోంది. భక్తుల విరాళాలతో నిర్వహించబడుతున్న వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్‌లో ప్రస్తుతం 2,900 కోట్ల రూపాయలకు పైగా ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయి. ఈ నిధులపై వచ్చే ఆదాయంతో లక్షలాది మంది భక్తులకు నిత్యం ఉచితంగా నాణ్యమైన అన్నప్రసాదాన్ని అందిస్తున్నారు. "అన్నదానం మహాదానం" అనే భారతీయ సనాతన సంప్రదాయాన్ని కొనసాగిస్తూ టిటిడి నిర్వహిస్తున్న నిత్య అన్నప్రసాద కార్యక్రమం భక్తుల సేవలో ఒక మహత్తర ఆధ్యాత్మిక సేవగా నిలుస్తోంది.

భక్తుల కోసం 'గరుడ మ్యాప్ కొత్త యాప్'

తిరుమల, అక్టోబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమలలో నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్న సమయంలో టిటిడి భక్తుల సౌకర్యార్థం సకల సమాచారం తెలుసుకునేలా నూతన యాప్‌ను రూపొందించింది. ఈ యాప్‌ను బ్రహ్మోత్సవాల వేదికగా ఆవిష్కరించ నున్నారు. సామాన్య భక్తులకు దర్శనం కోసం టిటిడి కొత్తగా సకల సమాచారంతో కొత్త యాప్ అందుబాటులోకి తెచ్చింది. తిరుమలలో పూర్తి సమాచారం అందించేందుకు వీలుగా గరుడ యాప్ తీసుకొచ్చింది. దీని ద్వారా తిరుమలకు వచ్చే భక్తులు ఎవరి సహాయం లేకుండా, వెళ్ళాల్సిన ప్రాంతానికి సులువుగా చేరుకునేలా ఈ మ్యాప్ యాప్ ఉపయోగపడుతుంది. తిరుమల క్షేత్రానికి సంబంధించిన సకల సమాచారంతో ప్రత్యేకంగా ఈ యాప్‌ను రూపొందించారు. భక్తుడు ఏ ప్రాంతానికి వెళ్లాలను కున్నా యాప్‌లో ఆ ప్రదేశం పేరు నమోదు గానీ వాయిస్ కమాండ్ ఇస్తే ఆ ప్రాంతానికి తేలికగా చేరుకోవచ్చు.

టిటిడి అందించే అన్ని సేవలు ఇందులో ఉంటాయి. భక్తులు తల నీలాలు ఇవ్వాలనుకుంటే యాప్ లో నమోదు చేసిన వెంటనే తిరుమలలో ఉన్న కల్యాణకట్టలన్నీ యాప్‌లో కనిపిస్తాయి. అక్కడికి చేరుకునే మార్గాలన్నీ డిస్‌ప్లే అవుతాయి. నడిచి వెళితే ఎంత దూరం, వాహనంలో వెళితే ఎంత దూరం, చేరుకోవడానికి పట్టే సమయం కూడా కనిపిస్తుంది. అంతేకాదు తక్షణమే సులువుగా చేరుకునే మార్గాన్ని కూడా సూచిస్తుంది.

ఇలా వివిధ రకాల దర్శనాల ప్రవేశాలు, క్యూ కాంప్లెక్స్‌లు, లడ్డూ కేంద్రం, అతిథిగృహాలు, ఫుడ్ కౌంటర్లు, తాగునీటి కేంద్రాలు, వైద్య కేంద్రాలు తదితర విభాగాల పూర్తి సమాచారాన్ని ఈ యాప్ ద్వారా పొందే విధంగా రూపకల్పన చేశారు. ఇప్పటికే టిటిడి యాప్‌తో పాటుగా నందకం యాప్ భక్తుల కు అందుబాటులో ఉంచారు. తాజాగా మరో యాప్ సిద్ధమైంది.

కులమతాలకు అతీతంగా కొత్త పార్టీ

• రాష్ట్రంలో ప్రత్యామ్నాయంగా నిలుస్తాం • మాజీ ఎంపి విజయసాయిరెడ్డి

తిరుపతి, అక్టోబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి: కులాలు, మతాలకు అతీతంగా ప్రజలందరినీ ఏకం చేసేలా తమ పార్టీ ఉంటుందని మాజీ ఎంపి విజయసాయి రెడ్డి స్పష్టం చేశారు. అధికార టిడిపి కూటమి, ప్రధాన ప్రతిపక్షమైన వైసిపి తర్వాత తమ పార్టీ మూడో ప్రధాన శక్తిగా ఎదుగుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అన్ని కులాలు, మతాల్ని కలుపుకు పోతూ తమ పార్టీ పనిచేస్తుందని, కూటమి, వైసిపి తర్వాత మూడో స్థానంలో ప్రత్యామ్నాయ పార్టీగా తమ పార్టీ ఉండబోతోందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై నిలబడుతూ ప్రభుత్వం, ప్రతిపక్షంపై నిర్మాణాత్మక విమర్శలు చేస్తామని ఆయన పేర్కొన్నారు. త్వరలోనే ఆంధ్రప్రదేశ్‌లో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేయనున్నట్లు సాయిరెడ్డి ప్రకటించారు. ఎన్నికల్లో గెలిచి అధికారం చేపడితే తమ పార్టీ అమలు చేయబోయే 15 ప్రతిపాదనలను ఇప్పటికే ప్రకటించా నన్నారు. తిరుపతిలో గురువారం ఉదయం మీడియా ప్రతినిధుల సమావేశంలో మరో ఐదు ప్రతిపాదనలు చేశారు. వీటితో కలిపి మొత్తం 20ప్రతిపాదనలు చేస్తు న్నట్లు తెలిపారు. ప్రధానంగా అన్ని కులాలు, మతాల్ని కలుపుకుపోతూ తమ పార్టీ పనిచేస్తుందని సాయిరెడ్డి మరోసారి వెల్లడించారు. భవిష్యత్తులో రాజకీయంగా రెండో, ఒకటో స్థానానికి ఎదుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కమ్మ పార్టీగా చంద్రబాబునాయుడు, క్రైస్తవమత పార్టీగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయంగా ప్రజల ఓట్లు వాడుకుని విస్మరిస్తున్నారని విమర్శించారు. తాను స్వచ్ఛమైన హిందువునని, ఇతర మతాల ప్రార్థనా స్థలాలకు కూడా వెళతానని తెలిపారు. తిరుమల శ్రీవారి లడ్డూలో జంతు కొవ్వు కలిసిందంటూ చంద్రబాబు చేసిన ఆరోపణ అబద్ధమని దర్యాప్తులో తేలిందని, దీని వల్ల హిందువుల మనోభావాలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. హిందూ ధర్మ పరిరక్షణే ధ్యేయంగా కొత్తపార్టీతో తాము రాబోతున్నామని విజయసాయిరెడ్డి స్పష్టమైన ప్రకటన వెల్లడించారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే టిటిడి బోర్డును పూర్తిగా రద్దు చేస్తామని సంచలన ప్రకటన చేశారు. ఇకపై టిటిడి బోర్డులో రాజకీయ నాయకులకు ఎలాంటి ప్రవేశం ఉండదని, కేవలం పీఠాధిపతులు, మఠాధిపతులు, ఆధ్యాత్మిక వేత్తలతోనే ధార్మిక బోర్డును ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు.

వైసిపి అభ్యర్థులను నామినేషన్ దశలోనే అడ్డుకునేందుకు కుట్ర

మాజీ మంత్రి అంబటి రాంబాబు

విజయవాడ, అక్టోబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి: స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులను నామినేషన్ దశలోనే అడ్డుకునేందుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆ పార్టీ సీనియర్ నేత మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్ర ఆరోపణలు చేశారు. రిజర్వేషన్ స్థానాల్లో పోటీ చేసే తమ పార్టీ అభ్యర్థులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అధికారులు ఉద్దేశపూర్వకంగా జారీ చేయడం లేదని ఆయన విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఆదేశాలతోనే అధికారులు ఇలా వ్యవహరిస్తున్నారని అంబటి ఆరోపించారు. తహసీల్దార్లకు ఫోన్ చేసి ధ్రువపత్రాలు ఇవ్వొద్దని చెప్పే స్థాయికి చంద్రబాబు, లోకేశ్ దిగజారారని ఆయన వ్యాఖ్యానించారు. ఈ విషయంపై గుంటూరు జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశామని, వెంటనే సర్టిఫికెట్లు జారీ చేసేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు. సర్టిఫికెట్లు అందకపోవడం వల్ల నామినేషన్లు తిరస్కరణకు గురైతే ప్రజా ఉద్యమం చేపడతామని అంబటి హెచ్చరించారు. ఇదే సమయంలో, తాడేపల్లిలోని వైసిపి కార్యాలయం అంశాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. గతంలో తమ ప్రభుత్వం పార్టీ కార్యాలయం కోసం రెండెకరాల భూమిని కేటాయించిందని, అయితే కూటమి అధికారంలోకి వచ్చాక నిర్మాణంలో ఉన్న భవనాన్ని కూల్చివేసిందని గుర్తుచేశారు. ఇప్పుడు ఆ స్థలాన్ని శ్మశానవాటిక కోసం స్వాధీనం చేసుకుం టున్నట్లు తహసీల్దార్ నోటీసులు ఇచ్చారని తెలిపారు. చంద్రబాబు నివాసానికి అనుమతులు లేవని ఆరోపణలు ఉన్నా, ఆయన కోర్టును ఆశ్రయించి కూల్చివేతను అడ్డుకున్నారని విమర్శించారు. ఈ అంశంపైనా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందని, నిజాయతీగా ఎన్నికలు జరిగితే కూటమి ఓడిపోవడం ఖాయమని జోస్యం చెప్పారు.

యువత భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం: శ్యామల

విజయవాడ, అక్టోబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి: కూటమి ప్రభుత్వం యువత భవిష్యత్తుతో చెలగాట మాడుతోందని, రాష్ట్రంలో మాదకద్రవ్యాలను నియంత్రించడంలో పూర్తిగా విఫలమైందని వైసిపి అధికార ప్రతినిధి శ్యామల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల సమయంలో గంజాయిని సమూలంగా నిర్మూలిస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా లోకేశ్ ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని శ్యామల అన్నారు. "హోంమంత్రి వంగలపూడి అనితకు టివి షోల టిఆర్పీలపై ఉన్న శ్రద్ధ గంజాయి కేసులను అరికట్టడంపై లేదు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో గంజాయి లేకుండా చేస్తానన్న ఆమె సవాల్ ఏమైంది? అని ఎద్దేవా చేశారు. కూటమి నేతలు ఆడుతున్నది యువత భవిష్యత్తును నాశనం చేసే 'టాక్సిక్ గేమ్స్' అని ఆమె ఆరోపించారు. రాష్ట్రంలో గంజాయి, లిక్విడ్ గంజాయి, ఎండిఎంఏ వంటి మాదకద్రవ్యాల విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయని శ్యామల అన్నారు. ఆపరేషన్ చైతన్య, గరుడ వంటి కార్యక్రమాలు విఫలమయ్యాయని, ప్రభుత్వం మాటలు చెప్పడం మాని చేతల్లో చూపించాలని శ్యామల హితవు పలికారు.

చెలి

వారికి మొదలవుతుందా ?

పాపకి పదేళ్లు వచ్చాయంటే చాలు.. రజస్వల కావడానికి సిద్ధంగా ఉందని అర్థం. ఈ వయసు నుంచి ఆమెకు పోషకాలన్నీ అందుతున్నాయో లేదో సరిచూసుకోవాలి. అప్పుడే నెలసరి ఇబ్బందులు, గర్భాశయ సమస్యలు, రక్తహీనత, ఎముకలు గుల్లబారడం వంటి సమస్యల బారిన పడకుండా చూసుకోవచ్చు. ఇందుకోసం ఎలాంటి ఆహారం తీసుకోవాలంటే..

ఇనుము : ప్రపంచదేశాలతో పోల్చితే మనదేశంలోనే రక్తహీనతతో బాధపడుతోన్న మహిళలు, పిల్లలు ఎక్కువట. ఆడపిల్లల్లో రుతుక్రమం మొదలయ్యాక ఈ ఇబ్బంది తలెత్తకూడదంటే.. వారి ఆహారంలో తప్పనిసరిగా ఇనుము ఉండేలా చూసుకోవాలి. ఫిష్, లివర్ వంటివాటితో పాటు సజ్జలు, రాగులు, ఆకుకూరలు, సెనగలు, ఉలవలు, పల్లీలు, నువ్వులు, కాయగూరలు, పండ్ల నుంచి ఐరన్ అధికమోతాదులో లభిస్తుంది.

కాల్షియం : ఇనుము తరవాత ఎక్కువగా అవసరమయ్యే ఖనిజం కాల్షియం. ఇది లోపిస్తే ఎముకలు బలహీనంగా మారతాయి. మూడుపదులు దాటాక, మెనోపాజ్ దశలోనూ.. కీళ్ల సమస్యలు రావొచ్చు. పాలు, పాల సంబంధిత పదార్థాలను తీసుకోవాలి. అవి ఇష్టపడనివారు పెరుగుని ప్రత్యామ్నాయంగా తీసుకోవచ్చు. వీటితో పాటు తాజా ఆకుకూరలు, నువ్వులు, రాగులు, రాజ్మా, వేరు సెనగ పప్పు, పప్పుధాన్యాల నుంచి ఎక్కువగా లభిస్తుంది.

మేలు చేసే కొవ్వులు : చాలామంది కొవ్వు పదార్థాల్ని హానికారకం అనుకుంటారు. కానీ వీటిల్లో శరీరానికి మేలు చేసే కొవ్వులూ ఉంటాయి. వీటి అవసరం ఎంతో ఉంటుంది. బిఎంఐ 18 కంటే తక్కువ ఉన్న అమ్మాయిల్లో పీరియడ్స్ క్రమంగా రాకపోవడానికి కొవ్వుల లోపం కారణమైతే.. స్థూలకాయుల్లో కొవ్వులు ఎక్కువవ్వడం మరో కారణం. కాబట్టి వీటిని తగిన మోతాదులో తీసుకోవాలి. ఈ కొవ్వులు సరిగ్గా ఉంటేనే తీసుకునే ఇతర ఎ,డి,ఇ,కె విటమిన్లను శరీరం స్వీకరిస్తుంది. ★

అందంగా ముఖం



అందంగా ఉండాలంటే పార్లర్ల వద్దకే వెళ్లాల్సిన పనిలేదు. మన ఇంట్లో దొరికే వాటితోనే చక్కటి నిగారింపును సొంతం చేసుకోవచ్చు. పైగా ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. అందుకోసం ముఖంపై కాస్త శ్రద్ధ పెట్టి ఇంట్లో ఉంటే సహజ సిద్ధమైన వాటిని అప్లై చేసి మచ్చలేని చందమామలా ఉండే ముఖాన్ని సొంతం చేసుకుండి. అందకు ఈ సింపుల్ రెమిడీస్‌ని ఫాలోకండి. అందంగా ముఖం

రోజూ పెదవులకు కాస్తంత మీగడ రాసిన సున్నితంగా మర్దన చేస్తే పదవులు పగడలకుండా గులాబీ రేకుల్లా మెరుస్తాయి.

ముఖాన్ని రోజుకు రెండు మూడుసార్లు గోరువెచ్చటి నీటితో కడుక్కుని పొడి టబల్‌తో చక్కగా తుడిచేస్తే ముఖం మొటిమల వంటివిరావు.

✓ లేత కొబ్బరిని మెత్తగా మెదిపి ముఖానికి ప్యాక్‌లా వేసుకుని, ఆరిన తర్వాత కడిగేసు కుంటూ ఉండాలి. ఇలా చేస్తుంటే ముఖం చక్కగా అందంగా కనబడు తుంది. రకరకాల షాంపూల బదులు కుంకుడు కాయ రసం లేదా సీకాయ పొడితో తలస్నానం చేయడం వల్ల చుండ్రు, కేశ సంబంధ మైన సమస్యలు రాకుండా జుట్టు ఆరోగ్యంగా నిగనిలాడుతుంది. తల స్నానం పూర్తయిన తర్వాత, చివరి మగ్గు నీటిలో కొంచెం నిమ్మరసం కలిపి తలమీద పోసుకుంటే జుట్టు, చర్మ సమస్యలురావు. ★

నైపుణ్యం పెంచుకుంటే బంగారు భవిష్యత్తు

చేసే పనిలోనైనా, కెరీర్‌లోనైనా.. వచ్చే మార్పుల్ని గమనిస్తూ నైపుణ్యాలను పెంచుకున్నప్పుడే బంగారు భవిష్యత్తు సొంతమవుతుంది. ఇలా సొంతం చేసుకున్న నైపుణ్యాలే మన తరగని ఆస్తులు, అవే ఎలాంటి ప్రతి కూల పరిస్థితుల్లోనైనా వ్యక్తిగతంగా, వృత్తిపరంగా మనల్ని ఉన్నతంగా నిలబెడతా యని నిపుణులు చెబుతున్నారు.

మార్పు మంచిదే! శ్రీ ప్రస్తుతం మన రోజువారీ జీవితాలే కాదు..కెరీర్ కూడా టెక్నాలజీతో ముడిపడిపోయిందని శ్రీ చెప్పాలి. ఈ ఏఐ యుగంలో ఇది మరెంత అడ్వాన్స్ మారనుందో ఊహించగలం. ఈ శ్రీ టెక్నాలజీలో వస్తున్న కొత్త పోకడల్ని అవపోసన పట్టడం చాలా ముఖ్యమంటున్నారు. శ్రీ నిపుణులు. ఇందుకు మారుతోన్న సాంకేతికతకు అనుగుణంగా కొత్త కోర్సులు నేర్చుకోవడానికి ఉత్సుకత చూపాలి. ఎలాంటి కొత్త బాధ్యతనైనా అందిపుచ్చుకునే నేర్పును అలవర్చుకోవాలి.

కమ్యూనికేషన్ ముఖ్యం! కొంతమందికి నలుగురిలో మాట్లాడాలంటే ఏదో తెలియని భయం, బిడియం ఉంటాయి. వ్యక్తిగతంగా, వృత్తిపరంగా ఎదగాలనుకునే వారికి ఇవే పెద్ద అవరోధాలుగా మారతాయంటున్నారు నిపుణులు. మీరు మీ బృందంతోనే కాదు.. ఇతర బృందాలతో కూడా పని/ప్రాజెక్ట్ గురించి మాట్లాడాల్సి వస్తుంది. మీ ఆలోచనల్ని వారితో పంచుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంది. ఇలాంటప్పుడు చక్కటి కమ్యూనికేషన్ నైపుణ్యాలు ముందు నుంచే అలవర్చుకోవడం మంచిది.

సృజనాత్మకంగా.. వివిధ రంగాల్లో కృత్రిమ మేధ సృష్టిస్తున్న అద్భుతాల గురించి వింటూనే ఉన్నాం. ఈ సృజనాత్మకంగా ఆలోచించగలిగే సామర్థం, ఒక సమస్యకు పరిష్కారం కనుక్కొని దాన్ని కనుగొనగలిగేలా నేర్పు. ప్రతి వైద్యం సానుకూలంగా ఆలోచించడంతో పాటు అందులోని లోపాలనూ కనిపెట్టగలిగినప్పుడే పరిష్కారం సాధించగలం. భవిష్యత్తులోనూ మంచి అవకాశాలను అందిపుచ్చుకోగలుగుతాం.

పోటీని తట్టుకునేలా..! ఈరోజుల్లో పోటీ లేని రంగం, కెరీర్ లేదంటే అతిశయోక్తి కాదు. అయితే ఇది భవిష్యత్తులో మరింత తీవ్రంగా ఉండే అవకాశాలున్నా యని నిపుణులు చెబుతున్నారు. అలాగని భయపడిపోతే ముందుకు సాగలేం.. అందుకే ఈ పోటీని తట్టుకొని నిలబడాలంటే ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనే నైపుణ్యాన్ని అలవర్చుకోవాలి. ఎంపిక రంగంలో పోటీని అధిగమించడానికి అవసరమైన అన్ని నైపుణ్యాలను సొంతం చేసుకోవాలి. ఎప్పటికప్పుడు మన వాయువు పెంపొందించుకోవాలి. ఈ లక్షణాలు ఎలాంటి ప్రతికూల పరిస్థితుల్లోనైనా ముందుకు నడిపించడంతో పాటు.. విజయం సాధించేలా ఉన్నాయి. ★

కాశీ అన్నపూర్ణమ్మ



కాశీ క్షేత్రానికి వెళ్లిన భక్తులు విశ్వ నాథుడితో పాటు అన్నపూర్ణమ్మ తల్లి దర్శనం కూడా చేసుకుంటూ వుంటారు. అన్నపూర్ణమ్మ ఈ క్షేత్రంలో కొలువై ఉండటం వెనుక ఒక ఆసక్తికర మైన పురాణ కథనం అక్కడ వినిపిస్తూ ఉంటుంది. పూర్వం పరమశివుడు కైలాసంలో ధ్యానంలో ఉండగా .. వెనక నుంచి పార్వతీదేవి వచ్చి సరదాగా ఆయన కళ్ల మూసింది. ఒక్కసారిగా లోకాలన్నీ చీకట్లు అలుముకోవడంతో .. తాను చేసింది ఎంత పెద్ద పొరపాటు అనే విషయం పార్వతీదేవికి అర్థమైంది. తాను చేసిన తప్పుకు ప్రాయశ్చిత్తం చేసుకోవడం కోసం అమ్మవారు కాశీ నగరానికి చేరుకుంటుంది. ఆ సమయంలో కాశీ నగరంలో కరవు కాటకాలతో ప్రజలు బాధలుపడుతూ వుంటారు. అక్కడ అన్నపూర్ణమ్మగా పిలవబడుతూ .. ఆకలితో వున్నవారికి ఆహారాన్ని అందిస్తూ ఉంటుంది. అన్న పూర్ణమ్మ రాకతో కాశీ నగరంలో ఆకలి బాధలు లేకుండా పోతాయి. ఈ విషయం తెలుసుకున్న కాశీ రాజు ఆశ్చర్యంతో అన్నపూర్ణమ్మ దర్శనం చేసుకుంటాడు. ఆమె సాక్షాత్తు పార్వతీదేవి అనే విషయాన్ని గ్రహించి .. భక్తి శ్రద్ధలతో నమస్కరిస్తాడు. కాశీ నగరంలోనే ఎప్పటికీ కొలువై ఉండమని ప్రార్థిస్తాడు. అందుకు అంగీకరించిన ఆ తల్లి అక్కడే కొలువై పూజలు అందుకుంటోంది. ★

వేడిగా తాగుతున్నారా ?

ఉదయం లేవగానే వేడి వేడి టీనో, కాఫీ మొదలుపెట్టినో తాగనిదే ఏ పనీరు చాలా మంది ఆడవాళ్లు. అంతలా అది మన జీవితంలో భాగమైంది మరి. దానివల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలూ ఎక్కువే. అయితే, దాన్ని ఎంత వేడిలో తాగుతున్నారన్నదీ ముఖ్యమే. వాతావరణం చల్లగా ఉందనో, నిద్ర పోగొట్టుకోవాలనో వేడిగా ఉండే టీ, కాఫీలు తాగడం అలవాటు కొందరికి. కానీ, బాగా వేడిగా ఉన్నవి అంటే... 65 డిగ్రీల సెంటీగ్రేడ్ కన్నా ఎక్కువ వేడిగా ఉన్నవి తాగితే 'స్క్వామస్ సెల్ కార్సి నోమా' అనే ఆహార నాళ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ క్యాన్సర్ అధ్యయనాలు చెబుతు న్నాయి. దీనికోసం పరిశోధకులు మిలియన్ ఉమన్ స్టడీ, యునైటెడ్ కింగ్డమ్ బయోబ్యాంక్ల డేటాను తీసుకొని పరిశీలించారు. మరీ అంత వేడిగా తాగని వాళ్లతో ప్రస్తుతం వీళ్లలో ఈ ప్రమాదం మూడు రెట్లు అధికమట. కాబట్టి, ఏదైనా వేడిగా తాగేముందు కొద్ది నిమిషాలు వేచి ఉండటం మంచిది . ★

పెసరుపప్పు పకోడి

పెసరుపప్పు : ఒక కప్పు
అల్లం : ఒక అంగుళం ముక్క
పచ్చిమిర్చి : రెండు
ఉల్లిపాయ : ఒకటి
కరివేపాకు : రెండు రెమ్మలు
కొత్తిమీర తరుగు : కొద్దిగా
పసుపు : పావు టీస్పూన్
గరం మసాలా : అర టీస్పూన్
కారం : అర టీస్పూన్
జీలకర్ర : ఒక టీస్పూన్
వాము : పావు టీస్పూన్
ఉప్పు : రుచికి తగినంత
నూనె : వేయించడానికి సరిపడా

తయారీ: పెసరుపప్పును శుభ్రంగా కడిగి.. ఒక గంటసేపు నానబెట్టాలి. నీళ్లను వంపేసి.. పప్పును మిక్సీ జార్‌లోకి తీసుకోవాలి. అందులో అల్లం ముక్క వేసి.. కాస్త బరకగా రుబ్బుకోవాలి. ఓ గిన్నెలో సన్నగా తరిగిన ఉల్లిపాయ, పచ్చిమిర్చి, కరివేపాకుతోపాటు కొత్తిమీర తరుగు, జీలకర్ర, వాము, ఉప్పు, పసుపు, కారం, గరం మసాలా వేసి బాగా కలపాలి. అందులోనే మిక్సీ పట్టుకున్న పెసరుపప్పును కూడా వేసుకొని మరోసారి బాగా కలపాలి. స్టవ్‌పైన కడాయి పెట్టి.. డీప్‌ఫ్రైకి సరిపడా నూనె పోసుకోవాలి. ఆయిల్ బాగా వేడెక్కిన తర్వాత.. మంటను సిమ్‌లో పెట్టుకొని, పిండిని కొద్దికొద్దిగా తీసుకుంటూ పకోడీలుగా వేసుకోవాలి. కడాయి నిండుగా పకోడీలు వేసుకున్న తర్వాత.. మంటను మీడియం ఫ్లేమ్‌లోకి మార్చుకోవాలి. పకోడీలను గంటెతో కలుపుతూ.. రెండు వైపులా ఎర్రగా, కరకరలాడేలా వేయించుకుని వేరే ప్లేట్‌లోకి తీసుకోవాలి. వర్షం పడుతున్నప్పుడు వీటిని వేడివేడిగా.. గ్రీన్ చట్నీ లేదా టమాటా సాస్‌తో కలిపి తింటే అద్భుతంగా ఉంటాయి.

తెర

'ప్రేమనే ఊరిలో' ఎక్స్‌పీరియన్స్ చేసే సినిమా: సాయి కుమార్

డైలాగ్ కింగ్ సాయికుమార్ మాట్లాడుతూ "ప్రేమనే ఊరిలో.." ఆల్రెడీ ప్రూవ్డ్ ఫిలిం. ఇప్పటికే మంచి విజయం సాధించింది. ఇది ప్రతి ఒక్కరూ ప్రేమించే సినిమా, ఎక్స్‌పీరియన్స్ చేసే సినిమా. మన సినిమా. మన మట్టి సినిమా. మన ఊరి సినిమా. నేను త్వరలోనే ఈ సినిమాను థియేటర్స్‌లో మీతో పాటే కలిసి చూస్తాను. ఈ సినిమాను మీరంతా తప్పకుండా ఆదరిస్తారని తెలుసు. ఉన్నాయి. హీరో శ్రీరామ్ మాట్లాడుతూ మా "ప్రేమనే ఊరిలో.." సినిమాకు సాయికుమార్ లాంటి పెద్దల ఆశీర్వాదాలు దక్కడం చాలా సంతోషంగా ఉంది. ఆయన మా గురించి చెప్పిన ప్రతి మాటను మనసులో చిరకాలం దాచుకుంటాం. సాయికుమార్ లాంటి గొప్ప ఆర్టిస్టుల స్ఫూర్తి మాపై ఎప్పటికీ ఉంటుంది. హీరోయిన్ తపస్విని పునాచ మాట్లాడుతూ మా 'ప్రేమనే ఊరిలో..' సినిమాకు తెలుగు ఆడియెన్స్ ఇస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే హ్యాపీగా ఉంది. మేము థియేటర్ విజిట్స్ చేశాం. ప్రతి థియేటర్‌లో ఆడియెన్స్ సూపర్బ్ గా ఎంజాయ్ చేస్తున్నారు. ప్రొడ్యూసర్ మమత దేవేంద్ర మాట్లాడుతూ మా సినిమాను తెలుగులో రిలీజ్ చేయాలనుకున్నప్పుడు మా బాబాయ్ ద్వారా సురేష్‌ని కలిశాం. ఆయన ఇక్కడే సినిమా చూశారు. సినిమా చూసిన తర్వాత ఆయన ఎలా రెస్పాండ్ అవుతారో అనుకున్నాం. సినిమా బాగుంది. డబ్బింగ్, సాంగ్స్ ఎవరితో చేయిద్దాం అంటూ మాట్లాడారు. నిర్మాత సురేష్ కొండేటి మాట్లాడుతూ "ప్రేమనే ఊరిలో..' సినిమాకు మంచి విజయాన్ని అందించిన తెలుగు ఆడియెన్స్ కు థ్యాంక్స్. ప్రేక్షకుల నుంచి వస్తున్న రెస్పాన్స్ చూసి థియేటర్స్, స్క్రీన్స్ పెంచాం. ఈ క్రమంలో నాకు మా టీమ్ అంతా సపోర్ట్ గా నిలిచారు. ఒక మంచి ఫీల్ గుడ్ మూవీ. ఫ్యామిలీ ఆడియెన్స్ కు బాగా కనెక్ట్ అవుతుందని ముందునుంచీ నమ్మకంతో ఉన్నాం.

'భారతీయుడు3' త్వరలో షూటింగ్ షురూ

యూనివర్సల్ హీరో కమల్ హాసన్, స్టార్ డైరెక్టర్ శంకర్, ప్రెస్టీజియష్ చిత్రాలను నిర్మిస్తోన్న భారీ నిర్మాణ సంస్థ కాంబోలో రూపొందుతోన్న చిత్రం భారతీయుడు3. 1996లో విడుదలైన బ్లాక్ బస్టర్ మూవీకి స్వీకెల్‌గా భారతీయుడు2, భారతీయుడు 3 చిత్రాలను కమల్, శంకర్ కాంబోలో రూపొందించ టానికి లైకా సంస్థ సిద్ధమైంది. అందులో భాగంగా 2024లో భారతీయుడు 2 విడుదలైన సంగతి తెలిసిందే. ఇప్పుడు దీనికి కొనసాగింపుగా భారతీయుడు3ను చిత్రీకరించటానికి మేకర్స్ సిద్ధమ య్యారు. ఇప్పటికే 'భారతీయుడు3'లో కొంత భాగాన్ని చిత్రీకరించారు. దానికి సంబంధించిన ఎడిటింగ్ వర్క్ శరవేగంగా జరుగుతోంది. 10 రోజుల్లో భారతీయుడు3'కి సంబంధించిన మిగిలిన భాగాన్ని పూర్తి చేయటానికి షూటింగ్‌ను స్టార్ట్ చేయబోతున్నారు. త్వరలోనే రిలీజ్ డేట్‌ను కూడా అనౌన్స్ చేస్తామని చిత్ర యూనిట్ తెలియజేసింది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేసింది. ముగ్గురు వ్యక్తులు గుర్రాలపై వేగంగా వెళుతుంటే దుమ్ము, దూళి రేగుతున్నట్లుగా ఉండే ఫొటో క్యూరియాసిటీని క్రియేట్ చేస్తోంది. భారతీయుడు 3 ఎలా ఉండబోతుందనే విషయాన్ని భారతీయుడు 2 క్లైమాక్స్‌లో చూపించారు. దక్షిణాది చిత్ర పరిశ్రమలో డిఫరెంట్ కంటెంట్ చిత్రాలను రూపొందించటంతో పాటు స్టార్స్‌తో భారీ బడ్జెట్ చిత్రాలను నిర్మిస్తూ తనదైన గుర్తింపు సంపాదించుకున్న సంస్థ లైకా ప్రొడక్షన్స్, అధినేత సుభాస్కరన్ ఇప్పుడు మరో ప్రెస్టీజియస్ మూవీగా భారతీయుడు3ని మనకు అందించటానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈసారి సేనాపతి లంచాన్ని అంతమొందించటానికి చేసే పోరాటం ఎలా ఉంటుందో బిగ్ స్క్రీన్‌పై చూసి ఎంజాయ్ చేయాల్సిందే. సాధారణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగి, వ్యాపార రంగంలో తనదైన ముద్ర వేసుకున్న దూరదృష్టి కలిగిన పారిశ్రామికవేత్త సుభాస్కరన్. వ్యాపార రంగంలో సాధించిన విజయాన్ని సినిమా రంగంలోనూ కొనసాగిస్తూ, లైకా ప్రొడక్షన్స్‌ను భారతీయ చిత్ర పరిశ్రమలో ప్రముఖ నిర్మాణ సంస్థగా

బహు భాషా చిత్రాల నటుడు నానాపటేకర్



లెజెండరీ యాక్టర్ నానా పటేకర్ మరణవార్త యావత్ సినీ లోకాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టేసింది. గోవాలో గుండెపోటుతో ఆయన కన్నుమూశారు అన్న వార్తను అభిమానులు ఇంకా జీర్ణించుకోలేక పోతున్నారు. నానా పటేకర్ తెలుగు ప్రేక్షకులకు సుపరిచతమే. ఆయన నటించిన కొన్ని సినిమాలు తెలుగులోకి డబ్ అయ్యి ఇక్కడి ప్రేక్షకులను ఆకట్టుకు న్నాయి. రజనీకాంత్ హీరోగా వచ్చిన 'కాలా' సినిమాలో విలన్ పాత్రలో అద్భుతంగా నటించారు. తమిళంతో పాటు తెలుగులోనూ విడుదలైన ఈ సినిమా ద్వారా ఇక్కడి ప్రేక్షకులకు దగ్గరయ్యారు. అలాగే, తమిళంలో భారతీ రాజా దర్శకత్వంలో వచ్చిన 'బొమ్మలాట్టమ్' సినిమా తెలుగులో 'రాణా' పేరుతో డబ్ అయ్యింది. ఇందులో అర్జున్, కాజల్ అగర్వాల్‌తో పాటు నానా పటేకర్ (వెటరన్ యాక్టర్ నానా పటేకర్) ముఖ్య పాత్ర పోషించారు. 1951లో జన్మించిన నానా పటేకర్ అసలు పేరు విశ్వనాథ్ పటేకర్. 1978లో ఖిగమన్‌ఖి సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. హిందీతో పాటు మరాఠీ సినిమాల్లో ఎన్నో గుర్తుండిపోయే పాత్రలు పోషించారు. తన కెరీర్‌లో మూడు జాతీయ చలనచిత్ర పురస్కారాలను అందుకున్నారు. 'క్రాంతి వీర్' చిత్రానికి ఉత్తమ నటుడిగా, పరిందా, అగ్నిసాక్షి చిత్రాలకు ఉత్తమ సహాయనటుడిగా జాతీయ అవార్డు దక్కింది. సినీ పరిశ్రమకు అందించిన సేవలకు గానూ 2013లో కేంద్రం ఆయనను పద్మశ్రీ పురస్కారంతో గౌరవించింది. అదే ఏడాది మహారాష్ట్ర (మహారాష్ట్ర) ప్రభుత్వం రాజ్కపూర్ ప్రత్యేక సహకార అవార్డును ప్రదానం చేసింది. నానాపటేకర్ 1978లో మరాఠీ సినీ నటి, నిర్మాత నీలకంఠిని వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత కొన్ని కారణాల వల్ల వీరిద్దరూ విడివిడిగా ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు కాగా.. ఒక అబ్బాయి పుట్టిన రెండు సంవత్సరాలకే అనారోగ్య కారణాలతో కన్నుమూశాడు. మరో అబ్బాయి మల్హార్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు.

'కామ్రేడ్ కళ్యాణ్' ప్రి రిలీజ్

ప్రెస్‌మీట్‌లో హీరో శ్రీ విష్ణు మాట్లాడుతూ.. అక్టోబర్ 9న 'కామ్రేడ్ కళ్యాణ్' రిలీజ్. దసరా సీజన్‌లో అందరూ ఫ్యామిలీతో కలిసి హ్యాపీగా ఈ సినిమాకు వెళ్లి మనస్ఫూర్తిగా ఎంజాయ్ చేయొచ్చు. పిల్లలకు కూడా ఈ సినిమా చాలా బాగా నచ్చుతుంది. మేము రిలీజ్ చేసిన కంటెంట్ అన్నిటికీ చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. కోన వెంకట్ మాట్లాడుతూ.. ఈరోజు మా కామ్రేడ్ కళ్యాణ్.. రేపట్నుంచి కామెడీ కళ్యాణ్ అవుతాడు. అందరి హీరోకి ఫ్యాన్స్ ఉంటారు. అందరి హీరోల ఫ్యాన్స్ కూడా శ్రీ విష్ణుని ఇష్టపడతారు. అందరివాడు అనే టైటిల్ శ్రీ విష్ణు సరిపోతుంది. తను అందరి హీరోలతో, అందరి అభిమానులతో కూడా చాలా బాగుంటాడు. డైరెక్టర్ జానకిరామ్ మాట్లాడుతూ.. నా దేవుడు శ్రీ విష్ణుకి, నా మెంటార్ కోన వెంకట్‌కి ఎప్పటికీ రుణపడి ఉంటాను. ఈ సినిమా ఎంత అద్భుతం గా వచ్చి ప్రేక్షకుల ముందుకు వస్తుందంటే దానికి కారణం వారే. అలాగే మా నిర్మాత కిట్టు కూడా ఎంతో పాజిటివ్‌గా ఈ సినిమాని చేశారు. నిర్మాత వెంకట కృష్ణ మాట్లాడుతూ.. నిర్మాతగా ఇదినా తొలి సినిమా. శ్రీ విష్ణు , కోన చాలా సపోర్ట్ చేశారు.

'గుడ్ టైమ్' సినిమా 9న విడుదల

డైరెక్టర్ అనిల్ విశ్వనాథ్, హీరోయిన్ కామాక్షి భాస్కర్ల అతిథు లు గా ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ దినేష్ కార్తీక్ మాట్లాడుతూ మా చిత్రం టీజర్, ట్రైలర్ మీరు చూశారు. టీజర్, ట్రైలర్ మీకు బాగా నచ్చాయి. రైటర్ అభిరామ్ మాట్లాడుతూ ఒక యావరేజ్ కుర్రాడి పీడకల ఈ సినిమా. అది ఎలా ఉంటుందో మీరే థియేటర్స్ లో చూడబోతు న్నారు. ఎడిటర్ సాయి తరుణ్ మాట్లాడుతూ మా సినిమా మీకు రెండు గంటలు ఎంటర్ టైన్ మెంట్ అంది స్తుంది. మ్యూజిక్ డైరెక్టర్ నిర్వాణ్ ఆత్రేయ మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా ఈ సినిమాకు చాలా హార్డ్ వర్క్ చేస్తూ వస్తున్నాం. మా మూవీ సాంగ్స్ మీకు బాగా నచ్చాయని నమ్ముతున్నాం.నటుడు ధన్ రాజ్ మాట్లాడుతూ అల్వాల్ లో ఉండే ఒక లత్కోర్ గాని స్టోరీ ఇది. నిఖిల్, హృతిక్ శెట్టి, నా కాంబినేషన్ సీన్స్ హిలేరియస్ గా వచ్చాయి. నటుడు హృతిక్ శెట్టి మాట్లాడుతూ అల్వాల్ బస్తీని దగ్గరగా చూసిన ఫీల్ మా సినిమాతో మీకు కలుగుతుంది. నటుడు హరి మున్నంగి మాట్లాడుతూ రీసెంట్ గా అమీర్ లోగ్ చిత్రంలో నటించాను. ఆ సినిమాలో సాఫ్ట్ రోల్ చేశా. కానీ ఈ సినిమాలో మాత్రం కంప్లీట్ రఫ్ అండ్ టఫ్ క్యారెక్టర్ లో కనిపిస్తాను. నటి సౌందర్య లహరి మాట్లాడుతూ ఈ సినిమాలో ఫ్రెండ్ క్యారెక్టర్ చేశాను. ఈ జెనరేషన్ తో పాటు నిన్నటితరం వారికి కూడా మా సినిమా బాగా నచ్చుతుంది. సీయీవో ఐశ్వర్య జిల్లా మాట్లాడుతూ మా జర్నీలో ఇప్పటిదాకా 80 పర్సెంట్ సక్సెస్ అయ్యామని అనుకుంటున్నాం. థియేటర్స్ లో మీరు సినిమా చూసి ఆదరిస్తే 100 శాతం సక్సెస్ అవుతాం. ప్రొడ్యూసర్ రమేష్ జిల్లా మాట్లా డుతూ మా సినిమాకు పనిచేసిన నటీనటులు, టెక్నీషియన్స్ అందరికీ థ్యాంక్స్. ఈ రోజు ఈవెంట్ కు వచ్చి మీరంతా సపోర్ట్ చేయడం హ్యాపీగా ఉంది. థియేటర్స్ లో ఈ నెల 9న మా సినిమా రిలీజ్ అవుతోంది. నటి సునీత మనోహర్ మాట్లాడుతూ ఈ సినిమాలో ఇంపార్టెంట్ క్యారెక్టర్ లో నటించే అవకాశం రావడం హ్యాపీగా ఉంది.

'లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్': ప్రి బ్యాచలర్ పార్టీ

హర్ష చెముడు ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్', బాబు డెగాల దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని చవాన్, శ్రీధర్ చెని, దీపక్ ముస్త్యాల నిర్మించారు. రాజ్ సుహాస్, ప్రమదేశ్వి వి క్రియేటివ్ ప్రొడ్యూ సర్లుగా వ్యవహరించారు. అక్టోబర్ 9 నుంచి ప్రముఖ తెలుగు ఓటీటీ వేదిక 'లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' స్ట్రీమింగ్ కానుంది. ప్రీ బ్యాచిలర్ పార్టీ ఈవెంట్‌లో వైవా హర్ష మాట్లాడుతూ..ఈటీవీ అంటే మనకి ఇంటితో సమానం. చిన్నప్పటి నుంచి మనం ఈటీవీలో వచ్చే ప్రోగ్రామ్స్ చూస్తూనే పెరిగాము. నాలుగు నెలల్లో ఒక ప్రాజెక్ట్‌ను ఫినిష్ చేసి రిలీజ్ చేయడం అనేది ఒక కేస్ స్టడీ. షూటింగ్ అంతా చాలా కంఫర్టబుల్‌గా జరిగింది. ఈటీవీ సాయికృష్ణ మాట్లాడుతూ.. సందీప్‌కి థాంక్యూ. ఈ టైటిల్ పెట్టింది తనే. చవాన్ ప్రొడ్యూస్ చేశారు. నాలుగు నెలల్లో పూర్తి చేసి రిలీజ్ చేస్తున్నారు. ఈ సిరీస్‌లో ఈ క్యారెక్టర్ చేయడం అంత ఈజీ కాదు. హర్ష చాలా అద్భుతంగా చేశాడు. ఈ సినిమాలో నటించిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. డైరెక్టర్ బాబు మాట్లాడుతూ.. అందరికీ థాంక్యూ సో మచ్. ముందుగా ఈటీవీ సాయికి థాంక్యూ. ఈ జర్నీలో నాకు చాలా సపోర్ట్ చేశారు. మంత్ అఫ్ మధు సినిమా చూసి హర్షకి అభిమానిగా మారి పోయారు. ఆయన ఎక్కడా కూడా నటిస్తున్నట్టుగా కనిపించలేదు. హైపర్ ఆది మాటాడుతూ.. ఇది చాలా మంచి ఎంటర్ టైనర్. మీరందరూ చాలా ఎంజాయ్ చేస్తారు.

నవంబరు 8న హైవోల్టేజ్ మ్యాచ్

ఇండియా, పాకిస్థాన్ ఢీ

న్యూఢిల్లీ: భారత్, పాకిస్థాన్ జట్లు మరోసారి ఎదురెదురుపడనున్నాయి. పురుషుల సీనియర్ టీ20 జట్టు ఇటీవల ఏషియన్ గేమ్స్‌లో గోల్డ్ మెడల్ కోసం తలపడగా, త్వరలో అండర్ 19 జట్లు ఆసియా కప్, 2026లో పోటీ పడనున్నాయి. ఈ టోర్నీకి సంబంధించిన షెడ్యూల్ గురువారం విడుదలైంది. ఒమన్ ఆతిథ్యమివ్వనున్న ఈ టోర్నీ నవంబరు 5 నుండి 14వ తేదీ వరకూ జరగనుంది. మొత్తం ఎనిమిది జట్లు ఇందులో పాల్గొంటుండగా, ఈ టోర్నీలో పాకిస్థాన్ డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో బరిలోకి దిగనుంది. గత ఎడిషన్ ఫైనల్లో పాక్ భారత్‌ను 191 పరుగుల తేడాతో ఓడించి టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఆ ఓటమికి ప్రతీకారం తీర్చుకునేందుకు భారత్‌కు అవకాశం వచ్చింది. నవంబరు 8న జరిగే మ్యాచ్‌లో పాక్ భారత్‌ను ఢీకొంటుంది. ఈ మ్యాచ్ భారత్ కాలమానం ప్రకారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుంది. టోర్నీలోని అన్ని మ్యాచ్‌లు ఇదే సమయంలో ప్రారంభమవుతాయి. ఈ టోర్నీలో పాల్గొనే ఎనిమిది జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. గ్రూప్ ఎ లో భారత్, పాక్, యుఏఈ, నేపాల్ జట్లు ఉండగా, గ్రూప్ బి లో శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్ఘనిస్తాన్, మలేషియా జట్లు పోటీపడతాయి. గ్రూప్ దశలో ప్రతీ జట్టు తమ గ్రూప్‌లోని మిగిలిన మూడు జట్లతో తలపడుతాయి. 2 గ్రూపుల్లోనూ టాప్ 2జట్లు జెమీ ఫైనల్స్‌కు అర్హతసాధిస్తాయి. సెమీఫైనల్స్ రెండూనవంబరు 12న జరగనున్నాయి. అదేనెల 14న ఫైనల్ నిర్వహిస్తారు. టోర్నీలో మొత్తం 15 మ్యాచ్‌లు 50 ఓవర్ల ఫార్మాట్‌లోనే జరుగుతాయి. నవంబరు 5న జరిగే తొలి మ్యాచ్‌లో శ్రీలంక, మలేషియా జట్లు తలపడతాయి.

ఆర్కిటిక్ ఓపెన్‌లో ప్రసాద్-పృథ్వీ జోడీ విజయం

ప్రణయ్, శ్రీకాంత్ నిష్క్రమణ

వాంటా (న్యూయార్క్): ఆర్కిటిక్ ఓపెన్‌లో భారత్ తరఫున కృష్ణ ప్రసాద్ గరగ, పృథ్వీ కృష్ణమూర్తి రాయ్ జోడీ సంచలన విజయంతో అత్యుత్తమ ఫలితాన్ని అందించారు. గురువారం వాంటాలో జరిగిన పురుషుల డబుల్స్ ప్రీక్వార్టర్ ఫైనల్స్‌కు చేరేందుకు చైనాకు చెందిన ఐదో సీడ్ జోడీ హీ జీ టింగ్, రెన్ జియాంగ్ యూలను ఓడించారు. ఇక అనుభవజ్ఞులైన సింగిల్స్ ఆటగాళ్లు హెచ్ఎస్ ప్రణయ్, కిదాంబి శ్రీకాంత్ ఇక్కడ తొలి రౌండ్లలోనే నిష్క్రమించారు. తొలి గేమ్‌ను కోల్పోయినప్పటికీ, భారత్ జంట 61 నిమిషాల పాటు జరిగిన పోరులో చైనా జోడిని 10-21, 21-18, 22-20 తేడాతో ఓడించింది. ఇక ప్రపంచ ర్యాంకింగ్‌లో 31వ స్థానంలో ఉన్న శ్రీకాంత్, కెనడాకు చెందిన బ్రియాన్ యాంగ్‌పై తొలి గేమ్‌ను గెలుచుకుని మంచి ఆరంభం దిశగా సాగాడు. అయితే, మాజీ ప్రపంచ నంబర్ 1 అయిన అతను ఆ ఊపును కొనసాగించలేక చివరకు 15-21, 21-15, 21-13 తేడాతో ఓడిపోయాడు. నాలుగో సీడ్ ఆండర్స్ ఆంటోన్సెన్‌తో జరిగిన పోరులో ప్రణయ్ పోరాటం మరింత ఆకస్మికంగా ముగిసింది. గత నెలలో వియత్నాం ఓపెన్ సూపర్ 100 సెమీఫైనల్స్‌కు చేరుకున్న 34 ఏళ్ల ఈ భారత ఆటగాడు, ఆ డానిష్ ఆటగాడిపై ఆధిపత్యం చెలాయించలేక 21-10, 21-9 తేడాతో ఓటమి పాలయ్యాడు. ఇక క్వాలిఫయింగ్‌లో విజయం సాధించి తన జోరును కొనసాగించిన తరుణ్ మన్నేపల్లిపైనే ఇప్పుడు పురుషుల సింగిల్స్ డ్రాలో భారత ఆశలు ఆధారపడి ఉన్నాయి.

క్వార్టర్ ఫైనల్స్‌కు సింధు

తన్వి, తరుణ్ నిష్క్రమణ

న్యూయార్క్: రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు, జపాన్‌కు చెందిన రికో గుంజీని ఓడించి మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకోగా, గురువారం ఫిన్లాండ్‌లో జరిగిన ఆర్కిటిక్ ఓపెన్ సూపర్ 500 టోర్నమెంట్‌లో భారత పురుషుల సింగిల్స్ ఆటగాళ్లకు టోర్నమెంట్ నుండి నిష్క్రమణ ముగిసింది. జూలైలో జపాన్ ఓపెన్ సూపర్ 750 టైటిల్ గెలుచుకున్న హైదరాబాద్‌కు చెందిన 31 ఏళ్ల సింధు, రెండో రౌండ్‌లో జపాన్‌కు చెందిన రికో గుంజిపై 21 -15, 21-15 తేడాతో విజయం సాధించింది. ఆరో సీడ్ భారత క్రీడాకారుడు శుక్రవారం థాయ్‌లాండ్‌కు చెందిన టాప్ సీడ్, మాజీ ప్రపంచ ఛాంపియన్ రత్చానోక్ ఇంథానన్‌తో తలపడనున్నాడు. అయితే, వరుస గేమ్‌లలో ఓటమి పాలైన తరుణ్ మన్నేపల్లి, తన్వి శర్మలకు ఇది నిరాశాజనకమైన ప్రదర్శనగా నిలిచింది. ఫ్రాన్స్‌కు చెందిన రెండో సీడ్ క్రిస్టో పోపోవ్, మన్నేపల్లిని 21-14, 21-19 తేడాతో ఓడించగా, రాట్చానోక్ తన్విని 21-18, 21-7 తేడాతో ఏకపక్షంగా ఓడించింది. మాజీ ప్రపంచ నంబర్ 1 అయిన కిదాంబి శ్రీకాంత్ కూడా కెనడాకు చెందిన బ్రియాన్ యాంగ్ చేతిలో 21-15, 15-21, 13-21 తేడాతో ఓడిపోయి తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు.

నేడు వెస్టిండీస్‌తో రెండో మ్యాచ్

పట్టు సాధించే లక్ష్యంతో టీమిండియా

రాంచి: ఐదు మ్యాచ్‌ల టీ20ఐ సిరీస్‌లో తమ ఆధిక్యాన్ని మరింత పెంచుకోవాలని భారత్ చూస్తోంది. తొలి మ్యాచ్‌లో ఘోర పరాజయం పాలైన వెస్టిండీస్, శుక్రవారం రాంచీలో టీమిండియాతో తలపడనుంది. ఇప్పటికే ఈ సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఉన్న భారత, ముఖ్యంగా ఓపెనర్‌గా సంజు సామ్సన్ స్థానం, బౌలింగ్ కూర్పు విషయంలో కొన్ని ఎంపిక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. సామ్సన్ తన గత నాలుగు ఇన్నింగ్స్‌లలో కేవలం 9, 7, 2, 11 పరుగులు మాత్రమే చేయడంతో ఈ వికెట్ కీపర్‌బ్యాటర్‌పై ఒత్తిడి పెరుగుతోంది. వైభవ్ సూర్యవంశీ జట్టులోకి రావడంతో, భారత్‌కు ఓపెనర్‌గా ప్రత్యామ్నాయం లభించింది. టీ20 వ్యూహంలో కీలక పాత్ర పోషించిన అభిషేక్ శర్మతో పాటు, అయ్యర్ ప్రదర్శన మిడిల్ ఆర్డర్‌లోని ఆందోళనలను తగ్గించింది. సిరీస్ ఆరంభ మ్యాచ్‌లో అతను సాధించిన తొలి టీ20ఐ సెంచరీ, ఛేజింగ్‌పై భారత్‌ను నియంత్రణలో ఉంచడమే కాకుండా, బ్యాటింగ్ విభాగానికి మరింత ఊపునిచ్చింది. మయాంక్ యాదవ్ తన తొలి ఓవర్‌లోనే 16 పరుగులు ఇవ్వడంతో, బౌలింగ్ కూర్పు కూడా పరిశీలనకు రావచ్చు. అతను చివరికి వెస్టిండీస్ టాప్ స్కోరర్, 56 పరుగులు చేసిన షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్‌ను అవుట్ చేసినప్పటికీ, మొత్తం మీద ధారాళంగా పరుగులు ఇచ్చాడు. నమన్ ధీర్ 3/31తో భారత్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలవగా, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. భారత్ ప్రత్యామ్నాయ పేస్ బౌలింగ్ జోడీని పరిశీలించే అవకాశం ఉంది, అందులో నితీష్ కుమార్ కూడా ఒక ఎంపిక. అయితే, కొత్త బంతితో అతని ప్రయోగం ఎల్లప్పుడూ ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. ప్రారంభ మ్యాచ్‌లో భారత స్పిన్ బౌలింగ్ దాడి ముఖ్యంగా ప్రభావవంతంగా ఉంది. కుల్దీప్, అక్షర్ కలిసికట్టుగా బౌలింగ్ చేసి వెస్టిండీస్ బ్యాటింగ్ లైనప్‌ను కట్టడి చేయగా, ధీర్ తన ఆఫ్‌స్పిన్‌తో మరో ఎంపికను జోడించాడు.

ఇదిలా ఉండగా, సిరీస్‌ను సమం చేయడానికి వెస్టిండీస్‌కు మరింత బలమైన బ్యాటింగ్ ప్రదర్శన అవసరం. లక్నోలో షాయ్ హోప్, రూథర్‌ఫోర్డ్ అర్ధ సెంచరీలు సాధించారు, కానీ పవర్‌ప్లేలో మూడు వికెట్లు పడిన తర్వాత ఈ జోడీ ఇన్నింగ్స్‌ను పునర్నిర్మించింది. రాంచీ మరో ఆసక్తికరమైన సవాలును అందించవచ్చు. భారత్ జట్టులో శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, సంజు శాంసన్ (వికెట్‌కీపర్), తిలక్ వర్మ, శివం దూబే, వైభవ్ సూర్యవంశీ, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, నితీష్ కుమారె, అర్ష్దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్ ఉన్నారు.

చైనా స్మాష్ టేబుల్ టెన్నిస్..

సెమీఫైనల్‌కు మనుష్, ఠక్కర్ జోడీ

సెమీస్‌లో దియా-మనుష్ ఔట్

బీజింగ్: చైనా స్మాష్ 2026, మనుష్ షా-మానవ్ ఠక్కర్ పురుషుల డబుల్స్ సెమీఫైనల్‌కు చేరగా, సెమీస్‌లో దియా-మనుష్ ఔటయ్యారు. గురువారం బీజింగ్‌లో జరిగిన చైనా స్మాష్ పురుషుల డబుల్స్ సెమీఫైనల్స్‌కు మనుష్ షా, మానవ్ థక్కర్ ముందంజ వేశారు. ఈ జంట చైనాకు చెందిన లియాంగ్ జింగ్‌కున్ మరియు జియాంగ్ పెంగ్‌లను వరుస గేమ్‌లలో 3-0 (11-9, 11-5, 11-4) తేడాతో ఓడించి సెమీఫైనల్‌లోకి ప్రవేశించారు. వారు ఇప్పుడు స్వీడన్‌కు చెందిన ఆంటోన్ కాల్‌బర్గ్, క్రిస్టియన్ కార్ల్‌సన్ లేదా దక్షిణ కొరియాకు చెందిన లిమ్ జోంగ్‌హూన్, ఓ జున్‌సంగ్‌లలో ఒకరిని ఎదుర్కొంటారు.

మ్యాచ్ సాగేకొద్దీ భారత ద్వితీయ శ్రేణి జట్టు మరింత ఆధిపత్యం చెలాయించడంతో, 19 నిమిషాల్లోనే విజయం లభించింది. ఇదిలా ఉండగా, మిక్స్‌డ్ డబుల్స్ సెమీఫైనల్స్‌లో మనుష్, దియా చితాలే జోడీ, చైనీస్ తైపీకి చెందిన లిన్ యున్‌జు, చెంగ్ ఐచింగ్ జోడీ చేతిలో 3-1 (11-7, 9-11, 12-10, 11-4) తేడాతో ఓడిపోయి టోర్నమెంట్ నుండి నిష్క్రమించింది.



ఒకే వేదికగా అన్ని డిపాజిట్ల వివరాలు

సిఏఎస్ యాప్ కోసం ఆర్బీఐ కసరత్తు

ముంబయి, అక్టోబరు 8: తమ కుటుంబం, పిల్లల భవిష్యత్తు కోసం వివిధ రకాల పెట్టుబడులు చేసే ఇన్వెస్టర్లకు బిగ్ రిలీఫ్ లభించనుంది. షేర్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్ మదుపరులకు సుపరిచితమైన కన్సాలిడేటెడ్ అకౌంట్ స్టేట్మెంట్ విస్తరణ దిశగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటి వరకు కేవలం షేర్లు, డిపాజిటరీ హోల్డింగ్స్, మ్యూచువల్ ఫండ్ పోర్ట్ ఫోలియోలకే పరిమితమైన సిఏఎస్ స్టేట్‌మెంట్లో త్వరలోనే వివిధ బ్యాంకుల్లో ఉన్న ఫిక్స్‌డ్ డిపాజిట్లు వివరాలు సైతం కనిపించనున్నాయి. అంటే ఇక నుంచి స్టాక్స్, మ్యూచువల్ ఫండ్స్‌తో పాటు బ్యాంక్ డిపాజిట్ల వివరాలు ఒకే చోట చూసుకోవచ్చు. ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను ట్రాక్ చేసేందుకు వివిధ రకాల యాప్స్ ఉపయోగిస్తుంటారు. ఆయా యాప్స్‌ని విడి విడిగా యాక్సెస్ చేయడం కొంచం ఇబ్బందిగా ఉంటుంది. ఇకపై ఇలాంటి ఇబ్బంది లేకుండా అన్నింటికీ ఒకే యాప్ ద్వారా యాక్సెస్ చేసే అవకాశం లభించనుంది. ఆర్థిక వివరాలన్నీ ఒకే చోట చూసుకునే విధంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక మార్పులు తీసుకురానుంది. కన్సాలిడేటెడ్ అకౌంట్ స్టేట్‌మెంట్‌లో ఒక వ్యక్తికి సంబంధించిన స్టాక్స్, మ్యూచువల్ ఫండ్స్, డీమ్యాట్ ఖాతా వివరాలు కనిపిస్తాయి. త్వరలోనే బ్యాంకుల్లోని ఫిక్స్‌డ్ డిపాజిట్ వివరాలు సైతం సిఏఎస్‌లో చేరనున్నాయి. దీంతో ఆదాయపు పన్నుకు సంబంధించిన ఫారం 26ఏఎస్ మాదిరిగా అన్ని పెట్టుబడులు ఒకే చోట తెలుసుకోవచ్చు. డిసెంబరు 31, 2026 నాటికి సిఏఎస్‌లో బ్యాంక్ డిపాజిట్లను కూడా చూపించే విధంగా సిస్టమ్ అప్డేట్ చేయాలని ఆర్‌బిఐ నిర్ణయించింది.

రైట్స్ ఇష్యూద్వారా ఓలా ఎలక్ట్రిక్ రూ.1000 కోట్ల సమీకరణ

ముంబయి, అక్టోబరు 8: రైట్స్ ఇష్యూ ద్వారా రూ.1,000 కోట్ల నిధుల సమీకరణకు ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ కంపెనీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు ఆమోదం తెలిపింది. కంపెనీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో, గరిష్టంగా రూ.1,000 కోట్ల విలువైన పాక్షికంగా చెల్లించిన ఈక్విటీ షేర్లను రైట్స్ ఇష్యూ ద్వారా జారీ చేయడానికి ఆమోదం లభించింది. ఇందులో భాగంగా సెబీకి నివేదిక సమర్పించింది. మొత్తం రూ.999.74 కోట్ల విలువైన 37.03 కోట్ల పాక్షికంగా చెల్లించిన ఈక్విటీ షేర్ల రైట్స్ ఇష్యూ నిబంధనలకు బోర్డు ఆమోదం తెలిపింది. ఒక్కో షేరుకు రూ.27 ధర (ఇందులో రూ.17 ప్రీమియం కలిసి ఉంది) నిర్ణయించారు. భవిష్ అగర్వాల్ నేతృత్వంలోని ఈ సంస్థ, రైట్స్ ఎంటైటిల్‌మెంట్ పొందడానికి అర్హులైన వాటాదారులను నిర్ణయించడానికి ఈనెల 13ను రికార్డ్ తేదీగా నిర్ణయించింది. ఈ ఇష్యూ ఈనెల 22న ప్రారంభమై 30న ముగుస్తుంది. రైట్స్ ఎంటైటిల్‌మెంట్లను మార్కెట్ ద్వారా బదిలీ చేయడానికి అక్టోబరు 26, 2026, సోమవారం వరకు అవకాశం ఉంటుందని సంస్థ తెలిపింది. రికార్డ్ తేదీ నాటికి పూర్తి చెల్లింపు జరిగిన ఈక్విటీ షేర్లను కలిగి ఉన్న అర్హులైన వాటాదారులకు, ప్రతి 25 షేర్లకు 2 రైట్స్ ఈక్విటీ షేర్ల చొప్పున కేటాయింపు నిష్పత్తిని బోర్డు నిర్ణయించింది. ఆర్థిక సంవత్సరం ఈ ఏడాది తమొదటి త్రైమాసికంలో ఈ ఈవీ తయారీ సంస్థ ఏకీకృత నికర నష్టం రూ.336 కోట్లకు తగ్గింది.

రూ.11లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి

భారీ నష్టాల్లో సెన్సెక్స్, నిఫ్టీ

ముంబయి, అక్టోబరు 8: భారత స్టాక్ మార్కెట్ గురువారర తీవ్ర సంక్షోభంలోకి జారిపోయి భారీ నష్టాలను చవిచూసింది. గ్లోబల్ మార్కెట్లలో ఉద్రిక్తతలు, ఆర్‌బిఐ వడ్డీ రేట్ల పెంపు, విదేశీ ఇన్వెస్టర్ల నిరంతర అమ్మకాల తీవ్రతతో దలాల్ స్ట్రీట్‌లో విక్రయాల సునామీ సృష్టించింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ మునుపటి ముగింపు స్థాయి నుండి 1,168.08 పాయింట్లు పడిపోయి 71,470.62 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 50 సూచీ 393.95 పాయింట్లు క్షీణించి 22,209.10 వద్ద ముగిసింది. ఈ తీవ్ర పతనం కారణంగా బిఎస్ఇలో నమోదైన కంపెనీల మొత్తం మార్కెట్ విలువ ముందురోజున్న రూ. 4,72, 35,273.39 కోట్ల నుండి ఏకంగా రూ. 10,41, 698.78 కోట్లుతగ్గి రూ. 4,61,93,574.61 కోట్లకు పడిపోయింది. మార్కెట్ పతనానికి ప్రధానంగా ఐదు బలమైన ప్రతికూల అంశాలు దోహదం చేశాయి.పశ్చిమ ఆసియాలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరిగి హోర్ముజ్ జలసంధిలో నౌకలపై దాడుల భయాలు నెలకొనడంతో బ్రెంట్ క్రూడ్ ధర 3 శాతానికి పైగా పెరిగి బ్యారెల్‌కు 103 మార్కుకు చేరింది. చమురు దిగుమతి వ్యయం పెరిగితే ద్రవ్యోల్బణం, కరెంట్ ఖాతా లోటు హెచ్చరిస్తాయనే భయాలు వ్యాపించాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు బుధవారం ఒక్కరోజే 6,100 కోట్లకు పైగా విలువైన భారతీయ షేర్లను విక్రయించడం మార్కెట్‌పై విపరీతమైన ఒత్తిడిని తెచ్చింది. ఆర్‌బిఐ తన కీలక రెపో రేటును 0.25 శాతం పెంచి 5.50 శాతానికి చేర్చడమే కాకుండా ద్రవ్యవిధాన వైఖరిని క్రమబద్ధమైన కఠినతరం వైపు మళ్లించడంతో డిసెంబర్ నాటికి రెపో రేటు 6శాతానికి చేరవచ్చనే ఆందోళనలు పెరిగాయి. అదానీ గ్రూప్ స్టాక్స్ పదునైన క్షీణతను నమోదు చేయడం మార్కెట్‌ను మరింత కుంగదీసింది. నిఫ్టీ 50లో అదానీ ఎంటర్‌ప్రైజెస్ అత్యధికంగా 8 శాతం పడిపోగా, అదానీ గ్రీన్ ఎనర్జీ 9 శాతం, అదానీ పవర్ 6 శాతం, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 5 శాతం మరియు అదానీ పోర్ట్స్ 4 శాతానికి పైగా పతనమయ్యాయి. రంగాల వారీగా పరిశీలిస్తే ఒక్క నిఫ్టీ ఐటీ 0.76 పెరుగుదల మినహా మిగిలిన అన్ని రంగాలు తీవ్ర నష్టాలను మూటగట్టుకున్నాయి. నిఫ్టీ మెటల్ అత్యధికంగా 3.27 శాతం, నిఫ్టీ ఆయిల్ గ్యాస్ 2.52 శాతం, నిఫ్టీ ఫార్మా 2.22 శాతం, నిఫ్టీ ఎఫ్ఎమ్‌సిజి 1.89 శాతం మరియు నిఫ్టీ ఆటో 1.85 శాతం చొప్పున పడిపోయాయి.

డిజిటల్ చెల్లింపులపై మర్చంట్ ఫీజుల అమలు వాయిదా పడుతుందనే వార్తలతో పేటీఎం, మొబిక్విక్ షేర్లు 7.7 శాతం నష్టపోగా, ఐటీసీ షేరు 3 శాతం క్షీణించింది. కమోడిటీ మార్కెట్‌లో బ్రెంట్ ముడిచమురు డిసెంబరు సెటిల్‌మెంట్‌ధర 4.29 డాలర్లు పెరిగి బ్యారెల్‌కు 104.49 డాలర్లు కొనసాగింది. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో భారత రూపాయి 96.85గా నమోదయింది. ముందురోజు 96.75తో పోలిస్తే మరింత క్షీణించింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు డిసెంబరు 4వ తేదీ సెటిల్‌మెంట్‌దరలు 0.14శాతంపెరిగి రూ.1,49, 319కి చేరాయి.

షెడ్యూల్డు బ్యాంకుల జాబితానుంచి పేటిఎం తొలగింపు

ముంబయి, అక్టోబరు 8: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం1934లోని రెండో షెడ్యూల్ నుంచి పేటిఎం పేమెంట్స్ బ్యాంక్‌ను మినహాయించినట్లు ఆర్బీఐ ఒక నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. సాధారణంగా షెడ్యూల్డ్ బ్యాంకులుగా గుర్తింపు పొందిన బ్యాంకుల వివరాలు ఈ జాబితాలో ఉంటాయి. జూలై 31న జారీ చేసిన ఈ నోటిఫికేషన్‌ను సెప్టెంబర్ 7న గెజిట్ ఆఫ్ ఇండియాలో ప్రచురించారు. నియంత్రణ నిబంధనలను పదేపదే ఉల్లంఘిస్తుండటంతో, ఈ యేడాది ఏప్రిల్‌లోనే పేటిఎం పేమెంట్స్ బ్యాంక్ లైసెన్స్‌ను ఆర్బీఐ రద్దు చేసింది. సంస్థ కార్యకలాపాలు డిపాజిటర్ల ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా ఉన్నాయని ఆ సమయంలో కేంద్ర బ్యాంకు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. కొన్నేళ్లుగా పేటిఎం పేమెంట్స్ బ్యాంక్ ఆర్బీఐ నిశిత పర్యవేక్షణలో కొనసాగుతోంది. 2022 మార్చిలో పలు లోపాలను గుర్తించిన ఆర్బీఐ, కొత్త కస్టమర్లను చేర్చుకోకుండా బ్యాంకుపై నిషేధం విధించింది. సమగ్ర ఐటీ ఆడిట్ కోసం స్వతంత్ర సంస్థను నియమించాలని ఆదేశించింది.

టిసిఎస్ నికరలాభం రూ.13,884 కోట్లు

ముంబయి, అక్టోబరు 8: దేశంలోని అతిపెద్ద ఐటీ కంపెనీ, టాటా గ్రూప్ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఆర్థిక ఫలితాల్లో అదరగొట్టింది. ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో ఏకీకృత నికర లాభం రూ.13,884 కోట్లుగా చూపించింది. గత యేడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.12,075 కోట్లతో పోలిస్తే ఈసారి కంపెనీ నికర లాభం 15 శాతం మేర పెరిగినట్లు తెలిపింది. ఈ క్రమంలో తమ షేర్ హోల్డర్లకు శుభవార్త చెప్పింది. ఈ ఆర్థిక సంవత్సరంకు గానూ రెండో మధ్యంతర డివిడెండ్ చెల్లిస్తామని, ఒక్కో షేరుకు రూ.12 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. ఈ మేరకు గురువారం రోజున త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. ఈ ఆర్థిక యేడాది రెండో త్రైమాసికంలో టిసిఎస్ ఆపరేషన్స్ రెవెన్యూ ఇయర్ ఆన్ ఇయర్ ప్రాతిపదికన చూసుకుంటే 11 శాతం వృద్ధితో రూ.73,188 కోట్లుగా చూపించింది.

గతేడాది ఇదే సమయంలో కంపెనీ ఆదాయం రూ.65,799 కోట్లుగా ఉంది. కాన్‌స్టంట్ కరెన్సీ టర్మ్స్‌లో రెవెన్యూ క్వార్టర్ టూ క్వార్టర్ ప్రాతిపదికన 0.5 శాతం పెరిగింది. ఆపరేటింగ్ మార్జిన్ 24 శాతంగా ఉండగా, నెట్ మార్జిన్ 19 శాతంగా ఉందని టిసిఎస్ తెలిపింది. అంతర్జాతీయ మార్కెట్లలో, చాలా పరిశ్రమ విభాగాలలో కంపెనీ విస్తృత వృద్ధిని సాధించిందని సిఇఒ, ఎండి కె. కృతివాసన్ అన్నారు. పోర్షే, బెస్ట్ బై ఒప్పందాలు ఒక కొత్త తరహా పరివర్తన భాగస్వామ్యాలను సూచిస్తున్నాయన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ని పెద్ద ఎత్తున పారిశ్రామికీకరించడానికి టిసిఎస్ తన క్లయింట్లతో కలిసి పునరావృతమయ్యే ప్లాట్‌ఫారమ్‌లను నిర్మిస్తోందని ఆయన అన్నారు. రెండవ త్రైమాసికంలో వార్షిక ఎఐ ఆదాయం 3.1 బిలియన్ డాలర్లకు చేరుకుని, మొత్తం ఆదాయంలో 10 శాతం దాటిందని తెలిపారు. ఎఐ నేటివ్ సొల్యూషన్స్, ఎఐ ఆధారిత ఎంటర్‌ప్రైజ్ ట్రాన్స్‌ఫర్మేషన్, అటానమస్ గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్, సైబర్‌సెక్యూరిటీ రంగాల నుంచి డిమాండ్ రావడంతో, ఎఐ రంగంలో ఊపు బలంగా కొనసాగుతోందని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ప్రెసిడెంట్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఆర్తి సుబ్రమణియన్ అన్నారు. సెప్టెంబర్ త్రైమాసికంలో కంపెనీ మొత్తం కాంట్రాక్టుల విలువ 9.6 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు టిసిఎస్ తెలిపింది. బలహీన ఐటి డిమాండ్ వాతావరణాన్ని ఇది సూచిస్తోందని పేర్కొంది. వ్యూహాత్మక భాగస్వామ్యాల్లో పోర్షే ఏజీతో 5 యేళ్ల భాగస్వామ్యం, ఎంహెచ్‌పీ, పోర్షే జర్మనీ మేనేజ్మెంట్ అండ్ ఐటి కన్సల్టింగ్ సబ్సిడరీ కొనుగోలు ప్రతిపాదన ఉన్నట్లు పేర్కొంది. భారతదేశంలోని బెస్ట్ బై గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్‌ను టిసిఎస్‌కు బదిలీ చేసి, దానిని ఎఐ కెపాబిలిటీ సెంటర్‌గా మార్చేందుకు ఒక ఒప్పందాన్ని కూడా టిసిఎస్ ప్రకటించింది. ఫలితాల ప్రకటన నేపథ్యంలో టిసిఎస్ షేరు ఒడుదొడుకులకులోనై చివరకు ఫ్లాట్‌గా ముగిసింది. 0.16 శాతం నష్టంతో రూ.2077 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో రూ.2104 వద్ద లాభాల్లో ప్రారంభమై ఒక దశలో రూ.2141.50 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని తాకింది. ఆ తర్వాత పడిపోయింది. రూ.2060 వద్ద కనిష్ఠాన్ని తాకి చివరకు రూ.2077 వద్ద స్థిరపడింది. ఈ స్టాక్ 52 వారాల గరిష్ఠ ధర రూ.3350 వద్ద ఉండగా కనిష్ఠ ధర రూ.1976 వద్ద ఉంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.